శ్రీః

జ్ఞానవాసిష్ఠాంతర్గత

శివమీడేస్తవః

దోర్బల విశ్వనాథశర్మ

హర్షిణీ వ్యాఖ్యానముతో

(ప్రతిపదార్థ - తాత్పర్య - వివరణ)



ప్రకాశకులు

రావి మోహనరావు, M.Sc., M.A.,

404, Janjanam Complex., Opp: 1 Town Police Station,

CHIRALA - 523 157. Cell : 9440115411

శ్రీః

జ్ఞానవాసిష్ఠాంతర్గత

శివమీడేస్తవః

దోర్బల విశ్వనాథశర్మ

హర్షిణీ వ్యాఖ్యానముతో

(ప్రతిపదార్థ - తాత్పర్య - వివరణ)

ప్రథమ ముద్రణ : 29-8-1996 ప్రతులు : 1000

ద్వితీయ ముద్రణ: శ్రీరామనవమి, 08-04-2014 ప్రతులు : 500

వెల : రూ. 60/-

Printed at :
KARSHAK ART PRINTERS
Hyderabad.

D.T.P.
P.PARVATHI
Cell : 7416586775.

అద్వైతసిద్ధాంతప్రతిపాదకమైన, వాల్మీకి ముని కృతమైన 'జ్ఞాన వాసిష్ఠము'న చతుర్థ పాదమున షష్ఠాధ్యాయమున ఉన్న **శివమీడేస్తవము** లోని ప్రతి శ్లోకమున బ్రహ్మసూత్రోపనిషన్మంత్రముల పదములు, వాక్యములు, వాని తాత్పర్యములు అత్యంత రమణీయముగా పొదుగబడినవి. ఇటువంటి ఈ స్తవమునకు వేదాంతమూర్తులైన శ్రీ దోర్బల విశ్వనాథశర్మగారు హర్షిణీ వ్యాఖ్యానమను పేర అర్థ తాత్పర్యములు విపుల వివరణ అందజేసినారు. ఈ వివరణలో అద్వైత సిద్ధాంతమున వచ్చు అనేక పదములను వివరించుట జరిగినది. అక్షరదోషములను సరిచేసి సహకరించిన శ్రీ గరిమెళ్ల సోమయాజులు శర్మ గార్కి నమస్సులు. సాధక పాఠకులీ స్తవమును స్థిరబుద్ధితో అధ్యయనము చేసి ఆనంద ప్రాప్తిని పొందుదురుగాక!



దోర్బల విశ్వనాథశర్మ

శ్రీః

శివమీడేస్తవః

శ్లో॥ వైలక్షణ్యం ధామసు యస్య త్రిషు సిద్ధం
భోజ్యాద్భోక్తుర్భోగత ఏవం త్రివిధాచ్చ ।
యస్మాచ్చ్యుత్యా నాస్తి చ కశ్చిద్వ్యతిరిక్తః
తం చిన్మాత్రం సాక్షిణమేకం శివమీడే ॥ 1 ॥

ప్ర॥ యస్య – ఎవనికి, త్రిషు – మూడు, ధామసు – అవస్థల యందు, వైలక్షణ్యమ్ – విలక్షణత, సిద్ధమ్ – సిద్ధమై యున్నదో, ఏవమ్ – ఇట్లే, త్రివిధాత్ – మూడువిధములుగా నున్న, భోజ్యాత్ – భోజ్యమునకంటే, భోక్తుః – భోక్తకంటే, భోగతః చ – భోగముకంటెను, వైలక్షణ్యమ్ – విలక్షణత, సిద్ధమ్ – సిద్ధమై యున్నదో, యస్మాత్ – ఎవనికంటే, వ్యతిరిక్తః – భిన్నుడయిన వాడు, కశ్చిత్చ – ఎవడును, నాస్తి – లేడో, తమ్ – ఆ, చిన్మాత్రమ్ – జ్ఞప్త్యైకరూపుడైన, ఏకమ్ – ఒక్కడైన, సాక్షిణమ్ – సాక్షియైన, శివమ్ – శివుని, ఈడే – స్తుతించుచున్నాను.

తా॥ జాగ్రత్స్వప్నసుషుప్త్యవస్థలలో తదభిమానులకు విలక్షణముగా భోజ్యభోక్తృ భోగాది త్రిపుటులకతీతముగా సాక్షిరూపుడై చిన్మాత్రుడుగా వెలయు శివుని స్తుతించు చున్నాను. ఆ స్తుత్యుడైన శివునికన్న భిన్నముగా నే పదార్థము లేదని శ్రుతిచేత ప్రతిపాదించబడినది.

వి॥ "తం చిన్మాత్రం సాక్షిణమేకం శివమీడే", ఈ స్తోత్రమునందలి అన్ని శ్లోకముల నాల్గవ పాదముగా మకుటముగా నున్నది. చివరి "శివమీడే" అను పదములు ఈ స్తోత్రనామమై "శివమీడేస్తవ"మని ఈ స్తోత్రము ప్రసిద్ధినొందియున్నది. నలుబదిరెండు శ్లోకముల ఈ స్తుతి జ్ఞాన వాసిష్ఠాంతర్గతమని ప్రతీతినొంది యున్నది. దీనిని ఋషి కృతమందురు. కాని ఆ ఋషి కాని ఆ ఋషులుగాని పేర్కొనబడలేదు. జ్ఞాన వాసిష్ఠమున చతుర్థ పాదమున షష్ఠాధ్యాయమున నున్నట్లు స్తోత్రాంత గద్యవలన తెలియుచున్నది. "జ్ఞానవాసిష్ఠము" ప్రసిద్ధమైన అద్వైత సిద్ధాంత ప్రతిపాదకమైన గ్రంథము. ఆ గ్రంథము ద్వాత్రింశత్సహస్ర శ్లోక పరిమితమని, వాల్మీకి కృతమని అందురు. కాని చతుర్వింశత్సహస్రియగు శ్రీమద్రామాయణము యొక్క శైలికి దీని శైలికి భేదము కానిపించును. ఈ జ్ఞానవాసిష్ఠమునకు పెక్కు సంగ్రహములున్నవి. ఆ సంగ్రహముల శ్లోకముల సంఖ్యలలో భేదములున్నవి. జ్ఞానవాసిష్ఠాన్తర్గతమైన ఈ శివస్తుతిలోని ప్రతి

శ్లోకమున బ్రహ్మసూత్రోపనిషన్మంత్రముల పదములు, వాక్యములు, వాని తాత్పర్యము రమణీయముగా పొదుగబడినవి. **త్రిషు ధామసు యద్భోజ్యం భోక్తాయశ్చ ప్రకీర్తితః** ఇత్యాద్యుపనిషన్మంత్రము యొక్క తాత్పర్యము ఈ శ్లోకము యొక్క ప్రథమార్థమున సంగ్రహింపఁబడినది. **నేహ నానాస్తి కించన** అను శ్రుతి వాక్యము యొక్క **ఏక మేవ అద్వితీయం బ్రహ్మ** అను శ్రుతి వాక్యము యొక్క భావముల సంగ్రహమే ఈ శ్లోకమునందలి మూడవ పాదము. నాల్గవ పాదమైన మకుటమున శివుని యందలి చిన్మాత్ర సజాతీయ విజాతీయ స్వగత భేద శూన్య సాక్షి చైతన్యరూపము స్తుతించబడినది. సుషుప్త్యవస్థయందు అజ్ఞానము భోజ్యము, ప్రాజ్ఞుడు భోక్త, నిద్రావృత్త్యవచ్ఛిన్నచైతన్యము భోగము. స్వప్నావస్థయందు ప్రాతిభాసికపదార్థములు ఇరుకుగదిలో పడుకొన్నవారికి కనఁబడు గజము మొదలగునవి భోజ్యములు, తైజసుడు భోక్త, ప్రాతిభాసిక గజాది వృత్త్యవచ్ఛిన్న చైతన్యము భోగము. జాగ్రదవస్థయందు ఆకాశాది వ్యావహారిక పదార్థములు భోజ్యములు, విశ్వుడు భోక్త, ఆకాశాది వృత్త్యవచ్ఛిన్నచైతన్యము భోగము. ఒక పిండదేహము నందభిమానము గల ఒక జీవునిపై మూడవస్థలు ఒక జీవునికి సంబంధించిన వగుటచే నవి వ్యష్ట్యవస్థలనఁబడును. ఆ జీవుడు వ్యష్టి యనఁబడును. అతడే సుషుప్త్యవస్థ యందు ప్రాజ్ఞుడని, స్వప్నావస్థయందు తైజసుడని, జాగ్రదవస్థయందు విశ్వుడని, యుపనిషత్తులు పేర్కొన్నవి. అనేక పిండముల సమూహమైన బ్రహ్మాండమునందభిమానము గలిగి యుండుటచే ఈశ్వరుడు సమష్టియనఁబడును. వ్యష్టిలో ప్రాజ్ఞుడనబడిన వాఁడే సమష్టిలో అవ్యాకృతుఁడనఁబడును. వీరిరువురు సుషుప్త్యవస్థాభిమానులు. వ్యష్టిలో ప్రాజ్ఞునకు అజ్ఞానము భోజ్యమయినట్లు సమష్టిలో అవ్యాకృతునకు మాయ భోజ్యము. **భోజ్య రూపతయా ప్రకృతిర్మాయా** అని విష్ణుసహస్రనామములలో భోజననామమును వివరించుచు చెప్పిన **శంకరుల** వాక్యము మాయ యొక్క భోజ్యతకు ప్రమాణము. మాయావృత్త్యవచ్ఛిన్నచైతన్యము అవ్యాకృతుని భోగము. వ్యష్టిలో స్వప్నావస్థాభిమాని తైజసుడు భోక్తయైనట్లు సమష్టిలో స్వప్నావస్థాభిమాని హిరణ్యగర్భుడు భోక్త. స్వాప్నిక వృత్త్యవచ్ఛిన్న చైతన్యము అతని భోగము. ఈ హిరణ్యగర్భునకు సూక్ష్మావస్థలో నున్న బ్రహ్మాండమాతనికి భోజ్యము. సమష్టియైన హేతువున ఈశ్వరతత్త్వము కలదు. అవ్యాకృతుని నుండి పుట్టియుండుటచే జన్యత్వహేతువున జీవత్వమును కలదు. ఈ హిరణ్యగర్భుడు ప్రథమ జీవుడని చెప్పఁబడును. **హిరణ్య గర్భస్సమవర్తతాగ్రే భూతస్య జాతః పతిరేక ఆసీత్** అను శ్రుతి వాక్యమిందుకు ప్రమాణము. భూతసమూహమునకొక ప్రభువు హిరణ్యగర్భుడు సృష్ట్యారంభమున పుట్టియుండెను. అని పై శ్రుతి వాక్యమునకర్థము. వ్యష్టిలో జాగ్రదవస్థాభిమాని విశ్వుడు భోక్తయైనట్లు సమష్టిలో వైశ్వానరుడు భోక్త. స్థూలమైన బ్రహ్మాండమాతనికి భోజ్యము వ్యావహారిక విశ్వ వృత్త్యవచ్ఛిన్న చైతన్య మాతని భోగము.

వ్యష్టులైన ఈ విశ్వతైజస ప్రాజ్ఞ భోజ్యభోగములకు సాక్షిగా నున్న శివుడు ఆ భోక్తృభోజ్యభోగములకు విలక్షణుడు. అనగా అతడు భోక్త కాడు. భోజ్యము కాడు. భోగము కాడు. అట్లే సమష్టులైన వైశ్వానర హిరణ్యగర్భావ్యాకృత భోజ్య భోగ్యములకు విలక్షణుడు, అతడు (శివుడు) భోక్తకాడు, భోజ్యము కాడు, భోగము కాడు. తత్సంపర్క రహితుడైన సాక్షి మాత్రమే. లోకమున అసంపృక్తునే సాక్షి యందురు గదా! భోక్తృభోజ్యభోగత్రయమును త్రిపుటి యందురు. ఇట్లే కర్తృకర్మ కరణములను కర్మ త్రిపుటి యని, ధ్యాతృధ్యాన ధ్యేయములను ధ్యాన త్రిపుటి యని పేర్కొందురు. పూర్వార్ధములోని చకారము వలన ఈ అన్ని త్రిపుటులకు శివుడు విలక్షణుడని తెలియుచున్నది. కర్మ జ్ఞాన త్రిపుటులను **జ్ఞానం జ్ఞేయం పరిజ్ఞాతా** (కర్మ ప్రేరక జ్ఞాన త్రిపుటి) **త్రివిధా కర్మ చోదనా, కరణం కర్మ కర్తేతి త్రివిధః కర్మ సంగ్రహః** అని స్వల్పమైన మార్పుతో చెప్పినది. పైన చెప్పిన వ్యష్టి సమష్టి భోజ్య భోక్తృ భోగ వైలక్షణ్యము త్రివిధావస్థల యందుండియు తదతీతుడుగా సాక్షిగానున్న శివుని యందున్నది. భోక్తృ భోజ్య రూపమైన ఈ ప్రపంచము క్షణికము నశ్వరము కావున దానికి సత్త్వము లేదు. ప్రతీతి గోచరమగుచున్నది. కావున అసత్త్వము లేదు. సత్త్వాసత్త్వములు వెలుగు చీకట్లువలె ఒకచోట నుండలేనివి కావున అవి రెండును దాని యందుండవు. ఇకనేమి సత్తని అసత్తని చెప్పరాని అనిర్వచనీయత్వమే దానియందున్నది. అనగా అది కేవలము మిథ్య మాత్రమే. ఈ ప్రపంచమంతయు మిథ్యకాగా సత్తు చిత్తునైన సాక్షి శివుడు. అతడు సన్మాత్రుడు చిన్మాత్రుడు. కావున అతడొక్కడే స్తుత్యుడు, జ్ఞేయుడు, ధ్యేయుడు, గమ్యుడు. స్తుతి జ్ఞాన గతులు స్వస్వరూపుడైన శివుని యందు సంభవించవు. తానే శివుడనని గ్రహించుటయే అతని జ్ఞేయత. అతని కల్పితనామ రూపముల స్తుతించుటయే అతని స్తుత్యత. కల్పితమైన యాతని లోకము నేగుటయే మన గతి యని చెప్పవలెను. అంతకన్న వేఱొకగతి మనకు లేదు. ఇది యంతయు స్వస్వరూపనిష్ఠాప్రాప్తికి సాక్షాత్సాధనము కాకున్నను పరంపరాసాధనము అగును. ఆ సాధనము ననుగ్రహించుటకే ఋషు లీస్తోత్రమును రచించినారు.

అవ॥ నిర్గుణుడు సాక్షియును నైన ఆ శివునకు జ్ఞేయతయే కాని ధ్యేయత లేదని కొందరి మతము. (పంచదశియందు నిర్గుణ బ్రహ్మము ధ్యేయమని నిరూపింపఁబడినది). అయినను ఈ క్రింది శ్లోకమున నిర్గుణ బ్రహ్మధ్యానావశ్యకత, బ్రహ్మము యొక్క ధ్యేయత ప్రతిపాదింపఁబడుచున్నది. ఎట్లు అతడు ధ్యానింపఁదగిన వాడో నిశ్చయించి చెప్పఁ బడుచున్నది.

శ్లో॥ **ఏకో ధ్యేయస్స్వాత్మతయేతి హి వేదాంతే**
యోఽన్యత్సర్వం శ్రూయత ఏష చ సంత్యజ్య ।

సర్వవ్యాపీ భాతి చ భగవాన్యో దేవః
తం చిన్మాత్రం సాక్షిణమేకం శివమీడే ॥ 2 ॥

ప్ర॥ అన్యత్ – ఇతరము, సర్వమ్ – అంతను, సంత్యజ్య – విడచియు, ఏకః – ఒక్కడైన, యః – ఏ శివుడు, స్వాత్మతయా – స్వాత్మరూపముగా, ధ్యేయః – ధ్యానింపఁ దగినవాడు, ఇతి – అని, హి – ప్రసిద్ధముగా, వేదాంతే – వేదాంతమునందు, శ్రూయతే – వినఁబడుచున్నదో, యః – ఏ శివుడు, సర్వవ్యాపీ – అంతట నిండినవాడై, భాతి చ – ప్రకాశించుచునే యున్నాడో, ఏషః – ఈ శివుడే, భగవాన్ – భగవంతుడో, తమ్ – ఆ, చిన్మాత్రమ్ – చిన్మాత్రుడైన, ఏకమ్ – ఒక్కడైన, సాక్షిణమ్ – సాక్షియైన, శివమ్ – శివుని, ఈడే – స్తుతించుచున్నాను.

తా॥ మిథ్యాప్రపంచమునంతను విడచి సత్యమైన శివునే తన ఆత్మగా ధ్యానింప వలెనని వేదాంతమునందు వినిపించుచున్నది. ఆ శివుడే భగవానుడు, ఆయనయే సర్వవ్యాపిగా ప్రకాశించుచున్నాడు. సాక్షియైన ఆ యొక చిన్మాత్ర శివునే స్తుతించెదను.

వి॥ ఉపనిషత్తులలో **ఆత్మావారే ద్రష్టవ్యఃశ్రోతవ్యో మన్తవ్యో నిదిధ్యాసితవ్యః** (ఆత్మ యొక్కటే సాక్షాత్కరించుకొనఁదగినది. వినదగినది – విచారించదగినది) మననము (యుక్తులతో చింతించుట) చేయదగినది. ధ్యానింపఁ(గోర)దగినది. అని చెప్పఁబడినది. ఆత్మసాక్షాత్కారమునకు శ్రవణము (ఉపనిష ద్గురూపదేశ వాక్యార్థ విచారణము) సాక్షాత్సాధనము. దానికి మనన నిదిధ్యాసనములు సహకారులు. ఇది యొక మతము. నీవే ఆ శివుడవై (బ్రహ్మమై) ఉన్నావు అను గురూపదేశము వినబడగానే శివోఽహం (నేనే శివుడను). అహం బ్రహ్మాస్మి (నేనే బ్రహ్మమునై యున్నాను.), అను జ్ఞానము ఉత్తమాధికారులకు కల్గును. మధ్యమ మందాధికారులకు యుక్తులతో శివైక్యమును (బ్రహ్మైక్యమును) చింతించిన పిమ్మట, చిరకాలము శివైక్యము ధ్యానించిన పిమ్మట పైనఁ జెప్పబడిన జ్ఞానము (అనుభవము) కల్గును అనుట మరొక మతము. మనన నిది ధ్యాసములు ఉత్తమాధికార సంపాదనమునకు సహకరించు నట్టివి అని ఈ మతము యొక్క తాత్పర్యము. నిదిధ్యాసమే ఆత్మసాక్షాత్కారమునకు సాక్షాత్సాధనము. శ్రవణ మననములు దానికి పూర్వ మాచరింపఁదగినవి. అని ఈ మతము చెప్పుచున్నది. ఈ మతము లందును స్వాత్మతయా శివ (బ్రహ్మ) ధ్యాన మంగీకరింపఁబడినది. ఈ శ్లోకము ప్రథమార్ధమున ఈ మతముల ననుసరించి స్వాత్మగా శివుని ధ్యానింపవలెనని వేదాంతమునందు వినఁబడుచున్నదని చెప్పఁబడినది. సర్వకర్మ సన్న్యాసము శివాత్మైక్యధ్యానమునకు సహకారియని గమనింపవలెను. **ఈశావాస్య మిదగ్ం సర్వం యత్కించ జగత్యాం జగత్ తేన త్యక్తేన భుంజీథా** అను ఈశోపనిషత్ప్రథమ మంత్రము

ఈ ప్రపంచమంతయు ఈశుని చేతనే నిండి యున్నట్లు భావించి పండులోని తొక్కును వదలి సారమును గ్రహించినట్లు ప్రపంచమును (తద్భోగమును) వర్జించి ఆ ప్రపంచమున వ్యాపించియున్న ఈశ్వరుని సాక్షాత్కారామృతరసమునే ఆస్వాదింప వలెనని చెప్పుచున్నది. ఈ శ్లోకమున **సర్వవ్యాపీ** అను పదము చేత నీ యర్థము సంగ్రహింపఁబడినది. శివుడు భగవానుడు, భగము కలవాడు, భగమనగా సమగ్రములైన ఐశ్వర్యము, వీర్యము, యశస్సు, శ్రీ, జ్ఞానము, వైరాగ్యము ఆరుగుణముల సమూహము. మరికొందరు ఈ యారుగుణముల కితరములైన కళ్యాణగుణములజేర్చి యాగుణములు కలవాడు భగవానుడని చెప్పుదురు. ప్రపంచోత్పత్తివినాశములను, భూతముల గమనాగమనములను విద్యావిద్యల నెఱుగు వాడే భగవానుఁడని మరికొందఱు చెప్పెదరు. ఇతర దేవతలు భోగులు వారి ధ్యానము భోగాసక్తినే పెంచును. శివుడు విరాగిగా యోగిగా పురాణములందు వర్ణింపఁబడినాడు. శివుని ధ్యానించుటచే వైరాగ్యాదులు కలిగి శివైక్యసాక్షాత్కారమునకు కావలసిన యుత్తమాధికారము లభించును. ధ్యాన మనగా సజాతీయ ప్రత్యయ (వృత్తిజ్ఞాన)ముల ప్రవాహము. తైలధారవలె అవిచ్ఛిన్నముగా ప్రవహించు వృత్తి జ్ఞానముల ధార. ఇది జ్ఞానము కాదు. జ్ఞానమనగా **అహం బ్రహ్మాస్మి** అను చరమ వృత్తి జ్ఞానము. ఇది కలిగిన పిమ్మట నేను బ్రహ్మను (శివుడను) అని ధ్యానింప నక్కఱలేదు. “నేను బ్రహ్మ”ను అను అనుభవము కలిగిన పిమ్మట బ్రహ్మానుభవమునకు సాధనమైన ‘నేను బ్రహ్మను’ అను ధ్యాన మనవసరము. రామానుజీయాది మతములలో ధ్యానమే మోక్షసాధనము. దానికి భక్తి యనునది నామాంతరము. జ్ఞానము, (వృత్తిజ్ఞానము) కర్మ (నిష్కామముగా సత్కర్మల నిత్యనైమిత్తి కాదుల ననుష్ఠించుట) అను రెండును అంగములు. మనస్సున కలుగు స్పందము వృత్తిజ్ఞానము. ధ్యానమున నీ స్పందములనేకములున్నను అవి యేక స్వాత్మ విషయములు. ఈ యేక విషయక మనఃస్పందముల సమూహమే ధ్యానము. మనస్సున నీ స్పందములు లేకుండుటను లయము అని సమాధియని పేర్కొందురు. ఇది ధ్యానాంతర కాలికము. ధ్యాన పూర్వాంగములు యమము, నియమము, ఆసనము, ప్రాణాయామము, ప్రత్యాహారము, ధారణ అనునవి. సమాధ్యంతములైన యష్టాంగములు చిత్తవృత్తి నిరోధరూపమైన యోగమునకంగములు. ఈ చిత్తవృత్తి నిరోధరూపమైన యోగముచేత స్వస్వరూపావస్థానము కలుగును. ఇదియే మోక్షము. ఇది యోగుల మతము. అద్వైతమతమున కర్మ బహిరంగసాధనము. ధ్యాన మంతరంగ సాధనము. అయినను జ్ఞానమువలె సాక్షాత్సాధనములు కావు. కాని కర్మకన్న ధ్యానమునకు జ్ఞానసాధనములలో విచారణముతో పాటు తగినంత స్థానమున్నది. అందుకే ఈ శ్లోకమున **అన్యత్సర్వం సంత్యజ్య శివ ఏక స్వాత్మతయా ధ్యేయః।** అన్యమంతయు వదలి శివుడొక్కడే స్వాత్మగా ధ్యానింపఁదగినవాడు అని చెప్పఁబడినది. ధ్యానము భావనము, ఉపాసనము అనియు

పేర్కొనఁబడును. మనస్సునకేకాగ్రత కలిగించుటకు ధ్యానము మిక్కిలి యుపయోగపడును. **కర్మాణి చిత్తశుద్ధ్యర్థమేకాగ్రార్థముపాసనా** (చిత్తశుద్ధికై కర్మ, చిత్తము యొక్క ఏకాగ్రత కొఱకు ఉపాసనము చేయదగినవి) అని పెద్దలు చెప్పినారు. చిత్తమునందు నిష్కామత యేర్పడుట చిత్తము శుద్ధమైన దనుటకు నిదర్శనము. నిష్కామముగా కర్మ యాచరింప దగినదని భగవద్గీత పలు మారులు చెప్పియున్నది. చిత్తమునందు నిష్కామత యేర్పడినచో వైరాగ్యమేర్పడినట్లే. వైరాగ్యము ఆత్మవిచారసాధన చతుష్టయములలో రెండవది. వైరాగ్యమేర్పడవలెనన్న నిత్యానిత్య వస్తువివేకము కావలెను. ఇది భోగములందలి దోషముల దర్శనము చేత నేర్పడును. ఇది సాధనచతుష్టయమున మొదటిది. సాధనచతుష్టయములో మూడవది శమాది షట్క సంపత్తి. శమము, దమము, ఉపరతి, తితిక్ష, శ్రద్ధ, సమాధానము అను ఆఱుగుణములు కల్గియుండుటను **శమాది షట్క సంపత్తి** యందురు. వీనిలో మొదటిదైన శమము. ఏకాగ్రచిత్తమున నేర్పడునట్టిది. శమము కలుగవలెనన్న చిత్తమున నేకాగ్రత యేర్పడవలెను. ఈ యేకాగ్రత ధ్యానము (ఉపాసనము) వలన సిద్ధించును. కావుననే శివధ్యాన మవసరము. అందుచేతనే స్వాత్మ రూపమున శివుని ధ్యానము చేయుట ఆవశ్యకమని ఈ శ్లోకమున చెప్పబడినది.

అవ॥ శివుని ధ్యేయత పై శ్లోకమున చెప్పఁబడినది. శివుని స్వరూపము తెలియనిదే యాతని ధ్యానము చేయుటకు వీలుకాదు. కావున ఈ క్రింది శ్లోకమున శివుని స్వరూపము నిరూపింపఁబడుచున్నది.

శ్లో॥ ఆకాశోఽయం స్యాద్యది దహరో నానందః
కోహ్యేవాన్యాత్ప్రాణభృదత్ర గతః ప్రాణ్యాత్ ।
భూమానందః ప్రత్యగభిన్నస్సకలాత్మా
తం చిన్మాత్రం సాక్షిణమేకం శివమీడే ॥ 3 ॥

ప్ర॥ యది – ఒకవేళ, దహరః – హృద్గతమైన, ఆకాశః – ఆకాశమై, అయమ్ – ఈ శివుడు, ఆనందః – ఆనందస్వరూపుడు, న – కానిచో, కోహిఏవ ప్రాణభృత్ – ఏ ప్రాణి మాత్రము, అత్ర – ఇక్కడ, గతః – ఉన్నవాడై, అన్యాత్ – ఇతరులు (అపాన కర్మనొనరించును), ప్రాణ్యాత్ – ప్రాణ నకర్మ నొనరించును, అయమ్ – ఈశ్వరుడు, సకలాత్మా – సర్వాత్మకుడు భూమానందః – అపరిమితానందస్వరూపుడు, ప్రత్యగభిన్నః – స్వాత్మాభిన్నుడు, తమ్ – ఆ, చిన్మాత్రమ్ – చిన్మాత్రుడైన, సాక్షిణమ్ – సాక్షియైన, ఏకమ్ – ఒక్కడైన, శివమ్ – శివుని, ఈడే – స్తుతించెదను.

తా॥ ప్రాణముల ధరించు జీవుడు దహరాకాశస్వరూపుడుగా శూన్యాకాశ మాత్రుడుగా నుండి ఆనందస్వరూపుడుకానిచో ప్రాణాపానక్రియలు నిష్ప్రయోజనములు. సమస్తజీవులకు స్వాత్మరూపుడైన అపరిమితానందస్వరూపుడైన ఆ శివుడు స్వాత్మకభిన్నుడుగానే ఉన్నాడు. అట్టి చిన్మాత్రుడైన, సాక్షియైన ఒక్కడైన, శివుని స్తుతించెదను.

vi॥ తైత్తిరీయోపనిషత్తు యొక్క ఏడవ అనువాకమున **కోహ్యేవాన్యాత్కః ప్రాణ్యద్యదేష ఆకాశ ఆనందో న స్యాత్** అను వాక్యము కలదు. దానిని వ్యాఖ్యానించుచు **శ్రీశంకరు** లాకాశ శబ్దమును సప్తమ్యంతముగా స్వీకరించి పరమవ్యోమ రూపమైన ఆకాశమను గుహ యందు – అని వివరించినారు. ఆకాశ శబ్దము ప్రథమాంతముగా స్వీకరింపఁ బడినదీ శ్లోకమున. బ్రహ్మసూత్రములందు **ఆకాశస్తల్లింగాత్** అను సూత్రమున ఆకాశ శబ్దము భూతాకాశవాచి కాదని బ్రహ్మవాచి యని చెప్పఁబడినది. ఈ శ్లోకమున ఆకాశోపమములైన జీవేశులిరువురు భూమానందాకాశాభిన్నులుగా ప్రత్యగభిన్నః అనుపదముతో చెప్పఁబడినారు. ప్రాణాపానములు స్థూల జడ క్రియలుకావు. చైతన్యము నావిష్కరించు ప్రాణభృత్ క్రియలు. ప్రాణము జడమే యైనను చైతన్యము ప్రాణమునకు ప్రాణమై యున్నది. అనగా ప్రాణమునకు ప్రాణత్వము కలిగించునట్టిది. ఆ ప్రాణమే లేకున్న శరీరేంద్రియక్రియ లేవియును ప్రవర్తించవు. ఈ ఉపనిషత్తులలో ఇంద్రియములు ప్రాణముతో వివరించు కథనమొకటి యున్నది. దాని సారము "ఇంద్రియముల సాయము ప్రాణమున కక్కఱలేదు. కాని ప్రాణములేని శరీరమున నవి నిలువక వివశములై ప్రాణముతో పాటే వెడలిపోవు ననుట". ప్రాణనాపానములు రెండు ప్రాణక్రియలు. ప్రాణనమనగా ఉచ్ఛ్వాసనము. అపానమనగా నిశ్శ్వాసనము. ఈ క్రియ లానందము కొఱకు చేయఁబడుచున్నవి. ఆ యానందమే ఈ శరీరమునలేనిచో నా క్రియలు నిష్ప్రయోజనములు. బ్రతుకుట బ్రదుకుట కొఱకు కాదు. ఆనందము కొఱకు బ్రతుకుటలో ఆనందమున్నది. కావున జీవులు బ్రతుకుచున్నారు. అదిగాక స్వస్వరూనాందోపలబ్ధికి ప్రాణేంద్రియాది యుక్తమైన దేహోపాధియవసరము. కావున జీవులు బ్రతుకుచున్నను బ్రతుకు యొక్క ఈ పరమార్థమును గుర్తించని జీవులు విషయానందోపలబ్ధితో తృప్తి పడుచు బ్రతుకుచున్నారు. విషయానందము అపేక్షిత విషయప్రాప్తిలో కలుగును. అపేక్షిత విషయప్రాప్తి కలుగక నిరాశులై కొందఱు విషాదుల నుపయోగించి మృతిచెందుచున్నారు. కొందరు ధర్మమునకై ప్రాణముల తృణ ప్రాయముగా విడుచుచున్నారు. మొత్తము మీద అవివేకి జీవులు విషయానందము కొఱకు, వివేకి జీవులు స్వస్వరూపానందోపలబ్ధి కొఱకు యత్నించుచు బ్రతుకుచున్నారు. ప్రాణాపానములు స్వకారణాధిష్ఠానమైన ఆనందము నుండి వెలువడి పునస్తత్ప్రాప్తి కొఱకే ప్రయాణించుచున్నవి. వారి అంతిమగమ్యము ఆయానందమే. మధ్య కాలమున నెన్నో శరీరములలో ప్రవేశించి వాని నుండి నిష్క్రమించి జన్మ మరణముల నొందుచు సుదీర్ఘముగా ప్రాణ ప్రయాణము సాగుచున్నది. అంతిమ జన్మయందు ప్రాణి శివాత్మైక్య జ్ఞానమనెడి స్వస్వరూపా నందోపలబ్ధి నందినప్పుడా సుదీర్ఘప్రయాణము ముగియుచున్నది. శివాత్మైకజ్ఞానము కలిగిన ప్రాణి మరల జన్మించదు.

కావున నాతని కాజన్మమే అంతిమము. అదియే చరమజన్మము. ఆ జన్మమందలి మరణము చివరి యపాననము. మరల ప్రాణనము లేదు. ప్రాణనాపాననములు ఉచ్ఛ్వాస నిశ్శ్వాసములు అని చెప్పుట జరిగినది. అవి గతి బేధములు. ఒక చోటి నుండి మరొొక చోటునకు గదలుట గతి యనఁబడును. లోపలి గాలి (అపానము) బయటకు పోవుట నిశ్శ్వాసము. మరల లోపలికి చేరుట యనిశ్చితము కావున ఒక విధముగా నది మరణము వంటిది. ఉచ్ఛ్వాసము బయటి గాలి (ప్రాణము) లోపలికి పోవుట ఒక విధముగా నిది జననము. జన్మము లేనిదే మరణము లేదు. మరణము లేనిదే జననము లేదు. జనన మరణములు అనాదులు. అట్లే ఉచ్ఛ్వాస నిశ్శ్వాసము లనాదులు. నిశ్శ్వాసము లేనిదే ఉచ్ఛ్వాసము లేదు. ఉచ్ఛ్వాసము లేనిదే నిశ్శ్వాసము లేదు. వాయువునకు కదలిక లేదనగా వాయువే లేదనుటయే. అప్పుడది ఆకాశమున లీనమగును. అట్లే ఉచ్ఛ్వాస నిశ్శ్వాసములు లేవనగా ప్రాణావాయువు స్తంభమేర్పడుట. అట్టి స్తంభము నందరి శరీరమునం దేమూలనో కదులు చుండును. యోగులు ప్రాణస్తంభన మొనరించెదరు. అది దీర్ఘకాలము చేయుట యోగులకును అసాధ్యము. ఉచ్ఛ్వాసమున సోకారధ్వని యేర్పడును. నిశ్శ్వాసమున హంకార ధ్వని యేర్పడును. అవి రెండును కలసి **సోఽహం** (ఆ శివుడనే నేను) అను నర్థము నొసగును. ఈ సోఽహం ధ్వనుల పునఃపునరావృత్తి అప్రయత్నముగా జరుగుచుండును. కావున నిది యొక విధముగా చేయబడని జపము. జపము కాని జపము. అనగా అజప. దీనికి అజపగాయత్రి యని పేర్కొనుట కలదు. గాయత్రి ప్రథమ పాదము తత్పదార్థమును, ద్వితీయ పాదము త్వం పదార్థమును, తృతీయ పాదము తదుభయైక్యమును చెప్పును. అనగా ప్రథమ పాదము తత్పదార్థమును, ద్వితీయ పాదము అహం పదార్థమును, తృతీయ పాదము తదుభయైక్యమును చెప్పుననుటయే కదా! **తత్త్వమసి** ఉపదేశవాక్యము, **సోఽ**హమస్మి అనుభవవాక్యము. ఉచ్ఛ్వాసనిశ్శ్వాసముల యావృత్తితో దీర్ఘవర్తులత్వమందిన ప్రాణము లింగరూపమందుటచే శైవులు ప్రాణమును ప్రాణలింగమందురు. తద్ధ్యానము ప్రాణలింగోపాసనమనఁబడును. సోఽహమను మంత్రమునకు హంసమంత్రమని పేరు. సోఽహం సోఽహం సోఽహం సోఽహం సోయను నిట్టి యావృత్తిలో హంస పదస్ఫూర్తి యుండుట చేత దీనికి హంస మంత్రమనియు పేరుకలదు. హంస యనునదొక పక్షి. అన్ని పక్షులకువలె దానికి రెండు రెక్కలుండవలెగదా! ఉచ్ఛ్వాస నిశ్శ్వాసములు (ప్రాణనాపానములు) ఈ ప్రాణహంస యొక్క రెండు పక్షములు. అనగా రెండు ఱెక్కలు. తత్త్వాలలో "గూటిలోని రామచిలుక" హంసకు బదులుగా వెలసిన పక్షి. కాని ఱెక్కలు మాత్రము ప్రాణనాపాననములే. "సోఽహమ్" అను అక్షరముల యావృత్తి కాని ఉచ్ఛ్వాస నిశ్శ్వాసముల యావృత్తితో పాటు తదక్షరముల యావృత్తిని చేయుట కాని జప రూపములే. ఇది సోఽహమ్ అను ధ్యానము కాదు. సోఽహమ్ అను అనుభవమసలే కాదు. కాని

దానికి పరంపరాసాధనము. ఈ సాధనము భూమానందప్రాప్తికి పరంపరాహేతువని ఈ శ్లోకము సూచించుచున్నది. సోహమ్ అను అక్షరముల యావృత్తి జపమని చెప్పుట జరిగినది. పాతంజలయోగ సూత్రము **తజ్జపస్తదర్థ భావనమ్** అనునది అర్థభావనమును జపముగా చెప్పినమాట యదార్థమే. కాని అంతగా అది వ్యవహారారూఢముకాదు. అర్థభావనమును జపమనుట కన్న వ్యవహారముననుసరించి ఆ వృత్తి లేక పోవుట చేత ధ్యానమనుటయే యుచితము. కొందఱు అర్థము అంశి, అంశము (లేక) అంగి, అంగము, అని ద్వివిధముగా నుండును, అంశి యొకటైనపుడు యంశములు వేరువేరై యుండుట జ్ఞాన విషయము, వృత్తి జ్ఞానముల ధారను ధ్యానము అనుట సమంజసముగా నుండును అని అందురు. మరి కొందఱు ఇది ఏకవిషయజ్ఞానధార కాకపోవుటచే ధ్యానమనుట సమంజసము కాదు అది భావన అని అందురు. కాని విషయమైన అంశి యొకటే యున్న జ్ఞానముల ధార కావున ధ్యానమనఁబడుట కభ్యంతరముండరాదు. ఈ పక్షమున ధ్యానభావనములు పర్యాయప్రాయము లేయగును. పక్షాంతరమున భావనము వేఱు ధ్యానము వేఱు. ఈ పక్షాంతరమున అర్థ భావనము ధ్యానము కాకున్నను మననముకు దగ్గరగా నుండును. మననము ఆత్మసాక్షాత్కారమునకు విచారణ ధ్యానము కాకున్నను మననముకు దగ్గరగా నుండును. మననము ఆత్మసాక్షాత్కారమునకు విచారణ వలె సాక్షాత్సాధనము కాకపోయినను ధ్యానమువలె పరంపరా సాధనము అగును.

అవ॥ పై శ్లోకము నందలి ప్రాణనాపాననములు అజపా గాయత్రిని సూచించగా నీ శ్లోకమున గాయత్రీమంత్రముచేత శివునారాధించి సాధకుడు శివసంజ్ఞమైన విష్ణుపదమును పొందునని చెప్పఁబడుచున్నది.

శ్లో॥ ఆదిత్యాంతర్యామిణమీశ్వరమాత్మేచ్ఛు-
ర్గాయత్ర్యైవానన్యమిహాన్వహమారాధ్య ।
ప్రాప్నోత్యారాద్విష్ణుపదం తచ్ఛివసంజ్ఞం
తం చిన్మాత్రం సాక్షిణమేకం శివమీడే ॥ 4 ॥

ప్ర॥ యమ్ – ఏ, ఆదిత్యాంతర్యామిణమ్ – సూర్యునియం దంతర్యామిగా నున్న, అనన్యమ్ – అన్యుడుకాని లేక స్వాభిన్నుడైన, ఈశ్వరమ్ – ఈశ్వరుని, ఆత్మేచ్ఛుః – జీవేశ్వర స్వస్వరూపమైన యాత్మను గోరువాడు, ఇహ – ఇక్కడ, గాయత్ర్యైవ – గాయత్రీ మంత్రము చేతనే, అన్వహమ్ – ప్రతిదినము, ఆరాధ్య – పూజించి, ఆరాత్ – శీఘ్రముగా, శివసంజ్ఞమ్ – శివమను పేరుగల, విష్ణుపదమ్ – విష్ణుస్థానమును, పరమానంద ధామ రూపకైవల్య మును, ప్రాప్నోతి – పొందునో, తమ్ – ఆ, చిన్మాత్రమ్ – చైతన్యమాత్రుడైన, సాక్షిణమ్ – సాక్షియైన, ఏకమ్ – ఒక్కడైన, శివమ్ – శివుని, ఈడే – స్తుతించెదను.

తా॥ ఆదిత్యునియం దంతర్యామియైన తనకంటె భిన్నుడు కాని యే ఈశ్వరుని జీవేశ్వర స్వస్వరూపమైన యాత్మను పొందగోరు సాధకుడు గాయత్రీ మంత్రము చేతనే

యారాధించి శివసంజ్ఞమైన విష్ణుపదమును పొందునో యా సాక్షి చైతన్య రూపుడైన శివునొకనినే స్తుతించెదను.

వి॥ వేదమున ముఖ్యముగా ఋగ్వేదమున గాయత్రీచ్ఛందమున నిబంధింపఁబడిన మంత్రములు (ఋక్కులు) ఎన్నో యున్నవి. కాని వానన్నిటికీ గాయత్రీ మంత్రములను వ్యవహారము ఏర్పడలేదు. సవితృదేవతాకములైన గాయత్రీ చ్ఛందమున నిబంధింపఁబడిన మంత్రములు కూడా కొన్ని యున్నవి. వానన్నిటికి గాయత్రీ మంత్రములని వ్యవహారములేదు. వానిలో **తత్సవితుర్వరేణ్యమ్ భర్గో దేవస్య ధీమహి ధియో యో నః ప్రచోదయాత్** అను మంత్రమునకే గాయత్రీ మంత్రమనిపేరు. ఈ ఋక్కు సవితృ దేవతాత్మకము. సవితృ పదము యొక్క షష్ఠ్యంతరూపము కలిగి యున్నది. ఆ కారణమున సావిత్రి యని యనదగినదే. ఉపనయన కాలమున వటువు ఆచార్యునుద్దేశించి **సావిత్రీమ్ భో అను బ్రూహి** అనియే యడుగును. గాని **గాయత్రీమ్ భో అను బ్రూహి** అని అడుగడు. వేదమున అష్టాక్షరములు కలిగి అనుష్టుప్ఛంద శ్ఛాయతో మూడు పాదములు కలిగి ఇరువది నాలుగక్షరములు కలిగిన మంత్రము లెన్నో యున్నవి. అవి యన్నియును గాయత్రీ చ్ఛందమునకు చెందినవి. అయినను వానికి గాయత్రీ మంత్రములను వ్యవహారము లేదు. లోకమున ఆఱక్షరముల నాలుగు పాదములు గలిగిన ఛందమును గాయత్రీచ్ఛంద మందురు. గాయత్రీ (సావిత్రి)ని జపించుటకు ముందు గాయత్రీదేవత ధ్యానింపఁబడును. ఆమె పంచశీర్ష, దశభుజి, శివునకు వలె నేత్రత్రయము, ఇందునిబద్ధ రత్నమకుటములుగల నైదు ముఖములు గలిగియున్నందున ఆమె శైవదేవత. దశభుజములందలి శంఖచక్రగదారవిందములు వైష్ణవత్వమును సూచింపకమానవు. వరదాభయముద్రలు దేవతాసాధారణములు. అవి ఆమె సర్వదేవతాత్మకత్వమును సూచించును. **గాయన్తం త్రాయతీతి గాయత్రీ** అను వ్యుత్పత్తి గానమును చేయువానిని కాపాడు మంత్రములన్నిటిని గాయత్రు లనవచ్చునని చెప్పవచ్చును. కాని ఈ మంత్రము తప్ప ఏ యితర మంత్రమునకు గాయత్రి యను వ్యవహారము లేదు. అనాది కాలము నుండి యుపనీతులెల్లరు ఈ మంత్రమునే జపించి ద్విజత్వమును బ్రాహ్మణత్వమును సార్థకమొనర్చుకొని యున్నారు. ఈ శ్లోకము గాయత్రీ మంత్రముచేత ప్రతిదినము శివునారాధించి శివ సంజ్ఞకమైన విష్ణుపదమును సాధకుడు చేరగలడు అని చెప్పు చున్నది. ఈశ్వరుడు సర్వాంతర్యామి. సర్వమునీశ్వరునిగా బ్రహ్మగా **సర్వం ఖల్విదం బ్రహ్మ** అను వాక్యము యొక్క మహార్థమును జ్ఞాను లనుభవించెదరు. సామాన్యులకా యనుభవముండదు. అనుభవముండదు సరికదా అట్లుపాసించుటకు సైతము వీలుకాదు. సర్వైక దేశమైన ఆదిత్యునియం దంతర్యామిగా నున్న ఈశ్వరుని గాయత్రీమంత్రము జపించుచు గాని జపరహితముగాగాని ఉపాసించుట భారతదేశమున అనాదిసిద్ధముగా నున్నది. ఈ అంతర్యామియైన ఈశ్వరునాదిత్యు

నందుపాసించుట ప్రతీకోపాసనమనఁబడును. **హగ్ంసశ్శుచిషత్** ఇత్యాది మంత్రమాదిత్యుని హంసయని పేర్కొన్నది. కావున ఈ ప్రతీకోపాసనము హంసోపాసనము కూడా నగుచున్నది. ఆ యాదిత్యావచ్ఛిన్న చైతన్యము స్వావచ్ఛిన్నచైతన్యమును సోఽహమని యుపాసించుట యహం శబ్దము **సోఽహమ్** అను దానిలో నుండుటచే సహంగ్రహోపాసనమనఁబడును. ఈ యహంగ్రహోపాసనము కూడా హంసోపాసనమే యగును. హంస శబ్దమునకు పరమాత్మ జీవాత్మ యను నర్థములు కూడా యుపనిషత్తులలో చెప్పఁబడినవి. "సోఽహమ్" అను అక్షరములలో రెండచ్చులు, మూడు హల్లులుకలవు. హల్లులను దొలగించినచో 'ఓమ్' యను నేకాక్షరమే మిగులును. ఈ యోంకార మీశ్వరవాచకమని **తస్య వాచకః ప్రణవః** అను పాతంజలసూత్రము చెప్పుచున్నది. **సోఽహమ్** అను దానిలోని తత్పదార్థాహమ్పదార్థములలోని విశేషణములైన సర్వజ్ఞత్వ కించిద్ జ్ఞాత్వాదులను తొలగించి యఖండార్థము నుపాసించుట హంసోపాసనము. ఈ యఖండార్థము లక్షణావృత్తిచేతనే లభించును. అభిధావృత్తి చేత లభించదు. కావున ఈ యఖండార్థము వాచ్యార్థము కాదు. సర్వజ్ఞత్వ కించిద్ జ్ఞత్వాదులే వాచ్యార్థములు. అవి స్ఫురించుచున్నంతకాలము జీవైశ్వరైక్యాఖండార్థము స్ఫురించదు. కావున వానిని తొలగింపవలెను. అభిధావృత్తిచేత లభించిన సర్వజ్ఞత్వ కించిద్ జ్ఞత్వాదుల తొలగించి వాచ్యార్థమనన్విత మగుట వలన ప్రవర్తించిన జహదజహల్లక్షణావృత్తిచేత నా యఖండార్థము లభించును. విశేషణాంశమున త్యాగము విశిష్ట (విశేష్య) అంశమున అత్యాగము ఉండుటచే నీయర్థము జహదజహల్లక్షణావృత్తి లభ్యమని చెప్పఁబడినది. ఓంకారము యొక్క వాచ్యార్థమైన ఈశ్వరుని యుపాసనము ఈ శ్లోకమునందలి **ఆరాధ్య** అను పదముచే చెప్పబడినది. లక్ష్యార్థమైన జీవైశ్వరైక్యము యొక్క జ్ఞానము "శివసంజ్ఞమ్ విష్ణుపదమ్" అను సరూప పదములచే చెప్పఁబడినది. ఈ జ్ఞానము స్వస్వరూపము కావున దీని ప్రాప్తి విస్మృత కంఠమణి జ్ఞప్తివలె ప్రాప్తప్రాప్తి యనఁబడును. అనన్యపదముచే నీయర్థము సూచింపఁబడినది. విష్ణుసంబంధము నే మాత్రము నంగీకరించని శైవులు రజోగుణాభిమానియైన భవుడే విశ్వమును సృజించునని సత్త్వగుణాభిమానియైన మృడుడే దానిని పాలించునని తమోగుణాభిమానియైన హరుడు దానిని సంహరించునని చెప్పి శివుడు త్రిగుణాతీతుడని చెప్పుదురు. త్రిగుణాతీతసంజ్ఞ విష్ణుపదమున కున్నది. విష్ణు శబ్దమునకు సర్వవ్యాప్తి గలిగి యుండుటయని అర్థము. **పద్లగతౌ** అను ధాతువునుండి పదశబ్దమేర్పడినది. దానికి జ్ఞానరూపమైన యర్థము. ఇట్లు విష్ణుపదమ్ అను సమాసము సర్వవ్యాపకాత్మయని యర్థము నొసగును. ఈశ్వరునారాధించిన వానికీశ్వరానుగ్రహము కలుగును. ఈశ్వరానుగ్రహమున నద్వైతవాసన కలుగును. పిదప జీవేశ్వరాద్వైతజ్ఞానము కొఱకై యత్నించి సద్గుర్వనుగ్రహమున దానిని పొందునని ఈ శ్లోకము బోధించుచున్నది. శివుడు విష్ణువు

నొక్కరనుట శివవిష్ణ్వద్వైతము. ఈ శివవిష్ణ్వద్వైతము విష్ణుపదమునకు జీవుడను నర్థమును శివ పదమునకు నీశ్వరుడని యర్థమును చెప్పినప్పుడు జీవేశ్వరాద్వైతపారమ్యముగల యద్వైతుల కంగీకార్యమగును. కాని అట్లు చెప్పుట స్మార్తాద్వైతుల యాచారమున లేదు. అదిగాక శివవిష్ణు పదముల కీశ్వరుడను నర్థము చెప్పుట యాచారమున నున్నది. ఎట్లు ప్రసక్తికల్గించిరోగాని **శ్రీ శంకరులు** విష్ణుసహస్రనామోపోద్ఘాతమున నీ హరిహరాద్వైతమును బహుధా నిరూపించిరి. ఆ నిరూపణమే యద్వైతుల యాచారము నందలి శివవిష్ణ్వద్వైత భావనమునకు మూలమని యనుకొందును. అస్తు. విష్ణు పదము శివ సంజ్ఞము. శివుడు గుణాతీతుడు. శివసంజ్ఞ యా విధమున సర్వవ్యాపక పరమాత్మకేర్పడినది. శివసంజ్ఞకమైన యా విష్ణుపదము యొక్క ప్రాప్తికి ఈశ్వరు నుద్దేశించి చేయు పంచోపచార, షోడశోపచార, చతుఃషష్ట్యుపచార సహితములైన ఆరాధనములలో (పూజలలో) నేదో యొకటి పరంపరా సాధనమనియు నీశ్లోకము బోధించుచున్నది. అందుకే విష్ణుపదమునకు శివసంజ్ఞ ఈయబడినదీ శ్లోకమున. సాధారణముగా సన్యాసులు ప్రణవ జపోపాసనముల నాచరించుచుందురు. గాయత్రీ మంత్రమును జపించరు. శ్లోకమున వారుపేక్షించిప బడినారా యని సందేహించ నక్కరలేదు. సన్న్యాస దీక్షా సందర్భమున గాయత్రీ మంత్రములోని ప్రథమ పాదము **భూః** అను వ్యాహృతిలోనికి, ద్వితీయ పాదము **భువః** అను వ్యాహృతిలోనికి, తృతీయపాదమున **సువః** అను వ్యాహృతిలోనికి ఉపసంహరింపఁ బడి ఆ మూడు వ్యాహృతులు ఓంకారములోని కుపసంహరింపఁబడు ప్రక్రియ కలదు. ఉపనయన ప్రయోగమందు **ఓం భూః** అని ఉచ్చరించి ప్రథమపాదమును, **ఓం భువః** అని ఉచ్చరించి, ద్వితీయ పాదమును, **ఓం సువః** అని ఉచ్చరించి తృతీయ పాదమును ఆచార్యుడు వటువున కుపదేశించును. గాయత్రీమంత్రములోని మూడు పాదములకు వ్యాహృతి త్రయమునకు గల సంబంధము ఈ విధమున సువ్యవస్థితమై యున్నది. భూర్భువస్సువర్లోకములు ఓంకారములోని అకారోకారమకారముల కర్థరూపములని చెప్పుట ప్రణవార్థ వివృతి గ్రంథములలో నున్నది. ఈవిధముగా ప్రణవము గూడ గాయత్రీ స్వరూపమైనది. కావున సన్న్యాసులు కూడా గాయత్రి చేతనే శివునుపాసించుట సిద్ధమగుచున్నది.

అవ॥ పై రెండు శ్లోకములలో జీవేశ్వరైక్యజ్ఞానము మోక్షహేతువుగా జపోపాసనలు పరంపరాహేతువులుగా ప్రస్తావించఁబడినవి. ఈ శ్లోకమున జీవేశ్వరైక్యజ్ఞానము తప్ప మోక్షమునకు వేరొక మార్గము లేదని పునరుద్ఘాటింపఁబడుచున్నది.

శ్లో॥ దుఃఖస్యాంతమభీప్సవఏవం సద్రూపం
బ్రహ్మేభిఖ్యం స్వాత్మతయా హృది యం మత్వా ।

ముక్తిం యాంతీత్యత్రతు నాన్యోఽస్తి చ పంథాః
తం చిన్మాత్రం సాక్షిణమేకం శివమీడే ॥ 5 ॥

ప్ర॥ దుఃఖస్య – దుఃఖము యొక్క, అన్తమ్ – నాశమును, అభీప్సవః – కోరువారు, ఏవమ్ – ఇట్లు, సద్రూపమ్ – సద్రూపుడైన, బ్రహ్మాభిఖ్యమ్ – బ్రహ్మయను పేరుగల, యమ్ – ఏ శివుని, స్వాత్మతయా – స్వాత్మగా, హృది – హృదయమున, మత్వా – తెలిసికొని, ముక్తిమ్ – ముక్తిని, యాన్తి – పొందెదరు. ఇతి అత్ర – అనుటకన్న, అన్యః – వేరైన, పన్థాః – మార్గము, న అస్తి చ – లేనేలేదో, తమ్ – ఆ, చిన్మాత్రమ్ – చిద్రూపుడైన, సాక్షిణమ్ – సాక్షియైన, ఏకమ్ – ఒక్కడైన, శివమ్ – శివుని, ఈడే – స్తుతించెదను.

తా॥ దుఃఖము యొక్క సంపూర్ణ నాశనము గోరువారు ఈ విధముగా సద్రూపుడైన బ్రహ్మమను పేరుగల యే శివు నెద నెఱుగుట ముక్తిని పొందుటకేకైక మార్గము. వేరు మార్గము లేనే లేదు. అట్టి సాక్షిచైతన్యరూపుడైన శివుని స్తుతించెదను.

వి॥ శరీరధారి యెవ్వరైనను క్రిమికీటకకీశపక్షిమనుష్యదేవదేవయోన్యాది జాతులలో దేనికి చెందిన వారైనను తామనుభవించు దుఃఖమునకంత మెప్పుడాయని నిరీక్షించెదరు. దుఃఖాన్తమగువరకు దానిని కోరుచునే యుందురు. ఒక దుఃఖము తొలగి మరొక దుఃఖము వచ్చినచో అదియు నశించవలెనని కోరుదురు. దుఃఖము చచ్చుటలో నున్నది. మరల పుట్టుటలో నున్నది. బ్రతుకుటలో నున్నది. బాల్యాది వార్ధక్యాంత సర్వవయస్సులలో నున్నది. స్వప్నమందును దుఃఖమున్నది. జాగ్రదవస్థలో నున్నదని చెప్పఁబనియేలేదు. దుఃఖము సంపూర్ణముగా నశించ వలెనన్న జన్మజరామరణాదులుండకూడదు. అవి లేకుండ పోవలెనన్న వానికి మూలమైన కర్మము, దానికి మూలమైన అజ్ఞానము నశింపవలెను. దుఃఖమూల మజ్ఞానము. కావున అజ్ఞానము తొలగనిదే దుఃఖము తొలగదు. కొన్ని వైదిక కర్మల నాచరించి కొన్ని దుఃఖముల తొలగించుకొనవచ్చును. అయినను కొన్ని దుఃఖములు ప్రాప్తించుచునే యుండును. దుఃఖహేతువు కర్మము. కర్మమూల మజ్ఞానము. అజ్ఞానము తొలగిన కర్మము, తత్ఫల రూపమైన దుఃఖము సమూలముగా నశించును. దానిని కోరువారు సద్రూపుడైన శివుని తెలిసికొని అసద్రూపమైన దుఃఖమును తొలగించు కొనగలుగుదురు. శివుని తెలిసికొనుట యనగా శివజ్ఞానము. శివజ్ఞానమనగానేమి? నేను శివుడనని ఎఱుగుట. సంహితాద్యుపనిషత్పర్యంతమైన సర్వశ్రుతి ముఖ్యముగా వేదాంతములనఁబడు నుపనిషత్తులు స్వాత్మయే బ్రహ్మమని చెప్పుచున్నవి. బ్రహ్మమన్నపేరు శివునకే ఉన్నది. ఆ శివుడే జాగ్రత్స్వప్న సుషుప్త్యవస్థలకు తన్మూలములైన రజస్తమస్సత్త్వ గుణములకు అతీతుడు శివుడే యను విషయము పై శ్లోకముయొక్క వివరణయందు ప్రస్తావింపఁబడినట్టిదే. పై శ్లోకము విష్ణుపదము శివసంజ్ఞమని చెప్పఁబడినది. ఈ శ్లోకమున

శివుడు బ్రహ్మాభిఖ్యుడని చెప్పబడుచున్నది. పురుష సూక్తమున **వేదాహమేతమ్ పురుషమ్మహాన్త మాదిత్యవర్ణం తమసః పరస్తాత్, తమేవం విద్వానమృత ఇహ భవతి నాన్యః పన్థాః విద్యతే అయనాయ** అను మన్త్రమొకటి గలదు. ఆ మన్త్రములోని నాన్యః పన్థాః అను పదములే ఈ శ్లోకమున స్వీకరింపఁబడినవి. 4వ శ్లోకమున ఆదిత్యాంతర్యామీశ్వరోపాసనము చెప్పఁ బడినది. ఈ శ్లోకమున పరమేశ్వరునాదిత్య వర్ణునిగా చెప్పిన మంత్రముయొక్క తాత్పర్యము సంగ్రహింపఁబడుచున్నది. ఆదిత్యుడు తేజస్స్వరూపుడు. చీకటికవతలి వాడు. ఆదిత్య కర్తయైన పరమేశ్వరుడు అజ్ఞానమున కావలి జ్ఞానమే స్వరూపముగా గలవాడు. తమసః పరస్తాత్ (చీకటి కవతల) అను పదములీయర్థమును, సగుణనిర్గుణైక్యమును చెప్పునవి. ఈ మన్త్రములో 'వేద' యను పదమునకు ఉపాసనము అని యర్థమా! లేక జ్ఞానమని యర్థమా యను సందేహమును **స్వాత్మతయా మత్వా** అను శ్లోకములోని పదములు తొలగించుచున్నవి. పిపీలికామార్గమున గాని విహంగ మార్గమున గాని పరమేశ్వరుని స్వాత్మగానే తెలిసికొనవలెనని చెప్పుచున్నవి. మోక్షప్రాప్తికి మరొక మార్గము లేదని ఈ మంత్రము పై శ్లోకములోని **ముక్తిం యాంతి** అను పదములు వివరించుచున్నవి. ఇచట ముక్తి యనగా కైవల్యము. సగుణ బ్రహ్మ పారమ్యవాదుల మతము ననుసరించి ముక్తి నాలుగు విధములు లేక అయిదు విధములుగా నుండును. సాలోక్యము – పరమేశ్వరుని లోకములో నుండుట అనగా పరమేశ్వరునకు తనకు లోకమొకటే యగుట. సామీప్యము – పరమేశ్వరుని లోకమునందును అతనికి దగ్గరగా నుండుట. సాలోక్యముక్తి నొందుటలో తృప్తి చెందని వారీ ముక్తిని గోరుకొందురు. ఆనంద స్వరూపుడైన భగవంతునికి దగ్గఱగా నుండు వారికానందమధికము అని వారి యుద్దేశము. సారూప్యము – పరమేశ్వరుని రూపముతో సమానమైన రూపము నొందుట. నిత్యులైన గరుడ విష్వక్సేనాదులు తప్ప మృత్యులోకము నుండి ముక్తులైన జీవులకు పరమేశ్వరుని లోకము చేరగానే కోరిన వారికి పుణ్యబలమున పరమేశ్వరుని రూపముతో సమానమైన రూపము లభించును. సాయుజ్యము – పరమేశ్వరునిలో కలిసిపోవుట. పరమేశ్వరుని శరీరములోని భాగమగుట యొకవిధమైన సాయుజ్యము. పరమేశ్వరునిలోని యాత్మలో కలసిపోవుట మరొక విధమైన సాయుజ్యము. ఇదియే కైవల్యము. ఈ యర్థమున సాయుజ్యపదము వేదపురాణాదులలో కనిపించుచున్నది. మొదటి యర్థము నంగీకరించిన సాయుజ్యమునకన్న కైవల్యమును వేరొక ముక్తిగా నంగీకరింపవలసి యుండును. సార్ష్టి – ఇది ముక్తి భేదములను ప్రస్తావించిన కొన్ని సందర్భములలోనే కానవచ్చును. అన్ని సందర్భములలో కానరాదు. జగద్వ్యాపారమును వదలి మిగిలిన (అణిమాది) యైశ్వర్యము నొందుట. వీనిలో కైవల్యము తప్ప మిగిలిన ముక్తు లుపాసనగా లభ్యములు. కైవల్యము మాత్రము **జ్ఞానాదేవ హి కైవల్యమ్** అని చెప్పినట్లుగా జ్ఞానముననే లభించునట్టిది. కావున నిర్గుణ బ్రహ్మ పారమ్యవాదులు

'మత్వా' అను పదమునకు తెలిసికొని అను నర్థమును చెప్పినను, మందాధికారుల విషయమున స్వాత్మగా బ్రహ్మనుపాసించి అను నర్థమును అంగీకరించెదరు. కైవల్యమును నిర్గుణబ్రహ్మస్వాత్మగా బ్రహ్మనుపాసించి అను నర్థమును అంగీకరించెదరు. కైవల్యమును నిర్గుణ బ్రహ్మ పారమ్యవాదులు మాత్రమే యంగీకరించెదరు. వీరి మతమున బ్రహ్మమునందు సజాతీయ విజాతీయ స్వగత భేదములు లేవు. కావున ఆ భేదములున్న సాలోక్యాది ముక్తులు సంపూర్ణముక్తులు కావు. అట్లైనను ఉపాసకులు సాలోక్యాది ముక్తుల నొంది జ్ఞానియైన పరమేశ్వరు నుండి తత్త్వమసి యను నుపదేశము నొంది అహం బ్రహ్మాస్మి యను ననుభవమున అనగా కైవల్యముక్తిని పొందెదరు. కావున నీ నాలుగు ముక్తులు పొందినవారు కూడా విష్ణ్వాదులు బ్రతికి నన్నాళ్ళు వారివారి లోకములలో జీవించి వారిలోకము లుపసంహరింపఁబడు కాలమున లోకేశ్వరునిచే **తత్త్వమసి** యను నుపదేశమునొంది **అహంబ్రహ్మాస్మి** యను ననుభవమును అనగా కైవల్యముక్తిని పొందుదురు. ఇట్లు సాలోక్యాది క్రమమున కైవల్యమునొందుట క్రమముక్తియని బహుకాల సాధ్యమగుట వలన పిపీలికా మార్గమని చెప్పఁబడును. ఈ లోకముననే సద్గురువు యొక్క తత్త్వమసియను నుపదేశమునొంది అహంబ్రహ్మాస్మి యను ననుభవమును పొందుట సద్యోముక్తియని విహంగమార్గమని చెప్పఁబడును. చీమవలె నాలస్యముగా చేరు పిపీలికా మార్గమిదికాదు. పక్షివలె శీఘ్రముగా చేరు మార్గమిది. రెండు మార్గములలో కైవల్యము నొందుట యున్నది కావున **న సపునరావర్తతే** అను బ్రహ్మసూత్రమున సాలోక్యాది ముక్తుల నొందిన వారికి కూడా పునరావృత్తి లేదని చెప్పఁబడినది.

అవ॥ పై శ్లోకమున కించిద్ జ్ఞత్వ సర్వజ్ఞత్వాది సర్వగుణ వర్జితమైన ఆత్మ జీవేశ్వర స్వరూపముగా నెరిగిన వారు ముక్తినొందెదరని చెప్పఁబడినది. కించిద్ జ్ఞత్వ సర్వజ్ఞత్వాది గుణములు లేని శుద్ధాత్మానుభవము శుష్కమై ఆనందహీనముగా నుండు నేమో యను ప్రశ్నకీ శ్లోకమున సమాధానము చెప్పఁబడుచున్నది.

శ్లో॥ తస్య జ్ఞానానందరసోఽ స్త్యపి చాస్థూలోఽ
హ్రస్వోఽజో యోఽ ణుత్వవిహీనో న చ దీర్ఘః ।
అద్వైతాత్మకపూర్ణశివో యో బ్రహ్మాఖ్యః
తం చిన్మాత్రం సాక్షిణమేకం శివమీడే ॥ 6 ॥

ప్ర॥ తస్య – ఆ శివునకు, జ్ఞానానందరసః అపి – జ్ఞానానందరసము కూడ, అస్తి – కలదు, అపి చ – మరియు, యః – ఏ శివుడు, అస్థూలః – స్థూలుడు కాడో, అహ్రస్వః – పొట్టివాడుకాడో, అణుత్వహీనః – అణుత్వములేని వాడో, దీర్ఘః న చ – పొడవైన వాడును కాడో, అజః – పుట్టుకలేనివాడో, అద్వైతాత్మకపూర్ణశివః – భేదము లేని పరపూర్ణ శివ స్వరూపము కలవాడో, తమ్ – ఆ, సాక్షిణమ్ – సాక్షియైన, చిన్మాత్రమ్ – చిన్మాత్రుడైన, ఏకమ్ – ఒకడైన, శివమ్ – శివుని, ఈడే – స్తుతించెదను.

తా॥ కేవలమాత్మ స్వరూపుడైన శివునందు జ్ఞానానందరసము కూడా కలదు. అతడు స్థూలుడు కాదు. అంతమాత్రమున సూక్ష్మాణుస్వరూపుడని చెప్పరాదు. అతడు పొట్టివాడు కాదు. పొడుగువాడునుకొందురేమో పొడుగువాడును కాదు. అసలు శరీరమే లేదాతనికి. అతనికి సజాతీయ, విజాతీయ స్వగత భేదములు లేవు. కావున అతడు పరిపూర్ణుడు. అట్టి చిన్మాత్ర సాక్ష్యైక స్వరూపుడైన శివుని స్తుతించెదను.

వి॥ జ్ఞానానందాదులు ఆత్మస్వరూపములు. శివస్వరూపములు. అయినను అవి యాత్మయైన శివునకంటె భిన్నములుగా భాసించును. అంతమాత్రము అవి భిన్నములని యనుకొనరాదు. శివుడు స్థూలత్వహ్రస్వత్వములు లేనివాడు. అంతమాత్రమున ఆయనకు అణుత్వదీర్ఘత్వములున్నవని చెప్పరాదు. లోకమున అణుత్వమున్నచోట మహత్త్వముండదు. మహత్త్వమున్నచోట అణుత్వముండదు. అందుచే ఆయా అణుమహత్వదార్థములు పరిపూర్ణములని చెప్పఁబడుట కవకాశము లేదు. కాని పరమాత్మ పరిపూర్ణుడు అనగా దేశకాల వస్తు పరిచ్ఛేదములు లేనివాడు. అందువలన ఇది యని చెప్పఁబడనట్లే ఇదికాదు అనియు చెప్పఁబడదు. అసలు ఈ ధర్మములు శరీరగతములుగా లోకమున కనిపించును. అసలు శరీరమే యాతనికి లేదు. కావున పుట్టుట, ఉనికి, పెరుగుట, మానుట, క్షీణించుట, మరణించుట అను షడ్భావ వికారములు అతనికి లేవు. **జాయతే అస్తి వర్ధతే విపరిణమతే క్షీయతే నశ్యతి** అను నీయారు క్రియలచే చెప్పఁబడినవీ షడ్భావవికారములు. వీనిలో అస్తి యను దానికి సత్తయను అర్థమున్నను ఇది పుట్టిన తరువాత లోకమున ఉన్నదను వ్యవహారము చేతనేర్పడినది. కావున ఈ సత్త పరమాత్మయందలి పారమార్థిక సత్తకాదు. జన్మానంతరికమైన ఈ సత్త వికారరూపము. కాని త్రికాలాబాధ్యత్వరూపమైనదికాదు. జన్మాది షడ్భావ వికారములు శరీరధారులకే యుండును. శరీరములేని పరమాత్మకు బ్రహ్మాఖ్య శివునకు ఇవి యుండవు. సజాతీయ భేదమనగా ఒక జాతికి చెందిన రెండు వ్యక్తుల మధ్యగల భేదము. మామిడి చెట్టును చెట్టే. తాడిచెట్టును చెట్టే. కాని ఒకటి మామిడియే కాని తాడి కాదు. మరొకటి తాడియేకాని మామిడికాదు. విజాతీయ భేదమనగా రెండు జాతుల మధ్యగల భేదము. మనుష్య జాతి, వృక్షజాతి కాదు. వృక్షజాతి మనుష్యజాతి కాదు. వృక్షము మనుష్యుడు కాదు, మనుష్యుడు వృక్షముకాదు. ఇది విజాతీయ భేదము. స్వగత భేదమనగా ఒక వ్యక్తి యందుండు అవయవముల మధ్యగల భేదము చేతులు కాళ్ళు ఒకవ్యక్తికి చెందినవే యైనను, చేతులు కాళ్ళుకావు, కాళ్ళు చేతులు కావు. శివునకు సజాతీయవిజాతీయ స్వగత భేదములు లేవు గనుక ఆయన అద్వైత స్వరూపుడు. శివుడు పరిపూర్ణుడు. దేశకాల వస్తుపరిచ్ఛేదముల లేనివాడు. దేశ పరిచ్ఛేదమనగా ఒక చోట నున్న వస్తువు మరొక చోట లేకుండుట. కాల పరిచ్ఛేద మనగా ఒక కాలమందున్న వస్తువు మరొక కాలమున లేకుండుట. వస్తుపరిచ్ఛేదమనగా వస్తువుల మధ్యగల భేదము (పీఠము, పీఠమే కాని దూలము కాదు – దూలము దూలమే కాని పీఠము కాదు). ఈ త్రివిధ పరిచ్ఛేదములు లేనివాడగుటచే శివుడు పరిపూర్ణుడు.

అవ॥ పై శ్లోకమున శివుని పరిపూర్ణత చెప్పఁబడినది. పరిపూర్ణతా ధర్మముచే నాయనకు ధ్యేయత్వముండవచ్చును గదా యను సంభావనము ఈ క్రింది శ్లోకమున నివారింపఁబడుచున్నది.

శ్లో॥ ధ్యాతృధ్యానధ్యేయభిదాం యః పరిహృత్య
స్వస్థో భూత్వా కేవల ఏకః పరిశిష్టః ।
స్వానన్యత్వం పశ్యతి యద్‌జ్ఞః సమభక్తిః
తం చిన్మాత్రం సాక్షిణమేకం శివమీడే ॥ 7 ॥

ప్ర॥ యః – ఎవడు, ధ్యాతృధ్యానధ్యేయభిదామ్ – ధ్యాత, ధ్యానము, ధ్యేయము అను భేదమును, పరిహృత్య – విడిచి, స్వస్థః – స్వరూపనిష్ఠుడై, కేవలః – కేవలుడై, ఏకః – ఒకడుగా, పరిశిష్టః – మిగిలియుండునో, యద్ జ్ఞః – దేనినెఱుగువాడు, సమభక్తిః – సమానప్రీతిగలవాడై, స్వానన్యత్వమ్ – స్వాభేదమును, పశ్యతి – చూచునో, తమ్ – ఆ, చిన్మాత్రమ్ – చిత్స్వరూపుడైన, సాక్షిణమ్ – సాక్షియైన, ఏకమ్ – ఒకడైన, శివమ్ – శివుని, ఈడే – స్తుతించెదను.

తా॥ ధ్యాతృ, ధ్యాన, ధ్యేయ భేదమును విడిచి కేవలస్వరూప నిష్ఠుడై యొక్కడుగా మిగిలియుండునో జ్ఞానస్వరూపుడై, సమాన ప్రీతిగలవాడై, స్వాభేదమునే యంతట చూచునో ఆ సాక్షి చిన్మాత్రైక శివునే స్తుతించెదను.

వి॥ మనస్స్పందరూపమైన జ్ఞానము వేఱు, జ్ఞప్తివేఱు, మనస్స్పందము మనస్సులో కలుగునట్టి వికారము లేక పరిణామము. మనస్సున కధిష్ఠానముగా నున్నట్టిది జ్ఞప్తి. అది పరిణామరహితము. మరొక విధముగా నిట్లు చెప్పవచ్చును. జ్ఞానము వేఱు, విషయజ్ఞానము వేఱు. విషయజ్ఞానము మనోవృత్తి రూపము. విషయజ్ఞానము వృత్తి భేద రహితము. ఏకరూపము. ఒక విషయమును తెలిసికొనుట, మనోవృత్తిని తెలిసికొనుటను తెలియక పోవుటను సమముగా తెలిసికొను తెలివి విషయజ్ఞానము. జ్ఞాత యొక్క వ్యాపారము జ్ఞేయము నందది వ్యాపించును. ఈ వ్యాపారమున నొకవైపు జ్ఞాత యుండును. మరొక వైపు జ్ఞేయ ముండును. జ్ఞాతృ జ్ఞేయ విలక్షణము జ్ఞేయము. జ్ఞాతృవిలక్షణము. ఇట్టి మనోవృత్తి రూప జ్ఞానములలో విషయమొకటియే కొంత కాలమున్నప్పుడు ఆ జ్ఞానముల ధార ధ్యానమనఁబడును. అది ధ్యాతృ ధర్మము. ధ్యేయము విషయము. సాధారణముగా సాధకులచే నీశ్వర విషయకమైన ధ్యానము చేయఁబడుచుండును. ఈశ్వరుడీ ధ్యానమున విషయము. అనగా ధ్యేయము. సాధక జీవుడు ధ్యాత. అతని వ్యాపారము ధ్యానము. ఈ ధ్యాతృ, ధ్యాన ధ్యేయభేదమును విడిచి తనలో తానొక్కటిగా మిగిలిపోవు జ్ఞానము శుద్ధజ్ఞానము. పరమార్థమున జీవేశ్వరులిరువురి స్వరూపమదియే. ప్రీతి తారతమ్యము లేకపోవుటచే నాదృగ్రూపుడు సమభక్తియని చెప్పఁబడును. ఈ దృక్కు

దృశ్య ప్రతి ద్వంద్వికాడు. జ్ఞానత్రిపుటి యందు ధ్యానత్రిపుటి యందు వ్యాపించి యుండునది. వృత్తి జ్ఞాన సమయమున జ్ఞాత జ్ఞేయమును తనకు భిన్నముగానే చూచును. కాని యా కేవల జ్ఞాతకు సర్వమును స్వానన్యమే స్వాభిన్నమే. స్వరూపేతర మందు మిథ్యా దృష్టియుండుటచే ధ్యాతృధ్యేయ జ్ఞాతృజ్ఞేయ భేదమును విడిచి యుండును. అదియే పరమాత్మ. అతడే శివుడు. సాక్షిమాత్రుడు. చిన్మాత్రుడు. ఈ సమభక్తినే శ్రీమద్భగవద్గీత ఏకభక్తి యని పేర్కొన్నది. సమసమాన శబ్దములొకప్పు దేకార్థవాచకములై యుండును. **రషాభ్యాం నోణస్సమానపదే** అను వ్యాకరణసూత్రమున సమాన శబ్ద మేకార్థవాచకము. అట్లే భగవద్గీతలోని **సమం బ్రహ్మ** అను చోట గల సమశబ్దమును కూడ ఏకార్థవాచకముగా భావింపవలెను. **తేషాం జ్ఞానీ నిత్యయుక్త ఏక భక్తిర్విశిష్యతే**. “అర్థార్థిజిజ్ఞాస్వార్త భక్తుల కన్న ఏక భక్తియైన జ్ఞాని విశిష్టుడని ఈ భగవద్గీతా వాక్యము తెలుపుచున్నది. సమభక్తి ఏకభక్తి అనునవి సమానార్థకములు. అనగా ఏకార్థకములు. జ్ఞానివాచకములు. “యద్‌జ్ఞః సమభక్తిః’ అను మాటలు ఆత్మజ్ఞాని సమప్రీతికలవాడై యుండునని తెలుపును.

అవ॥ పరమాత్మ శివునెఱిగిన వాడు సమభక్తి యగునని శివుని మహిమపై శ్లోకమున కొనియాడబడినది. ఈ శ్లోకమున ఆ శివుని చతుష్పాద్విభూతి వర్ణింపఁబడుచున్నది.

శ్లో॥ యస్యైవైకం పాదమముం వై భువనాఖ్యం
త్యక్త్వా నానాకారతయైవ త్రిభిరన్యైః ।
ఐక్యం లబ్ధ్వా భాతి చ యోగీ క్రమశోఽస్మిన్
తం చిన్మాత్రం సాక్షిణమేకం శివమీడే ॥ 8

ప్ర॥ యస్య – ఎవనియొక్క, భువనాఖ్యమ్ – భువన నామకమైన, ఏకమ్ – ఒక, పాదమ్ ఏవ – పాదమునే, నానాకారతయా ఏవ – పెక్కు ఆకారములు కలదగుట చేతనే, త్యక్త్వా – విడిచి, అన్యైః – ఇతరములైన, త్రిభిః – మూడు పాదములతో, ఐక్యమ్ – ఏకత్వమును, లబ్ధ్వా – పొంది, క్రమశః – క్రమముగా, అస్మిన్ – ఈ శివునియందు, యోగీ చ – యోగికూడ, భాతి – ప్రకాశించునో, తమ్ – ఆ, చిన్మాత్రమ్ – చిన్మాత్రుడైన, సాక్షిణమ్ – సాక్షియైన, ఏకమ్ – ఒకడైన, శివమ్ – శివుని, ఈడే – స్తుతించెదను.

తా॥ పరమాత్మ నాలుగు పాదములలో ఈ సమస్త భువనములొకపాదము. ఇది నానాకారములు కలదు. దీనిని విడిచి మిగిలిన మూడు పాదములలో నైక్య మొంది క్రమముగా శివునందు యోగి ప్రకాశించును. అట్టి సాక్షి చిన్మాత్రుడైన యొక శివుని స్తుతించెదను.

వి॥ బ్రహ్మసూత్రప్రథమాధ్యాయమున ప్రథమపాదమున జ్యోతిశ్చరణాధికరణ మున్నది. అందు భువనము లన్నియు పరమేశ్వరుని యొక పాదమని త్రిపాద్విభూతి దివియందున్నదను అర్థముగల మంత్రము ప్రస్తావించబడినది. అదే ఈ శ్లోకమున

వివరింపబడినది. వేదములలో చతుష్పాద్బ్రహ్మ నిరూపణము లేక చతుష్పాదాత్మ నిరూపణమున్నది. అది ద్వివిధముగా నున్నది. ఒకటి ఛాందోగ్య ప్రకారము (పురుష సూక్త ప్రకారము) రెండవది మాండూక్యోపనిషత్ప్రకారము. పురుషసూక్తమున, ఛాందోగ్యోపనిషత్తు నందును **పాదోஉస్య విశ్వా భూతాని త్రిపాదస్యామృతం దివి,** (ఇతని యొక పాదము సర్వభూతమయముగా మృత్యులోకమున నున్నది. మిగిలిన మూడు పాదములు ద్యులోకమున నున్నవి) పురుషుని (బ్రహ్మ) యొక్క పాదమైన ఈ భూతములన్నియు పరస్పరవిలక్షణములై నానాకారములుగా నున్నవి. అందుచేతనే అవి దుఃఖరూపములుగానున్నవి. ద్యులోకమందలి పాదత్రయము సచ్చిదానందాత్మకము. యోగి, దుఃఖమయమైన నానాకారముగా నుండుటచే నీ మృత్యులోకస్థపాదమును విడిచి ఏకాకారమై ఆనందరూపముననున్న పాదత్రయముతో నైక్యమంది ప్రకాశించును. నానాత్వము దుఃఖమునకు హేతువు. జాగ్రత్స్వప్నములు నానాకారములు. కావుననే దుఃఖమయములుగా నున్నవి. సుషుప్తియందు నానాత్వము లేదు. కావున జీవులంద ఆనందరూపమైన సుషుప్తిని సర్వలౌకికానందాధికముగా భావించి యితర లౌకికానందముల విడుచుటకు సైతము వెనుదీయక సుషుప్త్యానందమును కోరుచున్నారు. అనగా నీలోకము నందలి యానందములు క్షణికములు. దుఃఖపూర్వములు. దుఃఖాంత రితములు. అనంతర దుఃఖములు. అనగా లౌకిక సుఖములననుభవించుటకు పూర్వము మిక్కిలి దుఃఖకరమైన యత్న మొనర్పవలసి యుండును. ఇంత చేసియు ఆ సుఖములు క్షణమాత్రముండి నశించిపోవును. తరువాత మరల దుఃఖమే. ముందు వెనుకలలో దుఃఖముండుటచే నా సుఖములును స్వకాలమున కూడ దుఃఖరూపములే యగును. అందుచేత వివేకులైన యోగు లీనశ్వర సుఖాభాసరూపమైన ఈ లోకమనెడి పాదమును విడిచి పరమేశ్వరుని త్రిపాద్రూపముతో అనగా సచ్చిదానందాత్మక బ్రహ్మముతో నైక్యమొంది ప్రకాశించెదరు. సుషుప్తిలోని యానందము జాగ్రత్స్వప్నానందాధికమైనను అదియు శాశ్వతముగాదు. కనుకనే అదియే జాగ్రత్స్వప్న దుఃఖ హేతువు. కావున దానిని సైతము యోగులు విడచెదరు. వారు అజ్ఞానరూపమైన యా సుషుప్త్యానందము నందును తృప్తిచెందక భూమానంద రూపమైన త్రిపాద్బ్రహ్మతో నైక్యమొంది ప్రకాశించెదరు. జాగ్రత్స్వప్నసుషుప్తి రూపావస్థా త్రయమునకు సాక్షియైన నాల్గవ దైన త్రిపాదానంద రూపమైన సాక్షి శివ చైతన్యానందములో మునిగి ప్రకాశించెదరు. పై మాటలు మాండూక్యోపనిష త్ప్రకారము చతుష్పాదాత్మ స్వరూపము ప్రస్తావింపఁబడినట్లైనది. (ఇది మొదటి శ్లోకమును వివరించు సందర్భమున దాదాపు పూర్తిగా వివరింపఁబడినది). విశ్వ వైశ్వానరులు వారి జాగ్రత్ప్రపంచము ఆత్మ యొక్క ప్రథమ పాదము తైజస హిరణ్యగర్భులు, వారి స్వప్న ప్రపంచము ఆత్మ యొక్క ద్వితీయ పాదము; ప్రాజ్ఞావ్యాకృతులు వారి సుషుప్తి ఆత్మ యొక్క తృతీయ పాదము. జాగ్రత్స్వప్న సుషుప్త్యవస్థలకు సాక్షిగా నుండి ఈయవస్థ నభిమానించు విశ్వవైశ్వానరులకు

తైజస హిరణ్యగర్భులకు ప్రాజ్ఞావ్యాకృతులకు విలక్షణముగా నున్న తుర్యమైన ఆత్మ కేవలానందమయము. పురుషసూక్తములో చెప్పబడిన త్రిపాద్విభూతిరూపము. పురుషసూక్తమున సాక్షి చైతన్యమును త్రిపాద్విభూతియని మాండూక్యోపనిషత్తున తుర్య పాదము అని భిన్నభిన్నముగా చెప్పఁబడినను ఉక్తి భేదమేగాని తాత్పర్యమున భేదములేదు. పురుషసూక్తములోని ఏకపాదమున మాండూక్యోపనిషత్తులో చెప్పఁబడిన జాగ్రత్స్వప్నసుషుప్తి రూపావస్థాత్రయము ఏక రూపములు. అట్లే మాండూక్యో పనిషత్తులోని చతుర్థపాదమున పురుషసూక్తమున చెప్పఁబడిన త్రిపాద్విభూతియనేక రూపములు అనియు గమనింపవలెను. **క్రమశః** – అను పదము మొదలు లౌకిక భోగవైరాగ్యమును, పిదప జ్ఞానమును పొందిన వానికే తరువాత శివత్వప్రాప్తియని సూచించును.

అవ॥ పై శ్లోకమున పురుషసూక్తములోని **విశ్వా భూతాని** అను పదములు పరమేశ్వరుని ప్రథమ పాదమున పేర్కొన్నవి. అందలి విశ్వ శబ్దము సర్వ పర్యాయము. ఈ శ్లోకమున సర్వమును బ్రహ్మముగా బ్రహ్మమును సర్వముగా దర్శింపవలెనని చెప్పఁ బడుచున్నది.

శ్లో॥ సర్వాత్మస్థం స్వాత్మతయా సంప్రతిపన్న–
స్స్వస్థం యం వై సర్వతయా చ ప్రతిపన్నః ।
పూర్ణానందో భాదృగనంతః పురుషస్స్యాత్
తం చిన్మాత్రం సాక్షిణమేకం శివమీడే ॥ 9 ॥

ప్ర॥ సర్వాత్మస్థమ్ – సర్వజీవుల (భూతముల)లో నున్న, యమ్ – ఎవనిని, స్వాత్మతయా – స్వాత్మగా, సంప్రతిపన్నః – గుర్తించిన, స్వస్థమ్ – స్వాత్మలో నున్న వానిని, సర్వతయా – సర్వభూతమయముగా, ప్రతిపన్నః – గుర్తించిన, పురుషః – పురుషుడు, భాదృగ్ – తేజస్స్వరూపుడు, దృక్స్వరూపుడుగా, అనంతః – అంతములేనివాడు, పూర్ణానందః చ – పూర్ణానందస్వరూపుడును, స్యాత్ – అగును.

తా॥ సర్వభూతస్థాత్మను స్వాత్మగా, స్వాత్మను సర్వభూతస్థాత్మగా గుర్తించిన పురుషుడు అనంత పూర్ణానంద జ్ఞానరూపుడైన శివునితో నైక్యమొందును. అట్టి సాక్షి చిన్మాత్రుడైన శివునే స్తుతించెదను.

వి॥ భగవద్గీతలోని **సర్వభూతస్థ మాత్మానాం సర్వభూతాని చాత్మని ఈక్షతే యోగ యుక్తాత్మా సర్వత్ర సమదర్శనః** అను శ్లోకము చెప్పిన విషయమునే ఈ శ్లోకమును స్వల్పమైన మార్పులతో చెప్పినది. గీతలోని సమదర్శనః అను పదమునకు స్పష్టవివరణ మీ శ్లోకమున లేదు. ఈ శ్లోకమున గీతా శ్లోకమున లేని మోక్ష రూపములైన పూర్ణానందత్వ భాదృక్త్వానంతత్వములు చెప్పఁబడినవి. **సమదర్శనః** అను పదము యొక్క భంగ్యంతర వివరణములే యని యన్నను యనవచ్చును.

అవ॥ పై శ్లోకము సర్వమును స్వాత్మగా స్వాత్మను సర్వముగా నిశ్చయించుట చెప్పఁబడినది. ఈ శ్లోకమున సర్వశబ్దముతో నారంభింపఁబడిన సర్వజ్ఞత్వమన్న పదముతో నారంభింపఁబడుచున్నది.

శ్లో॥ సర్వజ్ఞత్వమ్మాయికమీశే చ త్యక్త్వా
కించిద్ జ్ఞత్వం తద్వదముష్మిన్నపి జీవే ।
చిన్మాత్రైక్యం పశ్యతి యోగీ లక్షణయా
తం చిన్మాత్రం సాక్షిణమేకం శివమీడే ॥ 10 ॥

ప్ర॥ మాయికమ్ – మాయవలన నేర్పడిన, సర్వజ్ఞత్వమ్ – సర్వజ్ఞత్వమును, ఈశే – ఈశ్వరునందు, తద్వద్ – అట్లే, కించిద్జ్ఞత్వమ్ – కించిద్జ్ఞత్వమును, అముష్మిన్ – ఈ, జీవే అపి చ – జీవునందును, త్యక్త్వా – విడిచి, లక్షణయా – జహ దజహల్లక్షణచే, చిన్మాత్రైక్యమ్ – చిన్మాత్రైక్యమును, యోగీ – యోగి, పశ్యతి – చూచును, తమ్ – ఆ, చిన్మాత్రమ్ – చిన్మాత్రుడైన, సాక్షిణమ్ – సాక్షియైన, ఏకమ్ – ఒకడైన, శివమ్ – శివుని, ఈడే – స్తుతించెదను.

తా॥ మాయ వలన ఈశ్వరునకు సర్వజ్ఞత మేర్పడినది. దాని నాయీశ్వరుని యందే విడువవలెను. అట్లే అవిద్యవలన కించిద్ జ్ఞత్వము నా జీవుని యందే విడువవలెను. అప్పుడు జీవేశ్వరోభయసాధారణమైన జ్ఞత్వము అనగా చిన్మాత్రత్వము మిగులును. ఇట్లు సర్వజ్ఞత్వ కించిద్జ్ఞత్వములేకవ్యక్తియం దనుపపన్నములు కావున వానిని విడచి లక్షణచే చిన్మాత్రత్వము గ్రహింపవలెను. ఆ చిన్మాత్ర స్వరూపుడు సాక్షియైన శివునొకనినే స్తుతించెదను.

వి॥ శబ్దమున కర్థము నొసంగుశక్తి యున్నది. కావుననే మనకు శబ్దము వినబడగానే అర్థము స్ఫురించుచుండును. ఈ శక్తికి అభిధయనిపేరు. దానికే వాచకత్వమనియు నామాంతరము. ఈ శబ్దమున కీయర్థము రావలెను అను ఈశ్వరేచ్ఛ శక్తి యని కొందఱు, వక్తయొక్క ఇచ్ఛ శక్తి యని కొందఱు చెప్పెదరు. ఈ బాలుడు సింహము అనునటువంటి వాక్యములలో శబ్దముల నుండి వచ్చిన యర్థము అనుపపన్నము. బాలుడు సింహము కాదు కదా. చెప్పిన వాడు ఉన్మాది కాదు. కావున నాతడు సింహమునకున్నటువంటి పరాక్రమము కలవాడు అను నర్థమున ప్రయోగించినాడు. ఇటువంటి సందర్భమున సింహశబ్దము సింహగత పరాక్రమ సదృశ పరాక్రమమును బోధించును. ఈ పరాక్రమగుణమును సింహశబ్దము గౌణీవృత్తిచే బోధించును. ఇట్లే గంగలో గొల్లపల్లె యను వాక్యములోని గంగలో అను శబ్దము గంగా సామీప్యమును బోధించును. గంగలో గొల్లపల్లెయుండుట యసంభవము. ఈ వాచ్యార్థము అనుపపన్నము. కావున గంగా శబ్దము గంగాసామీప్యము అను నర్థమును లక్షణా వృత్తిచే బోధించును. అభిధాశక్తిచే

లభింపని ఈ యర్థము వాచ్యార్థము కాదు. లక్షణావృత్తిచే లభించిన యర్థము కావున దీనిని లక్ష్యార్థమందురు. వ్యాచ్యార్థము యొక్క యుపపత్తి యుభయత్ర యుండుటచే ఆలంకారికులు గౌణీవృత్తిని గూడా లక్షణా భేదమునుగానే చెప్పెదరు. గొల్లపల్లెయను వాచ్యార్థమును పూర్తిగా వదలి సామీప్యమును అను నర్థమును చెప్పినందు వలన సింహము అను వాచ్యార్థమును పూర్తిగా వదిలి పరాక్రమమును బోధించుటచే పై రెండు వాక్యములలోని సింహ గంగా శబ్దములు లక్షకములు. అవి జహల్లక్షణా (వాచ్యార్థమును విడచిన లక్షణ) వృత్తిచే పరాక్రమ సామీప్యార్థములను బోధించును. కావున యా యర్థములు లక్ష్యార్థములు. బల్లెములు ప్రవేశించుచున్నవి. అను వాక్యమున బల్లెములు స్వయముగా ప్రవేశించఁజాలకపోవుటచే వాచ్యార్థానుపపత్తి కారణముగా లక్షణావృత్తి నంగీకరింప వలసియున్నది. ప్రవేశన క్రియలో బల్లెములతోపాటు వానిని పట్టుకొన్న వారు కర్తలుగా నున్నందున వాచ్యార్థమును విడువక పోవుటచే అజహల్లక్షణ (వాచ్యార్థమును విడువని లక్షణ) మని ఈ లక్షణ పేర్కొనఁబడును. ఆ దేవదత్తుడేవీడు అను వాక్యమున 'ఆ' యను శబ్దము దేవదత్తుని చూచిన భూతకాలమును వీడు అను శబ్దము వర్తమాన కాలమును విశేషణములతో కూడిన దేవదత్తుడును విశేష్యమున నన్వయించవలెను. కాని భూతకాలము వర్తమాన కాలము ఒకసారి యుండుట యనుపపన్నము. కావున భూతకాల వర్తమాన కాలాంశముల విడచి "దేవదత్త" అను విశేష్యమును విడువక యుండుటచే నీ లక్షణను జహదజహల్లక్షణ (వాచ్యార్థ) విశేషణముల విడిచి విశేష్యాంశమును విడువని లక్షణయని పేర్కొనఁబడును. అట్లే **తత్త్వమసి, సోఽహమ్** యను వాక్యములలోని తత్పదార్థము సర్వజ్ఞత్వాది గుణవిశిష్టుడైన ఈశ్వరుని త్వమహమ్పదములు కించిద్జ్ఞత్వాది గుణ విశిష్టుడైన జీవుని బోధించును. కాని సర్వజ్ఞత్వాదులు కించిద్జ్ఞత్వాదులకు విరుద్ధములు కావున, నొక విశేష్యమున నుండక పోవుటచే వాచ్యార్థమనుపపన్నము. కావున నిచ్చట పై వాక్యమునందు వలెనే విశేషణాంశ పరిత్యాగము విశేష్యాంశాపరిత్యాగ ముండుటచే ఇచట అంగీకరింపఁబడిన లక్షణ జహదజహల్లక్షణ యగును. జహదజహల్లక్షణ నంగీకరించని వారు ఇచట జహల్లక్షణచే వాక్యార్థ బోధము నంగీకరించెదరు. విస్తరభయముచే ఈ యంశము వివరింపఁబడలేదు. ఈ శ్లోకమున ఈశ్వరుని యందలి మాయికమైన సర్వజ్ఞత్వమును విడచి జీవునియందలి కించిద్జ్ఞత్వమును విడిచి నిర్గుణమైన ఆత్మ అఖండార్థము లక్షణావృత్తిచే లభించునని ఆ లక్ష్యార్థము అఖండము చిన్మాత్రైక్యమను నట్టిది. కావున నీయర్థము అఖండ వాక్యార్థమనఁబడును.

అవ॥ పై శ్లోకమున **జీవో దేవస్సనాతనః** వంటి వాక్యముల అఖండలక్ష్యవాక్యార్థము బోధింపఁబడినది. ఈ శ్లోకమున నాత్మయందలి సర్వజ్ఞత్వ కించిద్ జ్ఞత్వగుణముల యనుపపత్తి చిన్మాత్రాత్మయందు నిరూపింపఁబడుచున్నది.

శ్లో॥ సర్వజ్ఞోఽపి స్వాధికహీనోఽసకలజ్ఞః
కించిద్ జ్ఞోఽపి స్వామిని లీనోఽకించిద్జ్ఞః ।
జ్ఞానాజ్ఞానాభ్యామపి చాన్యః పరమాత్మా
తం చిన్మాత్రం సాక్షిణమేకం శివమీడే ॥ 11 ॥

ప్ర॥ సర్వజ్ఞోఽపి – సర్వజ్ఞుడైనను, స్వాధికహీనః – తనకంటే నధికుడులేనివాడై, అసకలజ్ఞః – అసర్వజ్ఞుడు, భవతి – అగుచున్నాడు, కించిద్జ్ఞోఽపి–కించిద్ జ్ఞుడైనను, స్వామిని లీనః – స్వామియందు నిలీనుడై, అకించిద్జ్ఞః – ఏమియు తెలియనివాడు, భవతి – అగుచున్నాడు. పరమాత్మా – పరమాత్మ, జ్ఞానాజ్ఞానాభ్యామపి – జ్ఞానాజ్ఞానములకంటెను, అన్యః – వేరైనవాడు, తమ్ – ఆ, చిన్మాత్రమ్– చిన్మాత్రుడైన, సాక్షిణమ్ – సాక్షియైన, ఏకమ్ – ఒకడైన, శివమ్ – శివుని, ఈడే – స్తుతించెదను.

తా॥ సర్వజ్ఞుడైనను స్వాధికహీనుడైనందున, అసర్వజ్ఞుడే యగుచున్నాడు. కించిద్జ్ఞుడైనను స్వామి యందు నిలీనుడై నందున అకించిద్ జ్ఞుడేయగు చున్నాడు. పరమాత్మ జ్ఞానాజ్ఞానములకన్యుడు. ఆ చిన్మాత్ర సాక్షియైన ఏకైక శివునే స్తుతించెదను.

వి॥ ఈశ్వరునకు సమానుడైన వాడే లేనందున అధికుడుండ జాలడని వేరుగా చెప్పనవసరము లేదు. ఈశ్వర శబ్దమునకు సర్వాధికత్వమే యర్థము. ఈశ్వరుడు సర్వస్వరూపుడు. సర్వజ్ఞుడు స్వాధికుడు లేనందున స్వాధిక జ్ఞాన మాతనికి లేదు. సర్వములో స్వాధికము కూడ నొకటి కావున ఈశ్వరుడు సర్వజ్ఞుడు కాడని వ్యాజస్తుతి చేయబడినది. జీవుడు కించిద్జ్ఞుడు. కించిద్జ్ఞుడననుకొనుటచేతనే ఈశ్వరత్వము నందలేక పోవుచున్నాడు. కించిద్జ్ఞుడు తన జ్ఞేయమున కీశ్వరుడైన కావచ్చును. తనకు తెలియని దానికీశ్వరుడు కాజాలడు. జీవుడు ఈశ్వరునందు లీనుడై యుండును. జీవుడు ప్రాజ్ఞతైజస విశ్వరూపుడుగ తన జాగ్రత్స్వప్నసుషుప్తుల నభిమానించును. ప్రాజ్ఞ సమష్టి యవ్యాకృతుడనఁబడును. అవ్యాకృతైక దేశుడు ప్రాజ్ఞుడు. అవ్యాకృత నిలీనుడే యగుచున్నాడు. ప్రాజ్ఞుని నుండి జనించు తైజసవిశ్వులు నవ్యాకృత నిలీనులేయగుచున్నారు. సుషుప్త్యవస్థాభిమానియైన ప్రాజ్ఞుడు నేమియునెఱుగ కుండును. ఏమైన నెఱిగిన కదా కించిద్జ్ఞుడగును. స్వప్నజాగ్రద్దశలలోని యెఱుగుటయు నజ్ఞానములోనిదే. కావున కించిద్జ్ఞత్వము కూడ జీవునకు లేదని ప్రౌఢవాదఫణితిలో జీవుని యల్పత్వము నిరాకరింపఁబడినది. ఫలితముగా ఈశ్వరునాధిక్యము (సర్వజ్ఞత్వము) జీవుని యల్పత్వము (కించిద్జ్ఞత్వము) నిరాకరింపఁబడుటచే జీవేశ్వర భేదములేనిదై చిన్మాత్రైక్యము సిద్ధించుచున్నది. జ్ఞానమనగా తెలిసికొనుట. ఇది మనసు యొక్క క్రియ. ఈ జ్ఞానము స్వరూపజ్ఞానముకాదు. కనుక జ్ఞానముకన్న అన్యుడు పరమాత్మ. అజ్ఞానము అనగా తెలియని తనము. ఇది అభావరూపమని తార్కికులందురు. వేదాంతులు మాత్రము భావరూపమందురు. ఈ యజ్ఞానము కన్న జ్ఞప్తి స్వరూపుడైన పరమాత్మ అన్యుడే. అజ్ఞానశబ్దమున మొదట నఞ్ అను అవ్యయమున్నది.

దానియర్థములలో అల్పత్వము కూడ నొక యర్థము. కావున అజ్ఞాన మనగా కించిద్జ్ఞత్వము. జ్ఞానమనగా సర్వజ్ఞత్వము. అజ్ఞానము జీవ లక్షణము. జ్ఞానమీశ్వర లక్షణము. జ్ఞప్తి, ఈ రూపుడైన పరమాత్మ ఈ జ్ఞానాజ్ఞానములకన్న నన్యుడు.

అవ॥ పై శ్లోకమున సర్వజ్ఞత్వ కించిద్ జ్ఞత్వాద్యుపాధిరహిత కేవల పరమాత్మ ప్రతిపాదింపఁబడినది. ఈ శ్లోకమున పరమాత్మ ఓంకారార్థమని చెప్పఁబడుచున్నది.

శ్లో॥ ఓంకారార్థో హంసరహస్యః పరిపూర్ణః
ప్రత్యగ్రూపో భాతి చ పంచాక్షరగమ్యః ।
ఈశస్సోఽస్మీత్యేవ సమాధ్యా విదితస్స్యాత్
తం చిన్మాత్రం సాక్షిణమేకం శివమీడే ॥ 12 ॥

ప్ర॥ ఓంకారార్థః – ఓంకారము అను నొక పదమునకర్థమైనవాడు, హంసరహస్యః – సోఽహమను మంత్రము యొక్క రహస్యమైనవాడు, పరిపూర్ణః – దేశకాల వస్తు పరిచ్ఛేదములు లేనివాడు, ప్రత్యగ్రూపః – స్వాత్మరూపుడు, పంచాక్షరగమ్యః – పంచాక్షర మంత్రమునే పొందదగిన, సః – ఆ ఈశుడనే, అస్మి – అగుచున్నాను, ఇతి ఏవ – అనియే, సమాధ్యా – సమాధిచేత, విదితః – తెలియబడినవాడు, స్యాత్ – అగును, తమ్ – ఆ, చిన్మాత్రమ్ – చిన్మాత్రుడైన, సాక్షిణమ్ – సాక్షియైన, శివమ్ – శివుని, ఈడే – స్తుతించెదను.

తా॥ పరమాత్మ ఓంకారము యొక్క అర్థము. హంస మంత్రము యొక్క రహస్యము. పరమాత్మ పరిపూర్ణుడు. స్వాత్మరూపుడు పంచాక్షరగమ్యుడైన ఆ ఈశుడును నేనగుచున్నానని సమాధిచే తెలియఁబడును. ఆ సాక్షి చిన్మాత్రైక శివుని స్తుతించెదను.

వి॥ వ్యష్టిసమష్ట్యభిమాని, జాగ్రదవస్థాభిమాని, అకారార్థము– విశ్వవైశ్వాన రోభయము. వ్యష్టి సమష్ట్యభిమాని స్వప్నావస్థాభిమాని, ఉకారార్థము– తైజసహిరణ్యగర్భో భయము. మకారార్థము వ్యష్టి సమష్ట్యభిమాని ప్రాజ్ఞావ్యాకృతోభయము. అర్ధమాత్రార్థము – తురీయమైన సాక్షి స్వరూపము. చివరి అర్ధమాత్రలో ఓంకార మంతయు లీనమైయున్నది. అది రూపాయ వంటిది. అట్లే వ్యష్టి సమష్ట్యభిమాని. షట్కమీయర్ధసూత్ర యొక్క అర్ధమైన సాక్షి స్వరూపమందు లీనమై యున్నది. చతుష్పాద్రూపమైన సాక్షియైన, ఈ ఆత్మ యందు ప్రాజ్ఞావ్యాకృతోభయమందు తైజసహిరణ్యగర్భోభయము ముప్పావలాలో అర్ధరూపాయగా నున్నది. తైజస హిరణ్యగర్భోభయమందు, విశ్వ వైశ్వానరోభయము అర్ధరూపాయలో పావలా రూపమున నున్నారు. ఇట్లు మాండూక్యోపనిషత్తునందోంకారార్థము చతుష్పాదాత్మగా నిరూపింపఁబడినది. హంస మంత్రమనగా సోఽహమను మంత్రము ఉచ్ఛ్వాసము అంతరాకాశమున, నిశ్శ్వాసము బహిరాకాశమున లీనమగును. ఆకాశమున అంతర్బహి ర్భేదము ఉపాధికృతము. ఉపాధి లయము కాగా అంతరాకాశము బహిరాకాశము ఏక రూపమైనట్లు ఆకాశోపమమైన ఆత్మయొక్క లోపలి భాగము (ప్రత్యగాత్మయని పిలువఁ

బడును). ఆత్మయొక్క బయటి భాగము (పరమాత్మ యనఁబడును). లోపల 'బయటి' అను శబ్దములు ఉభయాత్మలను వేరుచేయు శరీరోపాధికృతభేదబోధకములు తొలగిపోగా జీవేశ్వరు లేకాత్మ యగుదురు. కారణ శరీరమైన అజ్ఞానము తజ్జన్య సూక్ష్మస్థూల శరీరములు రెండు మొత్తము శరీరత్రయము ఉపాధిగా ప్రత్యగాత్మ పరమాత్మ భేద జ్ఞానము కలుగచేయుచున్నవి. సోఽహమను మంత్రము యొక్క అర్థమును భావించుచు శరీర త్రయోపాధిని విలీనము చేయగా మిగులు బహిరంతర్భేదము లేని యేక పరమాత్మయే హంసమంత్రరహస్యము. పరమాత్మయొక్క పరిపూర్ణత్వము వెనుక మంత్రమునందే వివరింపఁబడినది. పంచాక్షరము **నమః శివాయ** యను మంత్రములోని యక్షరములన్ని **వేదాక్షరాణి యావంతి** ఇత్యాది సూక్తి ప్రకారము శివనామములు అగుచున్నవి. అన్నింటికిని శివుడనియే యర్థము. అన్ని యక్షరములు శివవాచకములైనచో నీ పంచాక్షరగమ్యః అని చెప్పుటెందుకు, అను ప్రశ్నము కలుగును. మహాజనపరిగృహ్ఈతమగుటచే నీ పంచాక్షర మంత్రజపము అభ్యర్థితమగును – అని ప్రశ్నకు సమాధానము. సురేశ్వరాచార్యులీ పంచాక్షర మంత్రమున కనేక విధములుగా నర్థము చెప్పినారు. ఆ యర్థములన్నింటికి శివైక్యమునందే పర్యవసానము. ఋగ్వేదము, యజుర్వేదము సామవేదము అని వేదములు మూడు. వానికి (వేద) త్రయమని పేరు గలదు. (అథర్వాంగిరసములలో వేద త్రయమందు లేని మంత్రములు కొన్ని సంగ్రహింపబడినవి). ఆ మూడు వేదములలో యజుర్వేదము మధ్యమము. యజుర్వేద మధ్యమమున రుద్రాధ్యాయము (నమకము) కలదు. దానికి మధ్యమున **నమస్సోమాయచ** అను అనువాకము కలదు. దాని మధ్యమమున **నమః శివాయ** అను మంత్రము కలదు. ఈ మంత్రమున కాది యందు నమః అను అవ్యయము, అంతమున చతుర్థీ విభక్తియు కలవు. ఈ మంత్రమున శివ శబ్దము మధ్యమున నున్నది. శివ శబ్దము యొక్క మహత్త్వము బహు పురాణములలో బహుధా వివరింపఁబడినది. **వశి కాంతౌ శివః స్మృతః** అను సూక్తి యొకటి కలదు. హిసి ధాతువు నుండి సింహ శబ్దము వర్ణ వ్యత్యయ కారణముగా నేర్పడినట్లు ఇచ్ఛా కాంత్యర్థకమైన వశిధాతువు నుండి శివ శబ్దమేర్పడినది. ద్వ్యక్షరమైన ఈ శబ్దము ఉచ్చరించు వారల ద్వివిధపాపముల పోగొట్టకలదు. ఒకటి విధి విహితమైన కృత్యము చేయకపోవుట, రెండవది నిషిద్ధమైన యకృత్యమును కృత్యమంత శ్రద్ధగా చేయుట. ఈ రెండు దోషములలో చేరని దోషములే యుండజాలవు. అవి రెండు (అనగా సర్వదోషములు) శివ శబ్దోచ్చారణముచే నశించును. (ఈ జన్మమునకు పూర్వము భూతకాలమున ఓ శివా నీకు నమస్కరించలేదు. ఈ జన్మలో నమస్కార సమకాలముననే నాకు విదేహముక్తి యేర్పడినది. కావున ఈ జన్మమునకు భవిష్యకాలమున నమస్కారము చేయఁజాలను. (శివ శబ్దమునుచ్చరించువారి) ఈ భూత భావ్యపరాధముల రెంటిని క్షమించుమని యొక కవి చమత్కారముగా చెప్పెను).

అవ॥ పై శ్లోకమున శివుడు పంచాక్షరము గలవాడని చెప్పఁబడినది. శైవులైనవారు పంచాక్షరము జపించెదరు. కావున శైవులకు శివుడు ప్రాప్యుడగును. శైవులు కాని వైష్ణవాదులకతడు గమ్యుడు కాడనునపోహ యేర్పడు నవకాశము కలదు. ఈ శ్లోకమున నాయపోహ తొలగింపఁబడుచున్నది.

శ్లో॥ **శైవాగమ్యో వైష్ణవగమ్యశ్శివ ఏకః**
సర్వైరన్యైర్వేదమతస్థైర్న చ గమ్యః ।
శైవాద్వైతధ్యాతృభిరేవ తు సంగమ్యః
తం చిన్మాత్రం సాక్షిణమేకం శివమీడే ॥ 13 ॥

ప్ర॥ ఏకః – ఒకడైన, శివః – శివుడు, శైవాగమ్యః – శైవులకు పొందరానివాడు, వైష్ణవగమ్యః – వైష్ణవులకు ప్రాప్యుడు, అన్యైః – ఇతరులైన, వేదమతస్థైః – వేద మతస్థులైన, సర్వైః – అందరిచేతను, గమ్యః చ న – గమ్యుడుకాడు, శైవాద్వైతధ్యాతృభిః ఏవ – శైవాద్వైతమున ధ్యానించువారి చేతనే, సంగమ్యః – చక్కగా పొందదగినవాడు, తమ్ – ఆ, చిన్మాత్రమ్ – చిన్మాత్రుడైన, సాక్షిణమ్ –సాక్షియైన, ఏకమ్ – ఒకడైన, శివమ్ – శివుని, ఈడే – స్తుతించెదను.

తా॥ ఒకడైన శివుడు ద్వైతులైన శైవులకు గమ్యుడు కాడు, అద్వైతులైన వైష్ణవులకు గమ్యుడు. శివుడు జీవేశ్వరభేదము నంగీకరించు నే వేదమతస్థుల చేతను గమ్యుడుగాడు. శైవాద్వైతధ్యానమొనర్చువారి చేత చక్కగా పొందదగినవాడు, ఆ చిన్మాత్రైక సాక్షియైన శివుని స్తుతించెదను.

వి॥ జీవేశ్వరభేదము నంగీకరించిన వారు ద్వైతులు. తద్భేదము నంగీకరించని వారద్వైతులు. ద్వైతసిద్ధాంతమున స్వతంత్రపరతంత్ర భేదమున పదార్థము ద్వివిధము. పదార్థము నందలి ఈ ద్విత నంగీకరించు వారు ద్వైతులు. ఈశ్వరుడు స్వతంత్రుడు. జీవజడ భేదమున అస్వతంత్రపదార్థము గూడ ద్వివిధము. ఈ విధముగా స్వతంత్రాస్వతంత్ర రూప ద్వితను జీవజడరూపద్వితను అంగీకరించు వారు ద్వైతులు. ద్వితయే ద్వైతము. ఇట్టి ద్వితయే వేదపురాణాగమ సిద్ధాంతమని పూర్ణప్రజ్ఞులను పేరుగల మధ్వాచార్యులు ప్రతిపాదించినారు. వారి మతానుయాయులు విష్ణుపారమ్యము నంగీకరించినందున వైష్ణవులనఁబడుదురు. మాధ్వులని కూడ వారికి వ్యవహారమున కలదు. వీరు వైష్ణవులైనను వేదప్రామాణ్యము నంగీకరించిన వారైనను వారికి విష్ణువను నామాంతరము గల శివ పరబ్రహ్మము లభింపదు. కాని వైష్ణవులైనను జీవేశ్వర భేదమునంగీకరించని వారికా శివబ్రహ్మప్రాప్తి కలదు. కావున శివుడు వైష్ణవ గమ్యుడు. జీవుడు, ఈశ్వరుడు, జడము అని పదార్థము మూడు విధములుగ నుండును. ఈ మూడింటికి తత్త్వ త్రయమనియు

పేరుకలదు. జడము జీవున కొఱకేయున్నది కావున పదార్థము, జీవుడు కూడ ఈశ్వరుని కొఱకే యున్నాడు(రు). కావున జీవుడు పదార్థరూపుడు. జడము జీవునకు శరీరముగా, జీవుడీశ్వరునకు శరీరముగా నుండుటచే జీవజడములీశ్వరార్థములే ఐయున్నందున పదార్థములే. చెట్టు వంటి వాడీశ్వరుడు. కొమ్మల వంటి వారు జీవులు. రెమ్మల సముదాయము వంటిది జడము. మొత్తము వృక్షము రెమ్మల సముదాయముచేత, జీవుల సముదాయముచే విశిష్టమైన వృక్షము ఒక్కటిగా వ్యవహరింపఁబడుచున్నది. అట్లే జడజీవవిశిష్టు డీశ్వరు డొక్కడేయని యంగీకరించువారు విశిష్టాద్వైతులనఁబడుదురు. ఈ విశిష్టాద్వైతులలో విష్ణుపారమ్యము నంగీకరించు వైష్ణవులు శివపారమ్యము నంగీకరించు శైవులును కలరు. ద్వైతులైన మాధ్వవైష్ణవులతో విభేదించినవారు కావున వీరిని శ్రీ వైష్ణవులందురు. శ్రీ శంకరుల సమకాలికులైన నీలకంఠులు బ్రహ్మసూత్రముల కొక భాష్యము రచించిరి. అందు శివ పారమ్యము నిరూపింపఁబడినది. దానికప్పయ్య దీక్షితులద్వైతపరముగా నొక వ్యాఖ్యానము రచించినారు. వీరు అద్వైతులు కారని, శివశ్రీ ముదిగొండ నాగలింగ శాస్త్రి గారు అద్వైతపరముగా అప్పయ్య దీక్షితుల వారు చేసిన వ్యాఖ్యానమును ఖండించుచు మరొక వ్యాఖ్యానము చేసినారు. నీలకంఠాచార్యుల వారి భాష్యమునందలి శివపారమ్యమునకు బదులు విష్ణు పారమ్యమును నిరూపించుచు రామానుజాచార్యుల వారు విశిష్టాద్వైతపరముగా బ్రహ్మసూత్రములకు భాష్యమును రచించినారు. శివపారమ్యమైనను విష్ణుపారమ్యమైనను స్థూల చిదచిద్విశిష్ట కార్య బ్రహ్మకు అభేదము విశిష్టాద్వైత మనఁబడును. అద్వైతమను పేరున్నను తత్త్వత్రయము నంగీకరింపఁ బడినందున త్రైతమనుట యుచితము. త్రైతమద్వైతము లేనిదే సంభవించదు. కావున త్రైతము కూడ ద్వైతమే యనఁదగును. శివ విష్ణు భేదమునంగీకరించనివారు ద్వైతులైనను విశిష్టాద్వైతులైనను వేదము ప్రమాణముగా నంగీకరించు నట్టి వేదమతస్థులెవరికైనను నా యేకైక శివుడు గమ్యుడు కాడు. నీలకంఠాచార్యుల మతము శివాద్వైతములో పేర్కొనఁ బడినను శివ శ్రీ ముదిగొండ నాగలింగారాధ్యులవారి మతమున విశిష్టా ద్వైతమున కన్న వేరుకాదు. వారి ననుసరించి శివాద్వైత శబ్దమందలి శివపదము శివపారమ్యమును అద్వైతపదము విశిష్టాద్వైతమునే తెలుపును. కావున వీరిదీ శ్లోకమునఁబేర్కొనఁబడిన శైవాద్వైతము మాత్రము కాదు. శైవాద్వైతమనగా విష్ణుబ్రహ్మ భిన్న శివుడు తప్ప మరొక పదార్థము నంగీకరించని అద్వైత మతము. ఇట్టి శైవాద్వైతమును అనగా శివైక్యమును ధ్యానించు వారికే శివుడు చక్కగా పొందదగినవాడగును.

అవ॥ పై శ్లోకమున అద్వైతము నంగీకరించని శైవ వైష్ణవులకు శివుడు గమ్యుడు కాడని చెప్పఁబడినది. ఈ శ్లోకమున శైవాద్వైతధ్యాతలకు శైవాద్వైత (శివ) సాక్షాత్కారము బ్రతికి యుండగానే లభించునని చెప్పఁబడుచున్నది.

శ్లో॥ జ్యోతిర్లింగం స్వాత్మని దృష్ట్వా దేహాదీన్
లోకాన్ హిత్వాఖండమనంతం పరిపశ్యన్।
జీవన్ముక్తో౾ హంకృతిహీనః శివయోగీ
తం చిన్మాత్రం సాక్షిణమేకం శివమీడే ॥ 14 ॥

ప్ర॥ దేహాదీన్ – దేహము మొదలైన, లోకాన్ – (స్థూలసూక్ష్మ) లోకములను, హిత్వా – విడిచి, అఖండమ్ – దేహపరిచ్ఛేదములేని, అనంతమ్ – కాల పరిచ్ఛేదములేని, జ్యోతిర్లింగమ్ – జ్యోతిర్లింగమును, పరిపశ్యన్ – చూచుచు, శివయోగీ – శివయోగి, అహంకృతిహీనః – అహంకృతిని వీడిన వాడై, జీవన్ముక్తః – జీవన్ముక్తుడు, భవతి – అగును. తమ్ – ఆ, చిన్మాత్రమ్ – చిన్మాత్రుడైన, సాక్షిణమ్ – సాక్షియైన, ఏకమ్ – ఒకడైన, శివమ్ – శివుని, ఈడే – స్తుతించెదను.

తా॥ తన యందు జ్యోతిర్లింగమును (భ్రూమధ్యమునుండి నిటలమందు) యోగాభ్యాసబలమున దర్శించి దేహాదులం దభిమానము వీడి దేశకాల పరిచ్ఛేదములు లేని యా శివుని సాక్షాత్కరించుకొని అహంకారవిహీనుడైన శివయోగి జీవన్ముక్తుడగును. అట్టి చినాత్రైక సాక్షియగు శివుని స్తుతించెదను.

వి॥ దృష్టిని భ్రూమధ్యమున కేంద్రీకరించినపుడు అక్కడ గుప్తముగా నున్న మూడవ కన్ను విచ్చుకొని దానిపై నిటలమున దీర్ఘ గోళాకారమైన జ్యోతిస్సుకనఁబడునని యోగులు చెప్పెదరు. శివయోగి అట్లు ధ్యానబలమున దర్శించి జ్ఞానమును అనగా దేశకాలపరిచ్ఛేదము లేని యాత్మను సాక్షాత్కరించుకొని అహంకారవిహీనుడై జీవన్ముక్తుడగును. ద్వైత విశిష్టాద్వైత లెవరును జీవన్ముక్తి నంగీకరించరు. దేహానంతరము భక్తులకు లభించు శివవిష్ణ్వాదిదేవతా లోకప్రాప్తియే ముక్తియని వారి యభిప్రాయము. అద్వైతమతమున జీవశివైక్యజ్ఞానము కలిగిన వెంటనే సాధకుడు జీవన్ముక్తి నందును. జీవన్ముక్తునకు దేహపాతానంతరము కైవల్యము లభించును. జ్ఞానమును పొంది జీవన్ముక్తుడగుటకు సాధనము మోక్షమార్గము లలో నొకటైన విహంగమార్గమని యిదివరకే చెప్పఁబడినది.

అవ॥ పై శ్లోకమున జ్యోతిర్లింగము ప్రస్తావింపఁబడినది. ఈ శ్లోకమున అది దీపాకారమని చెప్పబడుచున్నది.

శ్లో॥ నిత్యం శాంతం నిర్గుణమాద్యం నిటలస్థం
దీపాకారం సద్గురుతో యమ్ముద్రికయా ।
దృష్ట్వా నిత్యాభ్యాసవశాద్యః పరిపూర్ణః
తం చిన్మాత్రం సాక్షిణమేకం శివమీడే ॥ 15 ॥

ప్ర॥ నిత్యం – నిత్యుడైన, శాంతమ్ – శాంతుడైన, నిర్గుణమ్ – నిర్గుణుడైన, ఆద్యమ్ – ఆద్యుడైన, నిటలస్థమ్ – నుదుట నుండునట్టి, దీపాకారమ్ – దీపము వంటి ఆకారముగల, యమ్ – ఏ శివుని, సద్గురుతః – సద్గురుని వలన, ముద్రికయా – ముద్రికను, దృష్ట్వా – చూచి, నిత్యాభ్యాసవశాత్ – నిత్యాభ్యాసవశమువలన, యః – ఎవడు (సాధకుడు), పరిపూర్ణః – పరిపూర్ణుడు, భవతి – అగునో, తమ్ – ఆ, సాక్షిణమ్ – సాక్షియైన, చిన్మాత్రమ్ – చిన్మాత్రుడైన, ఏకమ్ – ఒక్కడైన, శివమ్ – శివుని, ఈడే – స్తుతించెదను.

తా॥ నిత్యుడు శాంతుడు, నిర్గుణుడైన యే శివుని గుర్వనుగ్రహమున (శాంభవ) ముద్రికతో నిటలమునందు దీపాకారముగా చూచి ఆ యభ్యాసబలమున సాధకుడు పరిపూర్ణుడగునో ఆ చిన్మాత్రైక సాక్షియైన శివుని స్తుతించెదను.

వి॥ మూలాధారము నుండి ఆజ్ఞ వఱకుగల చక్రములాఱు. ఏకపంచాశదక్షర మయములు. సహస్రారము సర్వవర్ణమయము అని శ్రీలలితా సహస్రనామ స్తోత్రమున చెప్పఁబడినది. **భ్రువోర్మధ్యే ప్రాణమావేశ్య సమ్యక్ సతంపరమ్ పురుషముపైతి దివ్యమ్** అని భగవద్గీత భ్రూమధ్య ప్రాణావేశము వలన పరమ పురుష దర్శనము కలుగునని చెప్పుచున్నది. ఇదియే పై శ్లోకమున ముద్రిక యని చెప్పఁబడినది. కొన్ని యోగశాస్త్ర గ్రంథములలో నిటలము నందు లలాటికమను చక్రము కలదని చెప్పఁబడినది. ఈ శ్లోకమున నిటలస్థమ్ అను పదమునకు లలాటికా చక్రగతుడైన అను అర్థము చెప్పుకొనదగును. భ్రూమధ్యము ఆజ్ఞా చక్రస్థానము. ఓకారమునకు స్థానము విశుద్ధిచక్రము (జీవవాచకము) దాని అనంతరమందుండు మకారము దానికి పిమ్మట నుండు బిందువును అనునాసికములు కావున నాసాగ్రము నందు నాసికయొక్క పై అగ్రమునందు వాని స్థానముండును. ఆ బిందువు నుండి మొదలైన దీపాకారము నిటలమున గోళాకారమున నుండును. ఇదియే జ్యోతిర్లింగ మని వెనుకటి శ్లోకమున చెప్పఁబడినది. భ్రూమధ్యము ధనుస్సులో శరసంధానము చేయుచోటు వంటిది. అది జీవస్థానము. ఆ జీవుని బ్రహ్మమునందు సంధించుట యట జరుగును. **ప్రణవో ధనుః శరో హ్యాత్మాబ్రహ్మ తల్లక్ష్యముచ్యతే అప్రమత్తేన వేద్ధవ్యం శరవత్తన్మయో భవేత్** అను మంత్రమీ విషయమునే తెలుపును.

అవ॥ పై శ్లోకమున నిటలస్థ దీపాకార శివలింగ దర్శనము చెప్పఁబడినది. ఈ శ్లోకమున అక్షి పురుష విద్య తత్ప్రాప్యమైన జీవన్ముక్తి ప్రస్తావింపబడుచున్నది.

శ్లో॥ అక్షిణ్యేనం దక్షిణ ఈశం శశి తుల్యం
యం వ్యోమ్న్యేకీకృత్య శివే తం పరమే చ ।
సర్వాత్మానః సంసృతిపాశాదిహ ముక్తాః
తం చిన్మాత్రం సాక్షిణమేకం శివమీడే ॥ 16 ॥

ప్ర॥ దక్షిణ – కుడి, అక్షిణి – కంటి యందు, యమ్ – ఏ, ఏవమ్ – ఈ, ఈశమ్ – ఈశుని (ఆకాశరూపుడైన), శివే – శివుని యందు, తమ్ – ఆ శివుని, పరమే వ్యోమ్నిచ – పరమాకాశరూపమైన చిత్తునందు, ఏకీకృత్య – కలిపి, సర్వాత్మానః – సర్వము ఆత్మగా భావించినవారు, ఇహ – ఈ జన్మమునందే, సంసృతిపాశాద్ – సంసార బంధము నుండి, ముక్తాః – విడివడినవారు, భవంతి – అగుదురు. తమ్ – ఆ, చిన్మాత్రమ్ – చిన్మాత్రుడైన, సాక్షిణమ్ – సాక్షియైన, ఏకమ్ – ఒకడైన, శివమ్ – శివుని, ఈడే – స్తుతించెదను.

తా॥ కుడి కంటి యందున్న ఈశ్వరుని శివుని యందు, ఆ శివుని పరమ వ్యోమ రూపమైన చిత్తునందు లయింపఁజేసి సర్వమును ఆత్మగా భావించు వారు బ్రతికి యుండగానే సంసారపాశమునుండి ముక్తులగుదురు.

వి॥ శైవము నందు బ్రహ్మ విష్ణువు రుద్రుడు ఈశ్వరుడు సదాశివుడు అను పేర్లుగల పంచబ్రహ్మలంగీకరింపఁబడినారు. బ్రహ్మ సృష్టిని, విష్ణువు స్థితిని, రుద్రుడు సంహారమును చేయగా ఈశ్వరుడు బంధమును, సదాశివుడు మోక్షమును కలిగించుదురు. సాధారణముగా పురాణములలో సృష్టిస్థితిలయములు మాత్రమే పేర్కొనబడి యుండగా శైవమున సృష్టిస్థితిలయతిరోధానానుగ్రహములను ఈశ్వరుని పంచకృత్యములు పేర్కొనఁబడినవి. ఈ అయిదుగురిలో బ్రహ్మ విష్ణువులు పురాణ ప్రసిద్ధులే. రుద్ర, ఈశ్వర, సదాశివులు ముగ్గురు శివమూర్తులు శైవదైవతలు. ఈ శ్లోకమున దక్షిణాక్షియందు ఈశుడున్నాడని చెప్పఁబడినది. బ్రహ్మసూత్రము నందలి అంతరధికరణములో దక్షిణాక్షి యందున్న వాడు జీవుడా ఈశ్వరుడా యను సంశయము దీర్చుచు జీవుడను పూర్వపక్షమును ఖండించి ఈశ్వరుడని సిద్ధాంతము చేయఁబడినది. పంచ బ్రహ్మలలో బ్రహ్మ యనగా వైశ్వానరుడు. విష్ణువనగా హిరణ్యగర్భుడు. రుద్రుడనగా నవ్యాకృతుడు. ఈశ్వరుడనగా త్రిగుణుడని, సదాశివుడనగా నిర్గుణ శివుడని గ్రహింపవలెను. లేక రుద్రుడనగా వైశ్వానరుడు, బ్రహ్మయనగా హిరణ్యగర్భుడు, విష్ణువనగా నవ్యాకృతుడని గ్రహింపవలెను. వరుసగా వైశ్వానరుని హిరణ్యగర్భునందు, హిరణ్యగర్భు నవ్యాకృత నామాంతరముగల రుద్రునియందు ఆ అవ్యాకృతరుద్రుని త్రిగుణేశ్వరుని యందు త్రిగుణేశ్వరుని సదాశివుని యందు అనగా చిన్మాత్ర సాక్షియందు విలీనము చేసి చిన్మయతను సాధించినవారు ఈ జన్మమునందే జీవన్ముక్తిని పొంది సంసారబంధవిముక్తులగుదురు. పంచబ్రహ్మాతీతుడైన శివుడే చిన్మాత్ర సాక్షియనుట యుచితము. వైశ్వానర హిరణ్య గర్భులకు బ్రహ్మ విష్ణువులకు పక్షాంతరమున రుద్ర బ్రహ్మలకు జీవత్వము ఈశ్వరత్వము రెండును గలవు. అవ్యాకృతున కీశ్వరత్వమే కాని జీవత్వము లేదు. బ్రహ్మ విష్ణురుద్రులకన్న వేరుగా త్రిగుణేశ్వరుని తిరోధాన కర్తను పెక్కుమతముల వారంగీకరించరు. పంచబ్రహ్మాతీత శివుడే తుర్యుడని (నాల్గవవాడని) మాండూక్యము నందు చెప్పఁబడినది.

అవ॥ పై శ్లోకమున సాక్షి యందు సమస్త జడ జీవేశ్వర ప్రవిలాపము చెప్పఁబడినది. ఈ శ్లోకమున చిద్రూపుడు సాక్షియునైన శివుని స్వరూపము సాక్షాత్కరించు కొనుటచే సంసార శోకము తొలగునని చెప్పఁబడుచున్నది.

శ్లో॥ దృశ్యో దేహో నాయమహం సత్సుఖమాత్ర-
శ్చిద్రూపోఽస్మీత్యైక్యముపేత్యోపరి యేన ।
సంసారోత్థం శోకమనంతం (నాది) విజహాతి
తం చిన్మాత్రం సాక్షిణమేకం శివమీడే ॥ 17 ॥

ప్ర॥ అయమ్ – ఈ, దృశ్యః – దృశ్యమైన, దేహః – దేహము, అహమ్ – నేను, న – కాను, సత్సుఖమాత్రః – సత్తానందస్వరూపుడైన, చిద్రూపః – చిద్రూపుడు, అస్మి – అగుదును, ఇతి – అని, ఐక్యమ్ – ఐక్యమును, ఉపేత్య – పొంది, ఉపరి – పైన, యేన – ఏశివునిచే, సంసారోత్థమ్ – సంసారమునుండి జనించు, అనంతమ్ – అపారమైన, శోకమ్ – దుఃఖమును, విజహాతి – విడుచునో, తమ్ – ఆ, సాక్షిణమ్ – సాక్షియైన, చిన్మాత్రమ్ – చిన్మాత్రుడైన, ఏకమ్ – ఒకడైన, శివమ్ – శివుని, ఈడే – స్తుతించెదను.

తా॥ ఈ దేహము దృశ్యమగుటచే దేహమును నేనుకాను, సచ్చిదానందరూపుడను సర్వజీవసాక్షిగా నున్నవాడను అని జీవేశ్వరైక్యభావమును పొంది ఆ శివుని యనుగ్రహముచే సంసారముయొక్క అపారదుఃఖమును విడిచివేయును. అట్టి ఆ చిన్మాత్రసాక్షి శివునొకని స్తుతించెదను.

వి॥ చూడబడునది చూచు వానికన్న వేరనుట లోకప్రసిద్ధము. ఈ దేహము దృశ్యము, ఇది స్థూలము, సూక్ష్మము కారణము అని త్రివిధము. జాగ్రదవస్థలో స్థూల దేహము, స్వప్నావస్థలో సూక్ష్మదేహము, నిద్రావస్థలో కారణ దేహము వివిక్తముగా ననుభవింపఁబడును. ఈ అనుభవింపబడుట దృశ్యత. దృశ్యత యనగా కంటితో మాత్రమే చూడఁబడుటకాదు. స్థూలమనగా శిరః కంఠోదరాది రూపము. సూక్ష్మమనగా ప్రాణేంద్రియమనోబుద్ధి రూపము. కారణమనగా అజ్ఞానరూపము. తెలుపు నలుపు ఎరుపు మొదలగు వర్ణములు పొట్టి పొడుగు లావు మొదలగు నాకృతులు స్థూల శరీరమునకు చెందినవి. కావున నేను పొట్టి వాడను. పొడుగువాడను, లావైన వాడను ఇత్యాది జ్ఞానములు మిథ్యలు. ఆత్మకు హ్రస్వదీర్ఘస్థూలాది భేదములు లేవు. అట్లే చూచుట, వినుట మొదలగునవి జ్ఞానేంద్రియకృత్యములు. మాట్లాడుట నడచుట మొదలగునవి కర్మేంద్రియకృత్యములు. ఆకలి దప్పులు ప్రాణమునకు సంబంధించి నవి. సంశయించుట నిశ్చయించుట మనోబుద్ధి కృత్యములు. చింతించుట గర్వించుట ఆలోచించుట అహంకరించుట మొదలగునవన్నియు మనోబుద్ధి చిత్తాహంకార కృత్యములే కావున ఆత్మ కర్తకాదు. నిద్రలో తెలియని తనము మనచే తెలిసికొనఁబడుచున్నది. అనగా దృశ్యమగుచున్నది. కావున తెలియక పోవుట

తెలివియనెడి ఆత్మకన్న భిన్నము. జన్మమరణములు స్థూలదేహమునకే. సూక్ష్మదేహమునకు లేవు. సూక్ష్మ దేహమునకే లేకపోవుచుండగా కారణదేహమునకు లేవని చెప్పనక్కఱలేదు. ఆత్మజ్ఞానము కలుగగా తెలియనితనము మరియు ఇంద్రియ జ్ఞాన రూపమైన మిథ్యాజ్ఞానము నశించగా సచ్చిదానంద రూపాత్మ సాక్షాత్కారము లభించును.

అవ॥ పై శ్లోకమున వ్యష్టి స్థూల సూక్ష్మకారణ శరీరాభిమానపరిత్యాగము వర్ణింపఁబడినది. ఈ శ్లోకమున సమష్టి దేహమైన బ్రహ్మాండము నందలి భూత వికారములైన ఆకాశాదుల ప్రవిలాపము చేయగా అధిష్ఠానరూపముగా నాత్మ మిగులునని చెప్పఁబడుచున్నది.

శ్లో॥ ఆకాశాదీన్ భూతవికారానపలాప్య
స్వేఽధిష్ఠానం శేషితమస్మీత్యచిరేణ ।
జ్ఞాత్వా యుక్త్యా ముంచతి చాన్యా ఇహ వాచః
తం చిన్మాత్రం సాక్షిణమేకం శివమీడే ॥ 18 ॥

ప్ర॥ భూతవికారాన్ – సూక్ష్మ భూత వికారములైన, ఆకాశాదీన్ – ఆకాశము మొదలైన స్థూలభూతములకు, స్వే – తనయందు, అపలాప్య – లయింపఁజేసుకొని, శేషితమ్ – మిగిలిన, అధిష్ఠానమ్ – ఆధారముగను, అస్మి – అగుదును, ఇతి – అని, అచిరేణ – శీఘ్రముగా, జ్ఞాత్వా – తెలిసికొని, యుక్త్యాచ – యుక్తిచేతను, అన్యాః – ఇతరములైన, వాచః – వాక్కులను, విముంచతి – విడుచునో, తమ్ – ఆ, చిన్మాత్రమ్, సాక్షిణమ్ – సాక్షియైన, ఏకమ్ – ఒకడైన, శివమ్ – శివుని, ఈడే – స్తుతించెదను.

తా॥ సూక్ష్మ భూత వికారములైన ఆకాశాది స్థూలభూతములను సూక్ష్మ భూతములందు ప్రవిలాపింపజేసి, ఆ సూక్ష్మభూతములను ఆత్మయందు ప్రవిలాపింపఁజేసి వానికధిష్ఠానముగా మిగిలియున్నది నేనని శీఘ్రముగా తెలిసికొని యుక్తిచే నితర వాక్కులనన్నింటిని విడుచునో, ఆ చిన్మాత్రుడైన, సాక్షియైన ఒకడైన శివుని స్తుతించెదను.

వి॥ అపంచీకృత భూతములు సూక్ష్మభూతములు. పంచీకృతభూతములను అపంచీకృతభూతములలో లయింపఁజేసి అపంచీకృతభూతములలో చివర జనించిన భూమిని జలము నందు, జలమును తేజమందు, తేజమును వాయువునందు, వాయువును నాకాశమునందు, ఆకాశమును ఆత్మ యందు అపలపింపఁజేయవలెను. చివరకు చేసిన అపలపనము దేనియందు? దేని యందు అపలాపనము చేయుదమో దాని కధిష్ఠానముండవలెగదా ఆ యధిష్ఠానము తానే కావలెను. అపలపనము చేయువాడు తానే కావున తనయందే అన్నింటిని అపలపనము జరిగిన పిమ్మట ఇక మిగులునది తానే. ఇదియే ముక్తి. తానే సర్వాధిష్ఠానమని యెరిగిన వాని కితర వాక్కులతో నేమిపని? పనిలేదు. కావున నితర వాక్కుల విడిచివేయును. ఉపనిషత్తు నందును **తమేవైకం జానథ**

ఆత్మానమన్యావాచోవిముంచథ. ఆ యొక్క యాత్మనే తెలిసికొనుడు. ఇతరములైన వాక్కులను విడువుడు అని ఉపదేశింపఁబడినది. ఈ శ్లోకమున దాని ననుసరించియే ఆత్మజ్ఞాని అన్యవాక్కులను విడుచును అని చెప్పఁబడినది.

అవ॥ జీవేశైక్య రూప బ్రహ్మ (శివ) జ్ఞానమే (శివ) సాక్షాత్కారమని పై శ్లోకమున చెప్పఁబడినది. ఈ క్రింది శ్లోకమున అదియే సర్వజ్ఞత యని చెప్పఁబడుచున్నది.

శ్లో॥ జ్ఞాతే యస్మిన్ సర్వమిదం స్వాదభిదం స్యా-
దజ్ఞాతేఽస్మిన్ నైవ సమస్తం విదితం స్యాత్ ।
నానుధ్యాయాద్యద్విదసత్సద్బహుశబ్దాన్
తం చిన్మాత్రం సాక్షిణమేకం శివమీడే ॥ 19 ॥

ప్ర॥ యస్మిన్ – ఏబ్రహ్మ (శివస్వరూపము), జ్ఞాతే – తెలియబడగా, ఇదమ్ –ఇది, సర్వమ్ – అంత, స్వాద్ – తనకంటె, అభిదమ్ – భేదములేనిదిగా నున్న, విదితమ్ – తెలియబడినది, స్యాత్ – అగును, యస్మిన్ – ఏబ్రహ్మ – ఏబ్రహ్మ (శివస్వరూపము), అజ్ఞాతే – తెలియఁబడకుండగా, ఇదమ్ – ఇది, సర్వమ్ – అంత, విదితమ్ – తెలియఁబడినది, న ఏవ స్యాత్ – కానేకాదో, యద్విద్ – ఏ శివస్వరూపము నెరిగినవాడు, అసత్‌సద్‌బహుశబ్దాన్ – చెడ్డవి మంచివియైన పెక్కు శబ్దములను, నానుధ్యాయాత్ – ధ్యానించడో, తమ్ –ఆ, సాక్షిణమ్ – సాక్షియైన, ఏకమ్ – ఒకడైన, శివమ్ – శివుని, ఈడే – స్తుతించెదను.

తా॥ ఏది తెలిసిన సర్వము స్వాభిన్నమని తెలియునో ఏది తెలియక ఇది యంతయు తెలియబడదో, దేని నెరిగినవాడు సాధ్వసాధుబహు శబ్దముల విచారించడో, ఆ చిన్మాత్ర సాక్షియైన శివునొకని స్తుతించెదను.

వి॥ ఏక విజ్ఞానముతో **సర్వ విజ్ఞాన ప్రతిజ్ఞ** ఉపనిషత్తులలోను, భగవద్గీత యందును చేయఁబడినది. మట్టితో ఎన్ని వస్తు విశేషములు సిద్ధము చేయవచ్చునో ఎవడును చెప్పలేడు. వస్తు విశేష పరిజ్ఞానముతో వస్తు సామాన్య పరిజ్ఞానము అసంభవము. ఏలననగా విశేషము లసంఖ్యాకములు. వానికి ఇయత్త అనునది లేదు. అంతమాత్రమున అవి మనకు తెలిసికొనుటకు మార్గము లేదనరాదు. మట్టిని తెలిసికొనిన మట్టి వస్తువులన్నియు తెలియఁబడినట్లేయగును. అట్లే బంగరు వస్తువులన్నిటిని తెలిసికొనకపోయినను బంగారమన నేమియో తెలిసికొన్నవానికి బంగరు వస్తు విశేషములన్నియు తెలియబడినట్లే యగును. అట్లే ఈ జగమంతయు బ్రహ్మము అని తెలియుటయే సర్వవిజ్ఞానము. అదియే బ్రహ్మ విజ్ఞానము. వస్తు విశేషములన్నియు మట్టియే లేక బంగారమే అని తెలియుటయే సర్వవస్తు విశేషములు తెలియబడినట్లే. బ్రహ్మమునొకటి తెలిసికొనినచో బ్రహ్మ రూపములైన సర్వజగద్విశేషవస్తువులన్నియు తెలియఁబడినట్లే. ఇదియే ఏక విజ్ఞానము. సర్వవిజ్ఞానము

అనునట్టి ప్రతిజ్ఞ. అర్థ ప్రపంచము వంటిదే శబ్ద ప్రపంచము కూడ. అర్థములలో మంచివి చెడ్డవి యున్నట్లే, మంచివి చెడ్డవి అయిన శబ్దములెన్నో యున్నవి. ఈ సదసచ్ఛబ్దాత్మక ప్రపంచమంతయు బ్రహ్మమని తెలిసినవానికి ఆయా మంచి చెడ్డ శబ్దములతో నేమిపని? అతనికి మౌనమే ఆశ్రయింపదగినది.

అవ॥ పై శ్లోకమున బ్రహ్మజ్ఞానము సర్వజ్ఞానహేతువు కావున బ్రహ్మ మొక్కటియే తెలియదగినదని చెప్పఁబడినది. ఈ శ్లోకములెన్ని తెలిసినను బ్రహ్మమును తెలియనిచో సంసారబంధమునే పొందియుండును అని చెప్పఁబడుచున్నది.

శ్లో॥ వాచం త్యక్త్వా సద్గురువక్త్రాచ్ఛ్రుతివాక్యా-
ద్వక్తారం యం ప్రత్యగభిన్నం పరిపూర్ణమ్ ।
లోకాతీతం నైవ విజానన్ భవభాక్ స్యాత్
తం చిన్మాత్రం సాక్షిణమేకం శివమీడే ॥ 20 ॥

ప్ర॥ సద్గురువక్త్రాత్ – సద్గురు ముఖమునుండి, శ్రుతి వాక్యాత్ – వేదవాక్కు వలన, వాచం – వాక్కును, త్యక్త్వా – విడిచి, లోకాతీతమ్ – లోకాతీతుడైన, పరిపూర్ణమ్ – పరిపూర్ణుడైన, యమ్ – ఏ శివుని, ప్రత్యగభిన్నమ్ – స్వాత్మాభిన్నునిగా, న ఏవ విజానన్ – తెలియకయే యుండిన వాడగుచు, భవభాక్ స్యాత్ – సంసారమును పొందినవాడగునో, విజానన్ – తెలియువాడగుచు, భవభాక్ – సంసారము పొందువాడు, న ఏవ స్యాత్ – కానేకాడో, తమ్ – ఆ, సాక్షిణమ్ – సాక్షియైన, చిన్మాత్రమ్ – చిన్మాత్రుడైన ఏకమ్ – ఒకడైన, శివమ్ – శివుని, ఈడే – స్తుతించెదను.

తా॥ సద్గురు ముఖమునుండి, **తత్త్వమసి**యను శ్రుతి వాక్యమును విని వాక్కు నంతటిని విడిచి లోకాతీతుడైన; పరిపూర్ణుడైన శివుని స్వాత్మాభిన్నునిగా నెఱిగినవాడు సంసారమును పొందనేపొందడు. అట్లెఱుగనివాడు సంసారము నుండి విడువఁబడనే విడువఁబడడు.

వి॥ **తత్త్వమసి** యను వాక్కు చివరిసారిగా గురుముఖమునుండి వినఁదగినది. అది యొక్కటే అన్ని మంచి వాక్కులకన్నను మంచి వాక్కు. అది విన్న పిదప నెంత మంచి వాక్కైనను చెడ్డవాక్కేయగును. ఇక చెడ్డవాక్కు చెడ్డవాక్కగుటలో వింతయేమి? తత్త్వమసి యను నుపదేశమున లోకాతీత పరిపూర్ణ శివుడనే నేనను జ్ఞానమును పొందిన పిదప నిక వినదగిన దేమియులేదు. ఆ జ్ఞానమును పొందనిచో సంసారము వీడనే వీడదు. ఆ జ్ఞానమును పొందినచో సంసారముండనే యుండదు.

అవ॥ పై శ్లోకమున శివోఽహమను జ్ఞానమొకటే పొందదగినదని చెప్పఁబడినది. ఈ శ్లోకమున ఆ జ్ఞానముచే భూమానందప్రాప్తి ఈ దేహమునందే కలుగునని చెప్పఁబడుచున్నది.

శ్లో॥ యో వై భూమా యస్సుఖరూపః పరమాత్మా
ద్యావా పృథ్వీ చాపి చ యోఽ ంతర్గుణహీనః ।
ప్రాణప్రాణో దేహ ఇహాహమ్పదలక్ష్యః
తం చిన్మాత్రం సాక్షిణమేకం శివమీడే ॥ 21 ॥

ప్ర॥ యః – ఎవడు, భూమా – అనల్పుడో, యః – ఎవడు, సుఖరూపః – సుఖరూపుడైన, పరమాత్మా – పరమాత్మయో, అపి చ – మరియు, ద్యావా – ఆకాశరూపుడో, పృథ్వీచ – భూ రూపుడును అగునో, యః – ఎవడు, అంతః – లోనివాడో, గుణహీనః – గుణములు లేనివాడో, ప్రాణ ప్రాణః – ప్రాణములకు ప్రాణము అయినవాడో, ఇహ – ఈ, దేహే – దేహమునందు, అహమ్ పదలక్ష్యః – అహమ్పదముచే లక్షణా వృత్తితో బోధ్యుడో, తమ్ – ఆ, చిన్మాత్రమ్ – చిన్మాత్రుడైన, సాక్షిణమ్ – సాక్షియైన, శివమ్ – శివుని, ఏకమ్ – ఒకని, ఈడే –స్తుతించెదను.

తా॥ ఎవడు భూమానందస్వరూపుడు, ఎవడు పరమాత్మయో, ఎవడు భూమ్యాకాశ రూపుడో, ఎవడు దేహేంద్రియాలకన్నింటికన్నను లోనివాడో, ప్రాణములకును ప్రాణభూతుడో, ఎవడు ఈ దేహమునందు అహమ్పదముచే లక్షణావృత్తితో తెలియఁదగినవాడో ఆ చిన్మాత్రైక సాక్షియగు శివుని స్తుతించెదను.

వి॥ ఐహ లౌకిక పారలౌకిక సుఖములు భూమానందరూపములు కావు. అవి అల్పానందములు. పారలౌకికసుఖములకన్న ఐహలౌకికసుఖములు మరింత స్వల్పములు. ఇహలోకభోగములగుటచే నీలోకమందలి సుఖములు ఐహ లౌకికములనియు, లౌకికములనియు చెప్పఁబడును. భోగములందు ఐహ లౌకిక పారలౌకిక భేదమున్నను అన్నియు స్రక్చందనాది విషయరూపములగుట మాత్రము సమానము. నశ్వరము, పరిమితము. స్రక్చందనాది విషయానుభవ రూపము కాక పోవుటచే ఆత్మానందము భూమానంద మనఁబడును. వాస్తవమునకు విషయానందము కూడా **ఆనందస్య మాత్రమేవోపజీవంతి** అను శ్రుతి ననుసరించి భూమానందాంశములే యగును. విషయము యొక్క మిథ్యాత్వము నెఱిగిన వానికది ఆత్మానందమని ఇది విషయానందమని విభజింపఁబడుట కవకాశము లేని యానందమొకటియే, స్వానుభవరూప మగును. స్వాత్మ పరమాత్మయు భూమానంద రూపములే యగుచో, ద్యావాపృథివ్యాది దృశ్య ప్రపంచము యొక్క స్వరూపమేమియను ప్రశ్నము కలుగును. ద్యావా పృథివ్యాదిదృశ్య ప్రపంచము **పాదోఽస్య విశ్వా భూతాని** అను శ్రుతి వాక్యముచే దృశ్య ప్రపంచమంతయు తదేక దేశమే యగును. అయితే ఈ ప్రపంచమంతయు రజస్తమ స్సత్త్వ గుణ ప్రకృతి రూపమాయ వలన గోచరింపఁబడుటచే సగుణమనియుఁచెప్పబడినది. ఈ సగుణ మంతయు అనంతనిర్గుణమం దేకదేశమే యగును. అదియుగాక ఈ సగుణ ప్రపంచమునకు స్వసత్త

లేదు. పరమాత్మ సత్తను గ్రహించియే సద్రూపమగుచున్నది. చక్షువునకు చక్షుస్త్వము కలిగించున దాత్మయే కావున, చక్షుస్సునకు చక్షుస్సు ఆత్మయే. అట్లే శ్రోత్రమునకు శ్రోత్రత్వము కలిగించు ఆత్మయే శ్రోత్రశ్రోత్రము. ఇట్లే అన్నియింద్రియములకు తత్తదింద్రియత్వము కలిగించు ఆత్మయే యింద్రియములకు నింద్రియమని చెప్పఁదగును. ఆ విధముగనే ప్రాణములకు ప్రాణత్వము ఆత్మ వలననే కలుగుచున్నది కావున ఆత్మ ప్రాణప్రాణమని చెప్పఁబడుచున్నది. అహమ్ అను పదమునకు వాచ్యార్థము జీవుడు. జీవేశ్వరైక్యము లక్ష్యార్థము. దేహేన్ద్రియప్రాణములందాత్మ బుద్ధి వ్యవహారము నందుండుటచే నవి కూడ నప్పుడప్పుడాత్మ పదవాచ్యములగుట యెఱిగిన విషయమే. తత్పదమునకు ఈశ్వరుడు వాచ్యార్థము. జీవేశ్వరైక్యము లక్ష్యార్థము. తత్పదమునకు వలె "అహమ్" పదమునకు గూడ **సోఽహమ్** అను వాక్యము నందు లక్ష్యార్థముగా జీవేశ్వరైక్యరూపమైన పరమాత్మ బోధింపఁబడుచున్నది. "సోఽహమ్" అను వాక్యము యొక్క అఖండార్థముగా అహమ్పదలక్ష్యార్థముగా జీవేశ్వరైక్యము బోధింపఁబడినప్పుడు ఈ దేహముండగానే జీవన్ముక్తి కలుగును.

అవ॥ పై శ్లోకము "సోఽహమ్" అను వాక్యమందలి అహమ్ పదలక్ష్యార్థము – పరమాత్మయని చెప్పఁబడినది. ఈ శ్లోకమున **సోఽహమ్** అను రెండు పదములలోని హల్లులను తీసివేయగానేర్పడు నోంకారము నుపాసించు సమయమున "పరమాత్మ" నెట్లు దర్శింపవలెనో చెప్పఁబడుచున్నది.

శ్లో॥ ప్రాగోంకారం షోడశధైవ ప్రవిభజ్య
స్వత్వేనాప్త్వా భాగచతుష్కే తుర్యాంశమ్ ।
సమ్యక్పశ్యన్తత్ర చ తుర్యం పదమేకం
తం చిన్మాత్రం సాక్షిణమేకం శివమీడే ॥ 22 ॥

ప్ర॥ ప్రాక్ – ముందుగా, ఓంకారమ్ – ఓంకారమును, షోడశధైవ – పదునాఱు విధములుగనే, ప్రవిభజ్య – విభజించి, స్వత్వేన – తనదిగా, భాగచతుష్కే – నాలుగు భాగములందు, తుర్యాంశమ్ – నాల్గవ భాగమును, తత్ర చ – ఆ భాగ చతుష్కమందును, ఆప్త్వా – పొంది, ఏకమ్ – ఒకటైన, తుర్యమ్ – నాల్గవదైన, పదమ్ – స్థానమును, సమ్యక్ – బాగుగా, పశ్యన్ – చూచుచు, తమ్ – ఆ, సాక్షిణమ్ – సాక్షియైన, చిన్మాత్రమ్ – చిన్మాత్రుడైన ఏకమ్ – ఒకడైన, శివమ్ – శివుని, ఈడే – స్తుతించెదను.

తా॥ ముందుగా ఓంకారమును పదునాఱు భాగములుగా విభజించి అందులో వ్యష్టి సమష్టి ఆత్మాంశములైన విశ్వ, వైశ్వానర, తైజస హిరణ్యగర్భ అవ్యాకృత తురీయ అను భాగ చతుష్కమునందు తురీయపదమునే (సాక్షిత్వమునే) చక్కగా చూచుచు ఆ చిదేకసాక్షియైన యొక శివునే స్తుతించెదను.

వి॥ ఓంకారమునీ క్రింది విధముగా పదునాఱు విధములుగ విభజించవలెను.

ప్రథమ పాదము	: 1. అ	2. విశ్వ 3.వైశ్వానర	4.సాక్షి
ద్వితీయపాదమ	: 5. ఉ	6.తైజస 7.హిరణ్యగర్భ	8.సాక్షి
తృతీయపాదము	: 9. మ్	10.ప్రాజ్ఞ 11.అవ్యాకృత	12.సాక్షి
చతుర్థపాదము	: 13.అర్ధమాత్ర	14. జీవ 15. ఈశ్వర	16.సాక్షి

పై పదునాఱు భాగములలో 1) విశ్వ, వైశ్వానర, 2) తైజస హిరణ్యగర్భ 3) ప్రాజ్ఞా వ్యాకృత 4) జీవేశ్వరులు ఆత్మాంశములే (సాక్ష్యంశములే) కావున ఆ నాల్గు పాదములందును ఒక్క సాక్షినే దర్శించుచో శివత్వము సిద్ధించును.

అవ॥ పై శ్లోకమున నోంకార ప్రతిపాద్యత శివునందు చెప్పఁబడినది. ఈ శ్లోకమున నాతనియం దుపనిషత్ప్రతిపాద్యత చెప్పఁబడుచున్నది.

శ్లో॥ యస్మిన్నోతప్రోతమితీత్థం జగదేత-
త్తాత్పర్యేణైవోపనిషద్భిః ప్రతిపాద్యే ।
సోఽహం నాన్యః కశ్చన మత్తో విదురేవం
తం చిన్మాత్రం సాక్షిణమేకం శివమీడే ॥ 23 ॥

ప్ర॥ ఉపనిషద్భిః – ఉపనిషత్తులచేత, తాత్పర్యేణైవ – తాత్పర్యము తోడనే, ప్రతిపాద్యే – ప్రతిపాదింపఁదగిన, యస్మిన్ – ఏ శివునందు, ఏతత్ – ఈ, జగత్ – జగత్తు, ఓతమ్ ఇతి – పడుగని, ప్రోతమ్ ఇతి – పేకయని, ఇత్థమ్ – ఈ విధముగా (చెప్పఁబడినదో) సః – ఆ శివుడు, అహమ్ – నేను, మత్తః – నా కంటె, అన్యః – ఇతరుడు, కః చ న – ఎవడును, న – లేడు అని, విదుః – (విజ్ఞులు) తెలుసుకొనుచున్నారో, తమ్ – ఆ, చిన్మాత్రమ్ – చిన్మాత్రుడైన, సాక్షిణమ్ – సాక్షియైన, ఏకమ్ – ఒకడైన, శివమ్ – శివుని, ఈడే – స్తుతించెదను.

తా॥ ఉపనిషత్తులు తాత్పర్యములో నే శివుని ప్రతిపాదించుచున్నవో ఈ జగమంతయు నే శివుని యందు ఓతప్రోతమైయున్నదో ఆ శివుడను నేను అనువిధమున విద్వాంసులు తెలుసుకొనుచున్నారు. ఈ చిన్మాత్రసాక్షియగు శివునొక్కనినే స్తుతించెదను.

వి॥ వేదములు నాలుగింటికి పదునొకండు వందలకు మించిన శాఖలుండెడివి. ఒక్కొక్క శాఖలో సంహిత, బ్రాహ్మణము, ఆరణ్యకము, ఉపనిషత్తు అను నాలుగు భాగములుండును. నేడు ఎన్నియో శాఖలు లుప్తములై పోయినవి. కొన్నింటి సంహితలు బ్రాహ్మణములు, ఆరణ్యకములు లుప్తములై యుపనిషత్తులు మిగిలినవి. నేటికి మిగిలిన ఉపనిషత్తుల సంఖ్య చాలా స్వల్పము. నూట యెనిమిది ఉపనిషత్తులు ముద్రితములై లభించుచున్నవి. వేదముల చివఱలైనందున వేదముల సిద్ధాంత మును ప్రతిపాదించునవి యగుటచే నుపనిషత్తులకు వేదాంతములనియు నామము కలదు. ఆ యుపనిషత్తులలోని

కొన్ని మంత్రముల యర్థము నిర్ణయించిన బ్రహ్మసూత్రములకు వేదాంతశాస్త్రమున ప్రధానస్థానమున్నది. ఆ బ్రహ్మసూత్రములకు ద్వైత విశిష్టాద్వైత శుద్ధాద్వైత ద్వైతాద్వైతాద్వైత పరములైన వ్యాఖ్యానములున్నవి. ఇతర దర్శన కర్తలు వేదాంత మత ఖండనమున అద్వైతమును ఖండించుటచే అద్వైతసిద్ధాంతములకు మూలములనదగిన మంత్రముల గలిగి యున్నందున వాని సిద్ధాంతమిదేయని నిర్ణయించుట క్లిష్టమైన కార్యము. అయినను పూర్వమీమాంసకులు వేదమునకు కర్మయందే తాత్పర్యమని నిర్ణయించి యున్నారు. వారు ప్రధానముగ సంహితను, ఆ పిదప బ్రాహ్మణారణ్యకములను అప్రధానముగ, ఉపనిషత్తులలోని మంత్రమును ప్రధానముగ, నాధారముగా జేసికొని తాత్పర్యమును నిర్ణయించి యున్నారు. వారు నిర్ణయించిన తాత్పర్యమునందు వైమత్యముండవచ్చును. కాని వారు చెప్పిన తాత్పర్య నిర్ణాయక లింగములకు ద్వైత విశిష్టాద్వైతాద్వైతాది సిద్ధాంతముల వారంగీకరించినారు. శబ్దముల కర్థము వేరుగా తాత్పర్యము వేరుగా ఉండును. ఆ మామిడి చెట్టునందా కొమ్మ చివఱికాయ పండినది. ఈ కొమ్మ చివఱి కాయ పండలేదు. అను వాక్యము నందొక కాయ పండినది.యింకొక కాయ పండలేదని, అను అర్థమును గ్రహించినను ఆ వాక్యమును వక్తయేల ప్రయోగించినాడో యని విచారించినచో పండినకాయను మాత్రమే తెంపి యిమ్మని, పండనికాయను తెంపవద్దను వక్త యొక్క తాత్పర్యమును గ్రహింపగలము. అట్లే వేదమందలి **తాత్పర్యము** గ్రహించుటకు వారీ క్రింది యాఱుఅంశములు చెప్పినారు. **ఉపక్రమము, ఉపసంహారము, అభ్యాసము, అపూర్వత, ఫలము, అర్థవాదము ఉపపత్తి** అనునవి తాత్పర్య నిర్ణాయక లింగములు. మొదటి ఉపక్రమోప సంహారముల రెండింటినొకటిగా భావించి లింగములాఱనుట సంప్రదాయముగా నున్నది. పూర్వమీమాంసకులు చెప్పిన ఈ లింగములును ఉత్తరమీమాంసకుల (వేదాంతుల) చే నంగీకరింపఁబడినవి. చెప్పదలచు కొన్న విషయము నారంభమందు జెప్పి మరల చివఱకా విషయమునే చెప్పిప్రసంగము ముగింపఁబడుచుండును. అందుచేతనే ఉపక్రమోపసంహారములు తాత్పర్య నిర్ణాయక లింగములైనవి. అట్లే చెప్పఁదలచుకొన్న విషయమునే ప్రసంగమధ్యమున మరల మరల చెప్పఁబడుచుండును. ఈ మరల మరల చెప్పుటయే అభ్యాసము అనఁబడును. ఈ యభ్యాసము మరొక తాత్పర్య నిర్ణాయకలింగము. ఇదివఱకు తెలిసిన విషయమునే మరల చెప్పుట వ్యర్థము కావున ఇదివరకు తెలియని విషయమే ముఖ్యముగ చెప్పదలచినదై యుండును. ఇదియే అపూర్వత యనఁబడును. ఈ అపూర్వతయు తాత్పర్య నిర్ణాయక లింగములలో ముఖ్యమనఁదగును. ఇంతకు చెప్పుటకొక ప్రయోజనముండవలెను గదా! ఆ ప్రయోజనమే ఫలమనబడును. ఈ ఫలము కూడ తాత్పర్య నిర్ణాయక లింగమే. అట్లే చెప్పదలచిన పనియొక్క, ఆ పని చేయువానియొక్క ప్రశంస చేయఁబడుచుండును. ఆ

ప్రశంసయే యర్థవాదమనఁబడును. ఇది మరియొక తాత్పర్య నిర్ణాయక లింగము. అట్లే చెప్పదలచిన విషయమున ఉపపత్తియుండవలెను. ఉపపత్తిలేక చెప్పిన దానిని బుద్ధిమంతులంగీకరింపరు. అందుచే ఉపపత్తి కూడ తాత్పర్య నిర్ణాయక లింగమే. అద్వైతులీయాఱు లింగముల చేతనే ఉపనిషత్తులకద్వైతమునందే తాత్పర్యమని చెప్పుదురు. కావున బ్రహ్మము (శివస్వరూపము) జీవేశ్వరైక్యరూపము. అదియే **సోహమ్. శివోఽహమ్, సర్వం ఖల్విదం బ్రహ్మ, తత్త్వమసి, అయమాత్మా బ్రహ్మ, అహం బ్రహ్మాస్మీత్యాది** వాక్యముల తాత్పర్యమై యున్నది. నేను శివుడను, నాకన్న భిన్నముగా నే పదార్థమును లేదు. అనునదే బ్రహ్మజ్ఞానుల యనుభవము. ఆ యనుభవ మీశ్లోకమునందలి మూడవ పాదమున చెప్పఁబడినది.

అవ॥ పై శ్లోకమున బ్రహ్మమందు జగమోతముగా నున్నదని చెప్పుటలో జగత్తు సత్యమను నుద్దేశము లేదని యీ శ్లోకమున స్పష్టము చేయఁబడుచున్నది.

శ్లో॥ అవ్యక్తాదప్యస్తి పరో యః పురుషోఽంతే
యస్మిన్నేతత్కల్పితమన్యైః శ్రుతిహీనైః ।
జ్యోతీరూపం భేదవిహీనం పరమార్థం
తం చిన్మాత్రం సాక్షిణమేకం శివమీడే ॥ 24 ॥

ప్ర॥ యః – ఎవడు, అవ్యక్తాద్ అపి – అవ్యక్తమున కంటెను, పరః – పరుడైన, పురుషః – పురుషుడుగా, అంతే – చివఱ, అస్తి – ఉన్నాడో, యస్మిన్ – ఎవనియందు, ఏతత్ – ఇది (జగత్తు), శ్రుతిహీనైః – తత్త్వమసి యను (గురూప దేశము యొక్క) శ్రవణము లేని వారిచేత లేక ప్రపంచము సత్యమను అర్ధవైదికుల చేత అవైదికులచేత, కల్పితమ్ – కల్పింపఁబడి సత్యమని భావింపబడుచున్నదో, భేదవిహీనమ్ – భేదములేని, పరమార్థమ్ – పరమసత్యమైన, జ్యోతీరూపుడైన, తమ్ – ఆ, చిన్మాత్రమ్ – చిన్మాత్రుడైన, సాక్షిణమ్ – సాక్షియైన, ఏకమ్ – ఒకడైన, శివమ్ – శివుని, ఈడే – స్తుతించెదను.

తా॥ ఎవడు (ప్రకృతి – మాయ) కంటెను పరుడై సర్వదేహములందున్నాడో, ఎవని యందీ జగత్తు వైదికులచే కల్పింపఁబడినదో పరమార్థజ్యోతీరూపుడైన యా చిన్మాత్రైక సాక్షియగు శివునొకనినే స్తుతించెదను.

వి॥ **ఇంద్రియేభ్యః పరాహ్యర్థా అర్థేభ్యశ్చ పరమ్మనః మనసశ్చ పరాబుద్ధిర్బుద్ధే రాత్మా మహాన్పరః, మహతః పరమవ్యక్త మవ్యక్తాత్పురుషః పరః పురుషాన్నపరం కించిత్ సా కాష్ఠా సా పరాగతిః** అను ఉపనిషద్మంత్రముచేత, **ఇంద్రియేభ్యః పరమ్మనః మనసస్తు పరా బుద్ధిర్యో బుద్ధేః పరతస్తు సః** అను భగవద్గీతా శ్లోకము చేతను ఒకదానికన్న గొప్పనైనది మరియొకటి యని చెప్పి చివఱకు పురుషుని (శివుని) కన్న గొప్పదేమియు లేదని చెప్పఁబడినది. ఈ శ్లోకమునందలి ప్రథమపాదముచేత పై శ్రుతి స్మృతులలోని యర్థమే

సంగ్రహింపఁబడినది. అన్యులనగా అనద్వైతులు అట్టి అద్వైతులు కాని వారిచేత ఈ జగము సత్యమని చెప్పఁబడుచున్నది. వారికి సత్యమనిపించు నీజగము సత్యము కాదు. కల్పితమే. కల్పన మొక సత్యాధిష్ఠానమున చేయఁబడును. అధిష్ఠానమున సత్తలేనిచో కల్పన కవకాశమేలేదు. ఇంతకును ఈ అన్యులెవరు? వేద ప్రామాణ్యము నంగీకరించువారో, అంగీకరించనివారో, కొందరు వేదప్రామాణ్యము నంగీకరించెదమనెదరు. కాని తద్విరుద్ధముగా జగత్తు సత్యమని చెప్పుదురు. **నేహ నానాస్తి కించన. ఏకమేవాద్వితీయమ్ బ్రహ్మ** ఇత్యాది బహుశ్రుతులచే జగత్సత్యత్వము నిరాకరింపఁబడిన విషయము వారికి పట్టనేపట్టదు. వేద ప్రామాణ్యము నంగీకరించి వేద విరుద్ధముగా సిద్ధాంతములను ప్రతిపాదించు వారి నేమనవలెను? అర్ధవైదికులన వలెనేమో? లేక వైదికాభాసు లనవలెనేమో? నైయాయికులు వైశేషికులు నట్టి వారు. వీరు వేదనిందజేయరు. కావున చార్వాకులవలె నాస్తికులనఁబడరు. బౌద్ధులు వేద ప్రామాణ్యము నంగీకరించరు. కాని వారిలో కొందఱు వైదికమైన జగన్మిథ్యాత్వము నంగీకరించెదరు. అయినను వారు బ్రహ్మము నంగీకరించక పోవుటచే ఈ శ్లోకమున చెప్పఁబడిన శ్రుతి హీనులలోనే చేరుదురు. సాంఖ్యులు యోగులు పెక్కు వైదిక సిద్ధాంతముల నంగీకరించినను వారాత్మ బహుత్వ వాదులు కనుక అనద్వైతులే యగుదురు. చివరిమాట అద్వైత సిద్ధాంతము నంగీకరించినను తత్త్వమసియను శ్రుతిని గురువు వలన విననంతవరకు వైదిక సిద్ధాంతములలో దేనినంగీకరించినను బ్రహ్మాత్మైక్యజ్ఞానం పొందనంతవఱకు శ్రుతిహీనులే. ఆత్మ తమస్సంబంధ రహితము కావున జ్యోతీరూపమని చెప్పఁబడినది. అర్థములని చెప్పబడునవన్ని అర్థములు కావు. వానిలో వ్యావహారిక సత్తా యున్నను పారమార్థిక సత్తలేదు. జ్ఞానుల దృష్టిలో వ్యావహారికసత్తా ప్రాతిభాసికసత్త వంటిదే. కాని అంతకన్న అధికము కాదు. కావుననే వ్యావహారిక సత్త గల ఆకాశాది భూతములు పరమార్థములు కావు. పరమార్థమొక బ్రహ్మ (శివుడు)యే. ఆ బ్రహ్మము భేదహీనము బ్రహ్మ ద్వయ ప్రసక్తి యిచట లేదు గదా భేదహీనమని చెప్పుట యెందులకు? బ్రహ్మమునందు సజాతీయభేదము లేదని బ్రహ్మము నంగీకరించు వారందఱు దాదాపుగా నంగీకరించెదరు. ఆ బ్రహ్మమునందు విజాతీయ స్వగత భేదములు కూడ లేదనుటకే ఈ శ్లోకమున బ్రహ్మము (శివస్వరూపము) భేదహీనమని చెప్పఁబడినది.

అవ॥ పై శ్లోకమున భేదహీన శివస్వరూపము గురుముఖైక లభ్యమని చెప్పఁబడినది. ఈ శ్లోకమున ఆ గురూపదేశ స్వరూపము శిష్యుని అనుభవముయొక్క స్వరూపము వివరింపఁబడుచున్నది.

శ్లో॥ తత్త్వం త్వంతత్ సోఽహమహంసోఽస్యఖిలాత్మే-
త్యైక్యం విద్వానత్ర విదిత్వా విమలాత్మా ।

స్వాత్మారామోఽ ఖండరసాత్మా శ్రుతిసిద్ధః
తం చిన్మాత్రం సాక్షిణమేకం శివమీడే ॥ 25 ॥

ప్ర॥ తత్ – ఆ బ్రహ్మ (శివుడ)వు, త్వమ్ – నీవు, త్వమ్ – నీవు, తత్ –ఆ బ్రహ్మవు, సః – ఆ శివుడను, అహమ్ – నేను, సః – ఆ శివుడను, అఖిలాత్మా – సర్వ స్వరూపుడను, ఇతి – అని, ఐక్యమ్ – అభేదమును, అత్ర – ఈ జన్మమందే, విదిత్వా – తెలిసికొని, విద్వాన్ – విద్వాంసుడు, విమలాత్మా – పరిశుద్ధ స్వరూపుడై, శ్రుతి సిద్ధమ్ – వేదముచే (ఉపదేశముచే) సిద్ధుఁడవై, స్వాత్మారామః – స్వాత్మయందే రమణము గలవాడను, అఖండ రసాత్మా – అఖండానందరూపుడను, అస్మి – అగుచున్నాను, తమ్ – అట్టి, చిన్మాత్రమ్ – చిన్మాత్రుడైన, సాక్షిణమ్ – సాక్షియైన, ఏకమ్ – ఒకడైన, శివమ్ – శివుని, ఈడే – స్తుతించెదను.

తా॥ శివుడు ఆత్మ స్వరూపుడు నేను శివస్వరూపుడను అను అనుభవమును శివుడు త్వత్స్వరూపుడు నీవు శివ స్వరూపుడను అను ఉపదేశమున శిష్యుడు పొందును. ఆ అనుభవము అఖండానంద స్వరూపము, శుద్ధాత్మ రూపము, స్వాత్మారామస్వరూపము, అట్టి చిన్మాత్ర సాక్షిమాత్రుడైన శివుని స్తుతించెదను.

వి॥ తత్ త్వమ్ అను వాక్యమున తత్ అనునది ఉద్దేశ్యవాచకము. త్వమ్ అనునది విధేయ వాచకము. త్వమ్ తత్ అను వాక్యమున త్వమ్ అనునది ఉద్దేశ్యవాచకము, తత్ అనునది విధేయ వాచకము. అట్లే 'సోఽహమ్' అను వాక్యమున సః అనునది ఉద్దేశ్యవాచకము. "అహమ్" అనునది విధేయ వాచకము. "అహమ్ సః" అను వాక్యమున అహమ్ అనునది ఉద్దేశ్య వాచకము. సః అనునది విధేయ వాచకము. వాచ్యార్థదృష్టితో నీ యుద్దేశ్య విధేయ భావము చెప్పఁబడినది. వాస్తవమునకీ వాక్యములలోని పదములకు ఉద్దేశ్యవిధేయ భావమనుపపన్నమే. అనుపపన్న వాచ్యార్థము నందే ఆ భావము లక్ష్యమైన వాక్యార్థమున అఖండార్థస్ఫూర్తియే కావున ఉద్దేశ్య విధేయ స్ఫూర్తి యుండదు. ఈ అఖండైక్యబోధము నందిన విద్వాంసుడు అఖండానందస్వరూపుడు. ఆత్మారాముడు నగును. ఇది శ్రుతి సిద్ధార్థము. ఈ యర్థమే శివుడు. అతడే ఈ దేహమున చిన్మాత్రసాక్షియై యున్నాడు – అని తెలిసిన విద్వాంసుడు, ఈ దేహముండగానే ముక్తుఁడగును. శ్లోకములోని అత్ర అను మాటకిదే యర్థము. దేహముండగానే లభించు ముక్తిని జీవన్ముక్తి యందురని ఈ వఱకే చెప్పఁబడినది. దేహానంతర లభ్య సాలోక్యాది ముక్తుల కంటె ఈ దేహముండగనే ముక్తి లభించుట విశేషముకదా? తత్త్వమ్ అనగా శివ పదము తదహమ్పదముల అఖండార్థమును గ్రహించుటచేత మాత్రమే సాధ్యము. సాలోక్యాది ముక్తులలోని ఆనందము సాతిశయము. ఈ విదేహముక్తి నిరతిశయానందస్వరూపము.

అవ॥ పై శ్లోకమున జీవేశ్వరైక్యము యొక్క ఉపదేశము నిరతిశయానందహేతువని ఆ యనుభవము నిరతిశయానందరూపమని చెప్పఁబడినది. కాని దృశ్యమానములైన ద్యుభ్వాదు (భూమ్యాకాశాదుల) లట్లే యుండునుగదా, సర్వద్వైక్యము అనగా సజాతీయ విజాతీయ స్వగత భేదశూన్యత యేర్పడదుగదా అను ప్రశ్నమునకీ శ్లోకమున సమాధానము చెప్పఁబడుచున్నది.

శ్లో॥ ద్యుభ్వాదీనామాయతనం యస్సకలానా-
మాత్మైతేషాం ప్రాణభృతామప్యఖిలాత్మా ।
జీవేభ్యోఽ న్యోప్యత్ర యదన్యే న చ జీవాః
తం చిన్మాత్రం సాక్షిణమేకం శివమీడే ॥ 26 ॥

ప్ర॥ యః – ఏ శివుడు, ఏతేషామ్ – ఈ దృశ్యమానములైన, ద్యుభ్వాదీనామ్ – భూమ్యాకాశాదులకు, ఆయతనమ్ – నివాసమై, ప్రాణభృతామ్ అపి – జీవులకు గూడ, ఆత్మా – ఆత్మ, జీవేభ్యః అపి – జీవులకంటెను, అన్యః – భిన్నుడు (ఈశ్వరుడు), అత్ర – ఈ యాత్మయందే స్వరూపము నొందుచున్నదో, యదన్యే – ఏ శివునికి భిన్నులుగా, జీవాః – జీవులు, న – కారో, తమ్ – ఆ, చిన్మాత్రమ్ – బోధన మాత్రుడైన, సాక్షిణమ్ – సాక్షియైన, ఏకమ్ – ఒకడైన, శివమ్ – శివుని, ఈడే – స్తుతించెదను.

తా॥ ఏ శివుడు భూమ్యాకాశాదులకు నివాసమైన వాడు, ప్రాణులందరికిని స్వరూపమైనవాడో, జీవాభిన్నుడుగా భావింపబడు నీశ్వరుడు కూడ ఈ యాత్మయందే స్వస్వరూపము నొందువాడై యున్నాడో ఏ శివునికి భిన్నులుగా నే జీవులును లేరో అట్టి బోధైక స్వరూపుడు సాక్షి మాత్రుడైన శివుని స్తుతించెదను.

వి॥ బ్రహ్మసూత్రములలో ప్రథమాధ్యాయ మందలి తృతీయ పాదము యొక్క ఆరంభమున ద్యుభ్వాద్యధికరణమున్నది. ఆ యధికరణము **ద్యుభ్వాద్యాయతనం స్వలింగాత్** అను సూత్రమున ఆరంభింపఁబడినది. ముండకోపనిషత్తు నందలి **యస్మిన్ ద్యౌః పృథివీ చాన్తరిక్షమోతమ్ మనసా సహ ప్రాణైశ్చ సర్వైః తమేవైకం జానథ ఆత్మానమ్** (దేని యందు ఆకాశము భూమి అన్తరిక్షము అన్ని ప్రాణముల (ఇంద్రియముల) తో కూడినదారములందు వస్త్రమల్లఁబడినట్లుల్లఁబడియున్నదో ఆ యొక్క యాత్మనే ఎఱుగుదురు). ఇత్యాది మంత్రమునందలి ద్యుభ్వాదుల ఆయతనమేదియను ప్రశ్నమున కాయధికరణమున పరమాత్మయే వానికాయతనమని సమాధానము చెప్పఁబడినది. ఆ సూత్రమునందలి ద్యుభ్వాద్యాయతనమ్ అను సమాస పదమున్నది. ఆ సమాసముయొక్క విగ్రహమైన ద్యుభ్వాదీనా మాయతనమ్ అను పదములతోడనే ఈ శ్లోకమారంభింపఁబడినది. సూత్రములోని స్వశబ్దమునకు పర్యాయమైన ఆత్మ శబ్దము పైమంత్రమున నున్నది. ఆ యాత్మ శబ్దమే ఈ శ్లోకమున ప్రయోగింపఁబడినది. **ద్యౌః పృథివీ** అని మంత్రములో

పృథివీ శబ్దము ప్రయోగింపఁబడగా బ్రహ్మసూత్రమునందు వలె పృథివీ శబ్ద పర్యాయమైన భూశబ్దమీ శ్లోకమున ప్రయోగింపఁబడినది. ద్యుభ్వాదులకు (భూమ్యాకాశాదులకు) ఆత్మ (శివుడు) ఆయతనమైనట్లు ప్రాణధారులకు ఆత్మ ఆధారమగుచున్నాడు. ప్రాణులకందఱకాత్మ యగుటచే శివుడఖిలాత్మడగుచున్నాడు. ఈ ఆత్మ (శివుని) యందే ఈశ్వరుడు కూడ తన స్వరూపము కలిగి యున్నాడు. ఈశ్వరుడనగా ప్రభువు. ప్రభుత్వము, సేవకులు లేనిదే యుండదు. నియామ్యులు లేనిదే నియామకత్వ రూపమైన ఈశ్వరత్వమును ఉండదు. లోకమునందు నియామ్యులకు నియామకునకును భేదము ప్రసిద్ధముగా నున్నది. కావున ఈశ్వరుని సూచించుటకు **జీవేభ్యః అన్యః** అని చెప్పఁబడినది. వ్యావహారికమైన ఈ ప్రసిద్ధి పారమార్థిక జీవేశ్వరైక్యమునకు ప్రతిబంధకము కాజాలదు. అందుచే జీవులు శివాన్యులు కారని శ్లోకమున చెప్పఁబడినది.

అవ॥ పై శ్లోకమున ద్యుభ్వాద్యాయతనాధికరణము ప్రస్తావింపఁబడినది. ఈ శ్లోకమున ఆనందమయాధికరణము ప్రస్తావింపఁబడుచున్నది.

శ్లో॥ ఆనందోహి స్యాత్ప్రచురోఽయం మయడంతః
పుచ్ఛమ్ బ్రహ్మేత్యాహు రసత్తచ్ఛ్రుతిహానేః ।
నాయం జీవః పంచమ కోశోఽతీతత్వాత్
తం చిన్మాత్రం సాక్షిణమేకం శివమీడే ॥ 27 ॥

ప్ర॥ మయడంతః – మయట్ప్రత్యయ మంత మందుగల ఆనందమయ శబ్దము యొక్క అర్థము, ప్రచురః – అధికమైన, ఆనందః – ఆనందము, స్యాత్ – అగును, హి – కదా, పుచ్ఛమ్ – (ఆనందమయుని యొక్క) తోక, బ్రహ్మ – బ్రహ్మము, ఇతి – అని, ఆహుః (కొందఱు) – చెప్పెదరు, శ్రుతిహానేః – (ఆనందమయునకంతరుడైన మరియొకరిని చెప్పు) శ్రుతిలేక పోవుట వలన, తత్ – అట్లు చెప్పుట, అసత్ – సరియైనదికాదు, అతీతత్వాత్ – అతీతుడగుట వలన, అయమ్ – ఈ ఆనందమయుడు, పంచమకోశః – అయిదవ కోశము రూపుగాగల, జీవః – జీవుడు, న – కాడు, తమ్ – ఆ, సాక్షిణమ్ – సాక్షియైన, చిన్మాత్రమ్ – చిన్మాత్రుడైన, ఏకమ్ – ఒకడైన, శివమ్ – శివుని, ఈడే – స్తుతించెదను.

వి॥ బ్రహ్మసూత్రములందు **ఆనందమయః అభ్యాసాత్** అను సూత్రమునుండి ఆనందమయాధికరణ మారంభమగును. **అస్మిన్నస్య చ తద్యోగం శాస్తి** అను సూత్రము వఱకు తైత్తిరీయోపనిషత్తు నందలి **తస్మాద్వా ఏతస్మాద్విజ్ఞానమయా దన్యోఽన్తర ఆత్మానందమయః** అను (బ్రాహ్మణ) వాక్యమునందలి ఆనందమయ శబ్దము యొక్క యర్థము బ్రహ్మమని నిర్ణయింపఁబడినది. ఆత్మయగు శివుడు పంచకోశా తీతుడు, అన్నమయ ప్రాణమయ మనోమయ విజ్ఞానమయానందమయము లనునవి

పంచకోశములు. స్థూలశరీరమే అన్నమయ కోశము, ప్రాణమనోవిజ్ఞానమయకోశములు మూడు కలిసి సూక్ష్మశరీరముగా తెలిసికొనదగినది. కారణశరీరము ఆనందమయ కోశమని చెప్పబడును. ఈ ఆనందమయకోశము నుండియే మిగిలిన నాలుగు కోశము లేర్పడినవి. ఇవి ఒకదానికన్న నొకటి సూక్ష్మములై యున్నవి. అన్నమయ కోశము (స్థూల శరీరము) ప్రత్యక్షముగానే యుండును. ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ కోశములు ప్రత్యక్షములు కాకున్నను ప్రాణేంద్రియాది క్రియలు ఉచ్ఛ్వాస నిశ్వాసములు, మాట్లాడుట, వినుచుండుట మొదలగు క్రియలు హేతువులుగా అనుమేయములగుచున్నవి కావున నివి సూక్ష్మములు. ప్రాణేంద్రియక్రియాదుల విశ్రాంతి చేత ఈ క్రియల పునః ప్రసృతిచేతను ఆనందమయకోశము యొక్క యునికి తెలియబడును గావున మరింత సూక్ష్మమని తెలియవలెను. ఉచ్ఛ్వాస నిశ్వాసలు, తినుట, మాట్లాడుట మొదలగునవి ప్రాణమయ కోశము యొక్క కృత్యములు. ప్రాణాపానవ్యానోదానసమానములు, నాగకూర్మకృకరదేవదత్త ధనుంజయములు అనునవి మొత్తము పది వాయువులు ప్రాణమయ కోశమని చెప్పఁబడును. ఇంద్రియములు మనస్సు కలిసి మనోమయకోశమని, ఇంద్రియములు బుద్ధి కలిసి విజ్ఞానమయకోశమని చెప్పఁబడును. అన్నమయకోశములోపల ప్రాణమయకోశము, ప్రాణమయకోశము లో ఆనందమయకోశము నుండుటచే అన్నమయపురుషుని లోపలి ప్రాణమయపురుషుడు అన్నమయపురుషుని కాంతరుడు, వాని కాంతరుడు మనోమయ పురుషుడు ఆనందమయపురుషుడు. ఆనందమయపురుషునికన్న మరొక అంతరుడు చెప్పఁబడక పోవుటచే ఆనందమయుడు బ్రహ్మస్వరూపుడని ఆనందమయాధికారణమున నిశ్చయింపఁబడినది. అని అన్నమయ శబ్దములోని మయట్ప్రత్యయము అన్నవికారమను అర్థమునొసగినట్లు ఆనందమయ శబ్దములోని మయట్ప్రత్యయము ఆనందవికారము అను నర్థమునీయదు. ఆనందమయ శబ్దములోని మయట్ప్రత్యయమునకు ప్రాచుర్యమే యర్థము అని ఈ శ్లోకములోని మొదటిపాదమున చెప్పఁబడినది. తైత్తిరీయోపనిషత్తు నందు అన్నమయ ప్రాణమయ మనోమయ విజ్ఞానమయానంద మయులు పురుషవిధులని చెప్పబడినను వీరందరికినీ శిరస్సు పూర్వ పక్షోత్తర పక్షములు. పుచ్ఛమును చెప్పఁబడుటచే వీరందరూ పక్షి సమానాకారులుగా చెప్పుట మరొక ఉపనిషత్తులోని సంసారవృక్షమున నివసించు రెండు పక్షులుగా జీవేశ్వరులు రూపింపబడుట కనుగుణముగా నున్నది. ప్రాణమయునికి పృథ్వి పుచ్ఛము, మనోమయునికి అథర్వాంగి రసములు పుచ్ఛము. విజ్ఞానమయునకు మహస్సు పుచ్ఛము. అని చెప్పబడినట్లే ఆనందమయునకు బ్రహ్మ పుచ్ఛమని చెప్పబడినది. అన్నమయుడు ప్రత్యక్షుడు కావున **ఇదమ్ పుచ్ఛమ్ ప్రతిష్ఠా** అని చూపబడుచున్నట్లు చెప్పబడినది. అన్నమయాదులందఱుకు వలె ఆనందమయమునకు శిరః పక్ష పుచ్ఛ భేదము చెప్పఁబడుటచే ఆనందమయుడు బ్రహ్మయని తాము

(బోధాయనవృత్తి ననుసరించి) నిరూపించిన పక్షమునే చివఱకు శంకరులు త్రోసిపుచ్చి ఆనందమయునకు బ్రహ్మ పుచ్ఛమని ఆనందమయుడు బ్రహ్మ కాదని నిరూపించినారు. ఈ రెండవ పక్షము శంకరుల యభిమతమని మొదటి పక్షమును బ్రహ్మసూత్రములకు శంకరులకు ముందుగా వృత్తిని రచించిన బోధాయనుల మతము ననుసరించి చెప్పినారని విజ్ఞులు చెప్పెదరు. పుచ్ఛము బ్రహ్మము అనుటలో ఆనందమయావయవపుచ్ఛము బ్రహ్మ మనుట ఈ శ్లోకము ద్వితీయ శ్లోకము పాదమున ఖండింపఁబడినది. అట్లంగీకరించు శ్రుతి విరుద్ధమని **శ్రుతిహానేః** అను పదము సూచించుచున్నది. ఈ శ్లోకము యొక్క ద్వితీయపాదమున శంకరులు నిరూపించిన మొదటి పక్షమే సమంజసమని రెండవ పక్షము అసత్తని చెప్పినట్లని పించునట్లున్నది. ఈ శ్లోకము యొక్క మూడవ పాదమున కంఠోక్తిగా పంచమ కోశ జీవుడు కాదని ఖండించుటచే ఆనందమయుని యందు బ్రహ్మత్వమీ శ్లోక కారుని కిష్టముకాదని సూక్ష్మముగా పరిశీలించిన తెలియఁగలదు. మూడవ పాదమున నాయంజీవః అని చెప్పఁబడినది. పంచకోశాంతరస్థుడు జీవుడు, పంచకోశాతీతుడు శివుడు కావున **నాయం జీవః పంచమకోశోఽతీతత్వాత్** అను పాఠమునంగీకరించుట యుచితమనిపించుచున్నది.

అవ॥ పై శ్లోకమున ఆనందయమాధికరణము ప్రస్తావింపబడినది. ఈ శ్లోకమున వైశ్వానరాధికరణము ప్రస్తావింపబడుచున్నది.

శ్లో॥ కౌక్షేయాగ్నిర్నైవ చ వైశ్వానరశబ్దో
భూతాగ్నిర్వా నాఽపి తదీయో న చ దేవః ।
శారీరో వా నాఽపి తు విమలః కూటస్థః
తం చిన్మాత్రం సాక్షిణమేకం శివమీడే ॥ 28 ॥

ప్ర॥ వైశ్వానరశబ్దః – వైశ్వానరపదము వాచకముగాగలది. కౌక్షేయాగ్నిః – జఠరాగ్ని, న ఏవ – కానేకాదు, భూతాగ్నిః వా – (తృతీయ) భూతమైన అగ్నికాని, నచ – కాదు, అపిచ – మరియు, తదీయః – అగ్నికి సంబంధించిన, దేవః – అధిదేవతయైన అగ్నియు, నచ – కాదు, శారీరఃవా – జీవుడుకాని, న – కాదు, అపి తు – మరే మనగా, విమలః – పరిశుద్ధమైన, కూటస్థః – అనంత చైతన్య స్వరూపుడు, తమ్ – ఆ, చిన్మాత్రమ్ – చిన్మాత్రుడైన, సాక్షిణమ్ – సాక్షియైన, శివమ్ – శివుని, ఈడే – స్తుతించెదను.

తా॥ వైశ్వానర శబ్దము జఠరాగ్నిని కాని అగ్న్యధిష్ఠాన దేవతను గాని బోధించదు. జీవుని గూడ బోధించదు, కేవలము పరమాత్మనే బోధించును. ఆ పరమాత్మయైన చిన్మాత్ర సాక్షియైన శివునొకనినే స్తుతించెదను.

వి॥ బ్రహ్మసూత్ర ప్రథమాధ్యాయ ద్వితీయపాదమున వైశ్వానరాధికరణమున్నది. అందు వైశ్వానర శబ్దార్థము నిర్ణయింపఁబడినది. ఆ విషయమే ఈ శ్లోకమున సంగ్రహింపఁ

బడినది. **అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః । ప్రాణాపానసమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్ ॥** (నేను జఠరాగ్ని రూపుడనే ప్రాణులందుండి ప్రాణాపానములతో కూడిన వాడైన చతుర్విధాన్నపచన మొనర్తును) అని శ్రీ మద్భగవద్గీత. వైశ్వానర శబ్దమున కగ్నియను నర్థము నిఘంటువులలో నున్నది. అంత మాత్రమున ఆ పదమున కన్ని సందర్భములందీ యర్థమే చెప్పుట పొసగదు. అగ్ని కూడా జఠరాగ్ని భూతాగ్ని వైద్యుతాగ్ని ఇత్యాది బహురూపములుగానున్నది. కావున వైశ్వానర శబ్దార్థము నిర్ణయింపఁ బడవలసియున్నది. కౌక్షేయాగ్ని అనగా జఠరాగ్ని వైశ్వానర శబ్దార్థమని చెప్పకూడదు. ఛాందోగ్యోపనిషత్తునం దశ్వపతి మహరాజు కడకు శ్రోత్రియ బ్రాహ్మణులు వచ్చి వైశ్వానర విద్య బోధింపుమని యడిగిరి. ఆ మహారాజు పృథ్వ్యాదులవయవములుగా గల వైశ్వానరుని గూర్చి యుపదేశించిరి. పృథివ్యాదులవయవములుగా నుండుట పరమేశ్వరునికే సంభవము. కావున వైశ్వానర శబ్దము పరమేశ్వరునే బోధించును. జఠరాగ్నికి పృథివ్యాదులవయవములు కాజాలవు. కావున జఠరాగ్ని వైశ్వానరశబ్దార్థము కాదు. అట్లే భూతాగ్నియు వైశ్వానర శబ్ద ప్రతి పాద్యము కాదు. అట్లే దేవతయైన అగ్ని దేవుడును కాడు. అతనికిని పృథ్వ్యాదులవయవములుకావు. పృథ్వ్యాదులవయవములుగా బ్రహ్మాండ దేహమునకు పొసగును. కాని పిండాండదేహమునకు పొసగదు. కావున పిండాండమందభిమానముగల జీవుడును వైశ్వానరశబ్దవాచ్యుడు కాదు. వైశ్వానరశబ్దము పృథ్వ్యాదులవయవములుగా గల విరాట్పురుషుడగు పరమేశ్వరునకే వాచకము. లక్ష్యార్థముగా చిన్మాత్రుడైన విమలుడైన కూటస్థుడైన శివునే బోధించును.

అవ॥ చతుర్విధాన్నపాచకుడగు వైశ్వానరునకు సర్వభక్షకుడన్న నామాంతరమున్నది. పరోక్షముగానది యగ్నియందు భోక్తృభావమును సూచించును. పైశ్లోకమున నట్టి వైశ్వానరస్వరూపము విచారింపఁబడినది. ఈ శ్లోకమున జీవేశ్వరులతో భోక్తృత యెవరిదో విచారింపఁబడుచున్నది.

శ్లో॥ జీవాజీవావత్ర శరీరే వసతో ద్వా-
వేకో భుంక్తే కర్మఫలం యస్త్వితరోఽస్మాత్ ।
ఈశోఽనశ్నన్ పాయయతీతరవాక్యే
తం చిన్మాత్రం సాక్షిణమేకం శివమీడే ॥ 29 ॥

ప్ర॥ అత్ర – ఈ, శరీరే – శరీరమునందు, జీవాజీవౌ – జీవేశ్వరులు, వసతః – నివసించుచున్నారు. ఏకః – ఒకడు (జీవుడు), కర్మఫలమ్ – కర్మఫలమును, భుంక్తే – అనుభవించును, అస్మాత్ – ఈ జీవునికన్న, ఇతరః – వేరైన, ఈశః – ఈశ్వరుడు, అనశ్నన్ – అనుభవింపక, ఇతరవాక్యే – అన్యుడు కర్తగానున్న వాక్యమునందు, చెప్పఁ బడినవిధముగా, పాయయతి – త్రావించును, తమ్ – ఆ, చిన్మాత్రమ్ – చిన్మాత్రుడైన, సాక్షిణమ్ – సాక్షియైన, ఏకమ్ – ఒకడైన, శివమ్ – శివుని, ఈడే – స్తుతించెదను.

తా॥ ఈ శరీరమున జీవుడు ఈశ్వరుడు నివసించుచున్నారు. వానిలో నొకడు, కర్మఫలము ననుభవించుచున్నాడు. ఈశ్వరుడు దాని ననుభవింపడు కాని జీవునిచే దాని ననుభవింపఁజేయుచున్నాడు. ఆ చిన్మాత్రసాక్షియగు ఒక్కడేయగు శివుని స్తుతించెదను.

వి॥ ముండకోపనిషత్తునందు **ద్వాసుపర్ణాసయుజా సఖాయౌ సమానం వృక్షమ్ పరిషస్వజాతే తయోరన్యః పిప్పలం స్వాద్వత్తి అనశ్నన్నన్యో అభిచాకశీతి** – (మంచి రెక్కలు గలిగిన సహయోగము కలిగిన స్నేహము కలిగిన రెండు పక్షులొక వృక్షమును ఆశ్రయించి యున్నను, వానిలో నొకటి రుచియైన పిప్పల ఫలమును తినుచుండగా తినకుండ మరొకటి ప్రకాశించుచున్నది) అను మంత్రము యొక్క యర్థమీ శ్లోకమున స్పష్టపరుపఁబడినది. వృక్షమనగా శరీరమని పక్షులనగా జీవేశ్వరులని కర్మ ఫలమును జీవుడనుభించునని ఈశ్వరుడు తాననుభవింపక జీవునితో నా కర్మ ఫలరసమును త్రావించుచున్నాడని శ్లోకమున వివరింపఁబడినది. జీవుడు భోక్తయని ఈశ్వరుడు భోజకుడని ఈ శ్లోకము చెప్పుచున్నది. భోక్త యగుటకు ముందు కర్త కావలెను. కర్తకానిదే భోక్త కాజాలడు. మంచికర్మమును చేయువానికి మంచి ఫలము (సుఖము) చెడుకర్మ చేయువానికి చెడుఫలము (దుఃఖము) భుజింపక (అనుభవింపక) తప్పదు. మంత్రమునందలి స్వాదు శబ్దము చేదును కూడ ఉపలక్షకతతో సూచించును. అందుకే శ్లోకమున కర్మ ఫలమని మాత్రము చెప్పఁబడినది. మంత్రము నందలి **అనశ్నన్ అభిచాకశీతి**యను పదములు జీవకృతసుఖదుఃఖభోగ సాక్షిత్వమీశ్వరనిష్ఠమని, తెలుపుటకు సర్వకర్మ ప్రేరకత్వోపలక్షకమైన పాయయతి యను ణిజంతక్రియ ప్రయోగింపఁబడినది. **ఏషహ్యేవ స్వాదుకర్మ కారయతి తం యమేవైష ఉన్ని నీషతే ఏష ఏవా స్వాదుకర్మ కారయతి తం యమధోని నీషతే** అను నుపషద్వాక్యములు శ్లోకమున ప్రేరకత్వము చెప్పుటకు మూలము. వ్యావహారిక సత్యమైన ఈ జీవేశ్వరద్వయము చిద్రూప శివునందు కల్పితమని శివుడే పారమార్థిక సత్యమని ఈ శ్లోకము యొక్క తాత్పర్యము. "ఇతరవాక్యే" అను పదము అనద్వైతుల వాక్యము అని వారు భ్రాంతులై జీవేశ్వరులు పారమార్థికసత్యస్వరూపులని భావించెదరనియు సూచించుచున్నది. మకుట మందలి ఏకమ్ అను పదము ద్వైతము భ్రాంతి మాత్రమని స్పష్టీకరించుచున్నది. ప్రత్యక్షానుమానప్రమాణ సిద్ధమగు నీద్వైతమును పై శ్రుతి అనువదించుచున్నది. కావున ద్వైతము శ్రుతి ప్రమాణసిద్ధము కాదని **ప్రత్యక్షేణానుమిత్యావాయస్తూపాయోనబుధ్యతే ఏతం విదంతి వేదేన తస్యాద్వేదస్య వేదతా** (ప్రత్యక్షము చేత అనుమానము చేతను ఏ యర్థము తెలియబడదో ఆ యర్థము తెలుపుటలోనే వేదము యొక్క వేదత్వము అనగా ప్రామాణ్యము) అను మనుస్మృతి వాక్యము – స్పష్టపరచుచున్నది. బ్రహ్మ సూత్రమందలి తృతీయాధ్యాయముయొక్క ద్వితీయపాదమున ఫలాధికరణమున్నది. **ఫలమతఉపపత్తేః** అను సూత్రము మొదలుకొని పాదము చివరి వఱకు గల నాలుగు సూత్రములలో జీవుడు చేయుకర్మ కీశ్వరుడే ఫలము నిచ్చువాడని నిరూపింపఁబడినది. ఈ శ్లోకమందలి పాయయతి

యను శబ్దము ఈశ్వరనిష్ఠమైన ఫల ప్రదాతృత్వమును సూచించుచున్నది.

అవ॥ పై శ్లోకమున ప్రత్యక్షానుమాన సిద్ధమైన జీవేశ్వరభేదమును శ్రుతి యనువదించుట చెప్పఁబడినది. ఈ శ్లోకమున ప్రత్యక్షాది ప్రమాణాగోచరమైన శ్రుత్యేక సమధిగమ్యమైన జీవేశ్వరైక్య మీశ్లోకమున ప్రతిపాదింపఁబడుచున్నది.

శ్లో॥ ఛాందోగ్యే హి శ్రూయత ఏవం తత్సత్యం
తత్త్వం పుత్రాయారుణివాక్యం నిరవద్యమ్ ।
తన్నిష్ఠస్యాత్ర తథా ముక్త్యుపదేశాత్
తం చిన్మాత్రం సాక్షిణమేకం శివమీడే ॥ 30 ॥

ప్ర॥ చాందోగ్యే – ఛాందోగ్యోపనిషత్తునందు, ఏవమ్ – ఇట్లు, శ్రూయతే హి – వినఁబడు చున్నదిగదా!, తత్ – ఆ బ్రహ్మము, సత్యమ్ – పారమార్థికసత్యము, తత్ – ఆ బ్రహ్మము, త్వమ్ – నీవు, (ఇతి – అని), పుత్రాయ – పుత్రుని కొఱకు, ఆరుణివాక్యమ్ – ఆరుణి యొక్క వాక్యము, తన్నిష్ఠస్య – ఆ ఆత్మనిష్ఠునకు, అత్ర – ఈ శరీరమున, తథా – ఆ విధముగా, ముక్త్యుపదేశాత్ – ముక్తినుపదేశించుట వలన, నిరవద్యమ్ – దోషరహితమై యున్నది. తమ్ – ఆ, ఆత్మ బ్రహ్మ స్వరూపుడైన, చిన్మాత్రమ్ – చిన్మాత్రుడైన, సాక్షిణమ్ – సాక్షియైన, ఏకమ్ – ఒకడైన, శివమ్ – శివుని, ఈడే – స్తుతించెదను.

తా॥ ఛాందోగ్యోపనిషత్తు నందు ఆ బ్రహ్మమే పరమాత్మయని ఆ బ్రహ్మము నీవేయని ఉపదేశించువాక్యము ఆత్మనిష్ఠునకు ఈ జన్మమునందే మోక్షము లభించునని యుపదేశించుచున్నందువలన దోషరహితమైనది. ఇట్లు శ్రుతిచేత జీవబ్రహ్మైక్యము ఘటించుచున్నది. అట్టి బ్రహ్మాత్మైక్యస్వరూపుడైన సాక్షియైన ఒకడైన శివుని స్తుతించెదను.

వి॥ ఛాందోగ్యోపనిషత్తునందు **స దేవ సౌమ్య ఇదమగ్ర ఆసీత్ తదైక్షత** ఇత్యాది వాక్యములు ప్రకరణము యొక్క ఆరంభము నందు, అంతమందు **సయఏషోஉణిమాఐతదాత్మ్యమిదం సర్వమ్ తత్సత్యమ్ ఆత్మా తత్త్వమసి** అను వాక్యములు కలవు. బ్రహ్మ సూత్రమందలి ఈక్షత్యధికరణమం దీయారంభ వాక్యము నందలి సత్ అను శబ్దము యొక్క యర్థము నిర్ణయింపఁబడినది. ఈ వాక్యము లాత్మనిష్ఠునకు మోక్షము నుపదేశించుచున్నవి. కావున ఆరంభమందున్న సత్ శబ్దమునకు బ్రహ్మ మనియే అర్థము కాని అచేతనమైన ప్రధానము కాదు. చేతనుడైన జీవునితో చేతనమైన బ్రహ్మకు ఐక్యము పొసగును. కాని అచేతనముతో నైక్యము పొసగదు. ఉపక్రమోప సంహారములందు బ్రహ్మాత్మల యైక్యమే ప్రతిపాదింపఁబడినది. చివఱకా బ్రహ్మావు నీవే యని ఆరుణిపుత్రున కుపదేశించు వాక్యము సమంజసముగానే యున్నది అందు ఎట్టి దోషమును లేదు.

అవ॥ పై శ్లోకమున ఈక్షత్యధికరణమందలి **తన్నిష్ఠస్య మోక్షోపదేశాత్** అను బ్రహ్మ సూత్రము ప్రస్తావింపఁబడినది. ఈ శ్లోకమున ఆ ఈక్షత్యధికరణ మందున్న **ఈక్షతేర్నాశబ్దమ్** అను సూత్రము యొక్క అర్థము వివరింపఁబడుచున్నది.

శ్లో॥ అవ్యక్తస్యైవేక్షతి కర్మానుపపత్తే-
స్సాంఖ్యోక్తస్యాశబ్దతయాపి చ జాడ్యేన ।
న జ్ఞేయత్వం యస్య తు నోక్తానుపపత్తిః
తం చిన్మాత్రం సాక్షిణమేకం శివమీడే ॥ 31 ॥

ప్ర॥ సాంఖ్యోక్తస్య – సాంఖ్యదర్శన మందు చెప్పంబడిన, అవ్యక్తస్య ఏవ – ప్రధానమునకే, అశబ్దతయా – వేదప్రతిపాద్యము కాకపోవుటచేత, అపి చ – మరియు, జాడ్యేన – జడమగుట చేతను, ఈక్షతి కర్మానుపపత్తేః – ఈక్షతిధాత్వర్థమునకు కర్మయగుట పొసగదు. కావున, జ్ఞేయత్వమ్ – తెలియునావశ్యకత, న – లేదు, యస్య – ఏ శివునకు, ఉక్తా – చెప్పంబడిన, అనుపపత్తిః – అసామంజస్యము, న – లేదో, తమ్ – ఆ, చిన్మాత్రమ్ – చిన్మాత్రుడైన, సాక్షిణమ్ – సాక్షియైన, ఏకమ్ – ఒకడైన, శివమ్ – శివుని, ఈడే – స్తుతించెదను.

తా॥ సాంఖ్యదర్శన మందుంజెప్పంబడిన అవ్యక్తము అనగా ప్రధానము వేదమునందు చెప్పంబడినది కాదు కావున, జడమైనది. కావున, ఈక్షతిధాత్వర్థమైన ఆలోచనము చేయంజాలదు. కావున ఛాందోగ్యోపనిషదారంభమందున్న సత్పదము ప్రధానమును బోధించదు. బ్రహ్మము నాసత్ శబ్దము బోధించునని చెప్పినప్పుడు పైన చెప్పిన వేదప్రతిపాద్యత్వాభావ, జాడ్యదోషములు లేవు. బ్రహ్మమైన సాక్షియైన చిన్మాత్రుడైన శివుని స్తుతించెదను.

వి॥ వేద ప్రామాణ్యము నంగీకరించు దర్శనములలో సాంఖ్యమొకటి. అందు వేద సమ్మతముకాని పురుషబహుత్వము (ఆత్మనానాత్వము) ఆత్మకు భిన్నముగా ప్రధానమనునొక పదార్థముయొక్క యంగీకారము ఆప్రధానమునకు జగత్కారణము – ఇత్యాది సిద్ధాంతములు కొన్ని యున్నవి. ఇట్లే కొన్ని సిద్ధాంతములు వేదసమ్మతములు కానివి వైశేషిక న్యాయ దర్శనములందున్నవని వెనుకంజెప్పబడినది. అయినను అవి వేదము ప్రమాణముగా నంగీకరించుచున్నవి కావున వైదిక షడ్దర్శనములలో స్థానము సంపాదించుకొన్నట్లు సాంఖ్యదర్శనమునకు గూడ వానిలో స్థానమేర్పడియున్నది. పైగా న్యాయవైశేషికములలో నున్నన్ని వేదాసమ్మత సిద్ధాంతము లీ సాంఖ్యదర్శనమందు లేకపోవుటచే నద్వైత దర్శన మందు అంగీకరింపంబడిన వ్యావహారికాంశములలో కొన్ని పోలికలుండుట చేతను షడ్దర్శనములలో దీని కాదరము ఎక్కువ. అయినను ఇందలి అవైదికాంశములు ఖండించుటలో అద్వైతులు వెనుదీయరు. అట్టి అవైదికాంశములలో ప్రధాన జగత్కారణత్వ మొకటి. బ్రహ్మసూత్రములందలి ఈక్షత్యధికారణమం దీ యంశము ఖండింపంబడినది. అసలు బ్రహ్మకు భిన్నముగా ప్రధానమగు నొక పదార్థమున్నదని వేదములందు చెప్పబడలేదు. అందువలన ప్రధానము **అశబ్దము** అనగా వేద ప్రతిపాదితము

కానిది. ఛాందోగ్యోపనిషదారంభమందలి సత్ శబ్దముదానిని బోధించును కదా. అప్పుడు ప్రధానము శబ్దమనుట యెట్లను ప్రశ్నము కలుగును. సమాధానమిట్లున్నది. సత్ శబ్దము దానిని బోధింపజాలదు. ఏలననగా ఆ ప్రకరణమున తదైక్షత అను నొక వాక్యమున్నది. సచ్ఛబ్దవాచ్యము. ఆలోచించెను అని దానికర్థము. ఆలోచించుటను జడమైన ప్రధానము చేయంజాలదు. కావున ప్రధానము సచ్ఛబ్ద వాచ్యము కాదు. అందుచే నది అశబ్దము. జగత్కారణమైన బ్రహ్మము జగమును సృష్టించుటకు ముందు సృజింపంబడబోవు జగమెట్లుండవలెనో ఆలోచించి జగమును సృజించును. జడమైన ప్రధాన మట్లాలోచింపం జాలదు. కావుననది జగత్కారణముకాదు. జగమునకు నిమిత్తకారణము కాకపోయినను ఉపాదానకారణము కావచ్చును గదా! యను నొక ప్రశ్నము కలుగును. దానికి సమాధాన మిట్లున్నది. జగమునకు బ్రహ్మమే నిమిత్తకారణము ఉపాదాన కారణము కూడ. బ్రహ్మము జగమునకు అభిన్ననిమిత్తోపాదానకారణము. బ్రహ్మము ఇచ్ఛాజ్ఞాన క్రియాశక్తి రహిత కూటస్థ చైతన్య రూపము కావున బ్రహ్మము జగత్కారణ మెట్లగును. అను ప్రశ్నము కలుగును. నిజమేకాని సత్యజగన్నిర్మాణము నందాశక్తుల యవసరమున్నది. అనిర్వచనీయ సర్వసృష్టియందు రజ్జువున కవిలేకున్నను సర్వసృష్టి జరిగినట్లు ఇచ్ఛాజ్ఞాన క్రియా శక్తులు లేకుండినను జరుగవచ్చును. అదిగాక నిర్గుణబ్రహ్మకు ఇచ్ఛాజ్ఞాన క్రియాశక్తులు లేకపోవచ్చును. కాని సగుణ బ్రహ్మమున కవి లేకుండుట అసంభవము. వాస్తవమున కిచట సగుణ బ్రహ్మమే ప్రస్తావింపంబడినందున జీవునితో తదభేదము వాచ్యార్థముగా తత్త్వమసియను వాక్యమునకు కుదురకపోవుటచేత జీవ బ్రహ్మైక్యము లక్ష్యార్థముగా అఖండవాక్యార్థముగా నిరూపింపంబడినది. కావున నిర్గుణ బ్రహ్మము కూటస్థ చైతన్య రూపమైనను సగుణ బ్రహ్మమునకు ఇచ్ఛాదిశక్తులుండటచే బ్రహ్మమే జగత్కారణము. అచేతన ప్రధానము జ్ఞేయము అనుటకు ముందు జడములైన ఘటపటాదుల జ్ఞానము మోక్షహేతువు కానట్లు జడమైన ప్రధానము యొక్క జ్ఞానము మోక్షహేతువు కాజాలదు. కావున దానికి జ్ఞేయత్వము (తెలిసికొన వలసిన ఆవశ్యకత) లేదు. అద్వైత సిద్ధాంతమున మాయావచ్ఛిన్న చైతన్యము సగుణ బ్రహ్మము. అదియే జగత్తునకభిన్న నిమిత్తోపాదాన కారణము. కావున అవైదికప్రధానము నుపాదానకారణముగా నంగీక రింపవలసిన ఆవశ్యకత లేదు.

అవ॥ పై శ్లోకమున బ్రహ్మము నందు జగత్స్రష్టృత్వము నిరూపింపంబడినది. ఈ శ్లోకమున జగమును సృజించుటలో బ్రహ్మమున కేమి ప్రయోజనమను విషయము విచారింపంబడుచున్నది.

శ్లో॥ లీలారూపా లోకవదేషా ఖలు సృష్టి-
స్త్వీశస్యాస్యాం నైవ ఫలం పరితృప్తస్య ।

కర్మాపేక్షం జ్ఞానిషు లోకే విషమత్వం
తం చిన్మాత్రం సాక్షిణమేకం శివమీడే ॥ 32 ॥

ప్ర॥ ఏషా – ఈ, సృష్టిః – సృష్టి, లోకవత్ – లోకమునందువలె, లీలారూపా ఖలు – లీలారూపముకదా, అస్యామ్ – ఈ సృష్టియందు, పరితృప్తస్య – మిక్కిలి తృప్తుడైన, ఈశస్య – ఈశునకు, ఫలమ్ – ఫలము, నైవ – లేనేలేదు, లోకే – లోకమునందు, జ్ఞానిషు – జ్ఞానులయందు, కర్మాపేక్షమ్ – కర్మానుసారమైన, విషమత్వమ్ – వైషమ్యము, దృష్టమ్ – చూడcబడుచున్నది. తమ్ – ఆ, చిన్మాత్రమ్ – చిన్మాత్రుడైన, సాక్షిణమ్ – సాక్షియైన, ఏకమ్ – ఒకడైన, శివమ్ – శివుని, ఈడే – స్తుతించెదను.

తా॥ లోకమునందు రాజాదులలో ప్రయోజనములేకుండగానే కర్మలందు ప్రవృత్తి యున్నట్లు పరితృప్తుడైన ఈశ్వరునకు సృష్టియందు ప్రయోజనమపేక్షింపని ప్రవృత్తి యున్నదని యంగీకరింపవలెను. జ్ఞానులలో కూడ మంచివారి యందు మంచిగా, చెడ్డవారియందు తదనురూపముగా వైషమ్యమును చూచుచునే యున్నారు. అట్లే తృప్తుడయ్యు సృష్టిలీలనొనర్చు చిన్మాత్రసాక్షియగు నేకాకి యైన శివుని స్తుతించెదను.

వి॥ మాయావచ్ఛిన్నుడైనను ఈశ్వరుని యందు సత్యజ్ఞానానందములుండును. ఆ ఆనందము కూడ విషయభోగవిలక్షణము. కావున అతడు నిత్యతృప్తుడే. అతనికి సృష్టి యొనర్చుటలో ప్రయోజనమపేక్షించదు. అసంతృప్తుడు తృప్తియను ప్రయోజనమును కోరి వివిధ కర్మల నొనర్చును. నిత్యతృప్తుడైన యీశ్వరునికీ సృష్టినొనర్చుటలో ప్రయోజనము లేకున్నను రాజాదులవలె లీలామాత్రముగా విలాసమాత్రముగా సృష్టి నొననర్చుచున్నాడు. బ్రహ్మసూత్రములందు ద్వితీయాధ్యాయ ప్రథమపాదమున ప్రయోజనవత్త్వాధికరణమున **లోకవత్తు లీలాకైవల్యమ్** అను సూత్రమున నీ విషయము వివరింపcబడినది. నిత్యతృప్తుడైన ఈశ్వరున కీసృష్టి లీలా విలాసమాత్రమగుగాక. మధ్య (నడుమ) జీవులందు వైషయిక సుఖదుఃఖము భోగమును కల్పించుటేల యను ప్రశ్నము కలుగును. సమాధానమిది. జీవులు చేసిన కర్మలకు ఫలముల నీశ్వరుడిచ్చునని యీవఱకే చెప్పcబడినది. జీవులలోని ఈ భోగవైషమ్యము వారి కర్మాపేక్షమే కాని పరమాత్మ వారి యెడ వైషమ్యమును చూపుట లేదు. జీవులకు దుఃఖము నొసగుటలో ఈశ్వరునికి వారియెడ నైర్ఘృణ్యము (నిర్దయ) లేదు. వారిపాపముల ఫలముగానే వారికి దుఃఖము నొసగుట జరుగుచున్నది.

అవ॥ పరమాత్మ సృష్ట్యాదుల నొనర్చుటపై శ్లోకమున చెప్పబడినందున పరమాత్మ యందౌదాసీన్యమును నిర్గుణత్వము చెప్పు శ్రుతులతో విరోధము వచ్చును గదా యను ప్రశ్నకీశ్లోకమున సమాధానము చెప్పcబడుచున్నది.

శ్లో॥ **ఔదాసీన్యం వాస్తవమాత్మని సంసిద్ధం**
స్రష్టృత్వాదిశ్శక్తిగధర్మోఽప్యుపపన్నః ।

నావ్యక్తాదేరిత్యుపదేశాది సకృద్వై
తం చిన్మాత్రం సాక్షిణమేకం శివమీడే ॥ 33 ॥

ప్ర॥ ఆత్మని – ఆత్మయందు, వాస్తవమ్ – యథార్థమైన, ఔదాసీన్యమ్ – నిష్క్రియత్వము, సంసిద్ధమ్ – బాగుగా సిద్ధమయి యే వున్నది, స్రష్టృత్వాదిః – స్రష్టృత్వాది ధర్మ సమూహము శక్తిగధర్మః అపి – శక్తి గత ధర్మముగా కూడ, ఉపపన్నః – పొసగియున్నది. అవ్యక్తాదేః – ప్రధానాదులకు, న – పొసగదు, ఇతి – అని, అసకృత్ – మాటి మాటికి, ఉపదేశాత్ – ఉపదేశము చేయబడి యుండుట వలన, అవ్యక్తాదేః – అవ్యక్తాదులకు, స్రష్టృత్వాదిః – స్రష్టృత్వాదులు, న – లేవు, తమ్ – ఆ, చిన్మాత్రమ్ – చిన్మాత్రుడైన, సాక్షిణమ్ – సాక్షియైన, ఏకమ్ – ఒకడైన, శివమ్ – శివుని, ఈడే – స్తుతించెదను.

తా॥ ఆత్మయందు వాస్తవమైన ఔదాసీన్యము (నిష్క్రియత్వము) సిద్ధమయే యున్నది. స్రష్టృత్వాది ధర్మములు శక్తి గతములని చెప్పుటయు సయుక్తికమే. అవ్యక్తాదుల యందా స్రష్టృత్వాదులు పొసగవు. మాటిమాటికి స్రష్టృత్వాదులేవనిశక్తి యందలి ధర్మములుగా చెప్పcబడినవో ఆ చిన్మాత్ర సాక్ష్యేక శివునే స్తుతించెదను.

వి॥ స్రష్టృత్వాదులు పరమేశ్వరుని యందలి సహజౌసీన్యమునకు భంగము కలిగింపcజాలవు. ఏలననగా పరమేశ్వరునందలి మాయా శక్తి ధర్మములైన ఆస్రష్టృత్వాదులు పరమేశ్వరునియం దారోపింపcబడుచున్నవి. అందుచేత పరమాత్మ యందలి వాస్తవౌదాసీన్యమట్లే యున్నవి. స్రష్టృత్వాదులు మాయా శక్తి గతములగుటచే నవి ఆయన సహజౌదాసీన్య నిర్గుణత్వములకేమాత్రము భంగము కలింపcజాలవు. అవ్యక్తాది సాంఖ్యోక్త పదార్థమున కట్లు స్రష్టృత్వాదులుపపన్నములు కావు. పరమాత్మయందే యాస్రష్టృత్వాదు లున్నవనియు వేదములందు పెక్కు మారులు చెప్పcబడియున్నది. ఏలననగా శక్తి శక్తిమంతులకు భేదములేదుగదా! శక్తి ధర్మములు శక్తిమద్ధర్మములుగా కూడ చెప్పుట లోకమున సహజమే.

అవ॥ పై శ్లోకమున ఆత్మయౌదాసీన్యము నిరూపింపcబడినది. ఆత్మ జీవేశ్వర స్వరూపము గదా! జీవుని యొక్క ఉత్క్రాంతిగతులు పరమేశ్వరునియొక్క సృష్ట ప్రపంచములోనికి వచ్చుట ప్రవేశించుట ఉపనిషత్తులలో ఉక్తములు. అవి ఎట్లుపపన్నములగునో ఈ శ్లోకమునcజెప్పcబడుచున్నది.

శ్లో॥ **జీవస్యైవోత్క్రాంతిరముష్మాద్గతిరేవం**
లోకం ప్రత్యస్యాగతిరన్యస్య తు భూమ్నః ।
నిశ్చేష్టత్వాన్నాపి చ బుద్ధేర్జడతాయాః
తం చిన్మాత్రం సాక్షిణమేకం శివమీడే ॥ 34 ॥

ప్ర॥ జీవస్యఏవ – జీవునకే, అముష్మాత్ – ఈలోకమునుండి, ఈశరీరమునుండి, ఉత్ర్కాంతిః – పైకిపోవుట, గతిః – ప్రయాణము, లోకమ్ ప్రతి – ఈ లోకమును గూర్చి, ఆగతిః – రాక, భూమ్నః – భూమస్వరూపుడైన, అన్యస్య – ఈశ్వరునకు, నిశ్చేష్టత్వాత్ – చేష్టలు లేకపోవుట వలన, న – లేదు, అపి చ – మరియు, బుద్ధేః జడతాయాః – బుద్ధి యొక్క జాడ్యమువలన, న – లేవు, తమ్ – ఆ, చిన్మాత్రమ్ – చిన్మాత్రుడైన, సాక్షిణమ్ – సాక్షియైన, ఏకమ్ – ఒకడైన, శివమ్ – శివుని, ఈడే – స్తుతించెదను.

తా॥ ఈ లోకమునుండి పైకిపోవుట అక్కడి నుండి మరొక లోకమునకు పోవుట మరల రాక అనునవి జీవునకే గాని సర్వవ్యాపకుడైన శివునకు లేవు. జడమగుట వలన బుద్ధికి గూడ నవి లేవు. అట్టి సాక్షి చిన్మాత్రైక స్వరూప శివుని స్తుతించెదను.

వి॥ ప్రాణవాయువులు శరీరము నుండి పైకి వెడలిపోవుట ఉత్ర్కాంతి అనఁబడును. కాని జీవుడే స్వకృత కర్మ భోగమునకై లోకాంతరమునకు పోవుచున్నాడు. కర్మ భోగము ముగిసిన పిదప కర్మ శేషముతో మరల నీ లోకమునకు వచ్చుచున్నాడనుట లోక ప్రసిద్ధమై యున్నది. లోక ప్రసిద్ధి సరియైనదే అని ఈ శ్లోకమున చెప్పఁబడుచున్నది. బ్రహ్మసూత్రములందీ జీవునకు ఉత్ర్కాంతి గత్యాగతులు కారణముగా అణుత్వము శంకింపఁబడి జీవుడు పరమేశ్వరాభిన్నుడు కావున అణుత్వము లేదని అణుత్వమును నిరాకరించు సందర్భమున ఈ ఉత్ర్కాంతి గత్యాగతులు జీవునందౌపాధికములని సిద్ధాంతీకరింపఁబడినది. అట్లే **తత్స ృష్ట్వాతదనుప్రావిశదిత్యాది** సృష్ట్యారంభనిరూపక వాక్యములందు ఈశ్వరునందీ లోకమునకు వచ్చుట ఈ సృష్టిలోనికనుప్రవేశము చేయుటయు నౌపాధికములేయని గ్రహింపవలెను. బ్రహ్మసూత్ర ద్వితీయాధ్యాయ తృతీయ పాదమునందు ఉత్ర్కాంతి గత్యధికరణముకలదు. అందు బుద్ధికి యావద్దేహభావిత్వము తిరస్కరింపఁబడి మోక్ష పర్యంతావస్థాయిత్వము చెప్పఁబడినది. ప్రాణేన్ద్రియమనోబుద్ధులు సూక్ష్మశరీరమని చెప్పఁబడును. స్థూలశరీరము లోకమున ప్రత్యక్షమై యున్నది. ఈ సంఘాతము నేను అను బుద్ధి మందజీవులకుండును. మధ్యమ జీవులకు వేదశాస్త్రములందు విశ్వాసముండుటచే సూక్ష్మదేహమునందు ఆత్మ (జీవ) బుద్ధి యుండును. దానిననుసరించి శ్వేతాశ్వతరోపనిషత్తునందు **వాలాగ్ర శతభాగస్య శతధా కల్పితస్య చ జీవో భాగస్సవిజ్ఞేయః** అని జీవుని యణుత్వము చెప్పఁబడినది. ఉత్ర్కాన్తిగత్యాదుల కనుకూలముగా నీయణుత్వము చెప్పుట జీవేశ్వరైక్య సిద్ధాంతమునకు విరుద్ధము కావున నీ యణుత్వము సూక్ష్మదేహోపాధికమని చెప్పవలెను. ఉత్తమజీవులకు సూక్ష్మదేహమునందును ఆత్మ (జీవ) బుద్ధి యుండదు. స్థూల సూక్ష్మకారణ శరీరాతిరిక్తముగా నుండు నాత్మయం దీశ్వరైక్యము ననుభవించుచు జీవన్ముక్తులై యుందురు. **న తస్యప్రాణా ఉత్ర్కామన్తి అత్రైవ సమ వలీయన్తే** సూక్ష్మదేహమందలి ప్రాణాదుల నిలయము చెప్పుచున్నది. కావున ఈ శ్లోకమునందు

ఉత్ర్కాన్తిగత్యాదులు జీవునకే అని చెప్పుట జీవుని యుపాధి ననుసరించియే యని అట్లే ఈశ్వరునికీ ప్రపంచములోనికి రాక (అను ప్రవేశము) యొక్క నిరాకరణము నిరూపాధిక బ్రహ్మ దృష్టితోనని గ్రహింపవలెను.

అవ॥ పై శ్లోకమున నిరూపాధిక బ్రహ్మకు జగములలోనికి రాక నిరాకరింపఁబడినది. ఈ శ్లోకమున సోపాధిక బ్రహ్మకు నామరూపవ్యాకరణరూపకర్మ మున్నదనిచెప్పఁబడుచున్నది.

శ్లో॥ సంజ్ఞామూర్త్యోః క్లృప్తిరధీశస్య హి కర్మ
త్రేధైకైకాం కుర్వత ఏవం శ్రుతి శబ్దాత్ ।
యస్మాజ్జీవోఽ నన్య ఇతీహాభ్యుపగమ్యః
తం చిన్మాత్రం సాక్షిణమేకం శివమీడే ॥ 35 ॥

ప్ర॥ సంజ్ఞామూర్త్యోః – నామరూపముల యొక్క, క్లృప్తిః – ఏర్పాటు, అధీశస్య – పరమేశ్వరునియొక్క, కర్మ హి – కర్మగదా, త్రేధా – మూడు విధములుగా, ఏకైకామ్ –ఒక్కొక్కదానిని, కుర్వతః – చేయునట్టి, ఏవమ్ – ఇట్లే, శ్రుతి శబ్దాత్ – వేద ప్రామాణ్యమున్నందువలన, యస్మాత్ – ఏ శివునికన్న, జీవః – జీవుడు, అనన్యః – అనన్యుడుగా, ఇహ – ఇచట, అభ్యుపగమ్యః – అంగీకరింపదగినవాడో, తమ్ – ఆ, చిన్మాత్రమ్ – చిన్మాత్రుడైన, సాక్షిణమ్ – సాక్షియైన, ఏకమ్ – ఒకడైన, శివమ్ – శివుని, ఈడే – స్తుతించెదను.

తా॥ నామ రూప వ్యాకరణము ఈశ్వరుని కర్మయనియే వేదము చెప్పుచున్నది. తేజోఽబన్నముల సృష్టించి యొక్కొక్క దానిని మూడు విధములుగా చేసి ఆ యీశ్వరునకభిన్నుడనే జీవుడు అని అంగీకరింపవలసి యున్నది. ఆ చిన్మాత్ర సాక్ష్యేక శివునే స్తుతించెదను.

వి॥ బ్రహ్మసూత్ర ద్వితీయాధ్యాయాంతమున సంజ్ఞామూర్తి క్లృప్త్యధికరణమున్నది. అది **సంజ్ఞామూర్తిక్లృప్తిస్తుత్రివృత్కుర్వత ఉపదేశాత్** అను సూత్రము నందారంభింపఁబడినది. ఈ సూత్రముయొక్క తాత్పర్యమీ శ్లోకమున వివరింపఁబడినది. ఈ యధికరణమందు పరమేశ్వరుడే నామరూపముల వ్యాకరణించెనని యున్నది. కావున నామ రూపవ్యాకరణము నీశ్వరుని కర్మము (కృత్యము). **నేయందేవతైక్షత** అని ఆరంభింపఁబడిన శ్రుతిలో త్రికృత్కరణము చెప్పఁబడినది. ఆ పరమేశ్వరుడు తేజస్సును సృజించెను. తరువాత జలమును, ఆ తరువాత అన్నమును సృజించెను (పృథివిని) సృజించిన ఆతేజోఽబన్నములలో నొక్కొక్కదానిని త్రైధాఏకైక సేత్యాదిశ్రుత్యనుసారము మూడు విధములుగా నొనరించెను. పృథివిని జలమును తేజస్సును రెండు భాగములు చేసెను. తేజస్సులోని యర్ధభాగము నొక దానిని మరల రెండు భాగములు చేసి జలపృథివులలో కలిపెను.

అట్లే జలములోని యొక యర్ధభాగమును మరల రెండు భాగములు చేసి తేజః పృథివులలో కలిపెను. అట్లే పృథివిలోని యొక యర్ధభాగమును మరల రెండు భాగములు చేసి తేజో జలముల గలిపెను. ఈ విధముగా తేజోఽ బన్నములు త్రివ్యాకృతములాయెను. తేజస్సున జల పృథివులు, జలాగ్నులు జలములలో, తేజః పృథివులు పృథివిలో కలసినవి. త్రివృత్కృత తేజోజలపృథివులట్లేర్పడినవి. అనగా త్రివత్కృతమైన తేజస్సులో రెండు పావు భాగములు జల పృథివులున్నను అర్ధభాగము తేజస్సు అనగా తేజస్సు అధికముగా నుండుటచే త్రివత్కృతమైన పిదప కూడా దానికి తేజస్సనియే పేరు. అట్లే జలములోని అర్ధభాగము జలము, పావు పావు భాగములు అగ్ని పృథివులున్నను జలభాగమ (అర్ధము) అధికము కావున దానికి జలమనియే పేరు. అట్లే పృథివి (అన్నము)లో పృథివీ భాగము అర్ధము పావు పావు భాగములు తేజోజలములున్నను పృథివి (అర్ధ) భాగము అధికము కావున పృథివి యనియే పేరు. తైత్తిరీయశ్రుతిలో మొదట ఆకాశము తరువాత వాయువు సృష్టింపఁబడిన అంశము అధికముగా నున్నది. అప్పుడు భూతములైదైనవి. కనుక పంచీకరణము చేయఁబడవలెను. పద్ధతి మాత్రమిదియే. ఒక శ్రుతిలో పంచభూతములు (ఆకాశ వాయు తేజో జల పృథివులు) మరొక శ్రుతిలో మూడు భూతములు సృజింపఁబడినట్లు చెప్పుట విరుద్ధము కదా అను ప్రశ్నము కలుగును. శ్రుతికి భూతము లెన్ని? అవి ఏవి? అనిగాని వాని సంఖ్య ఐదని, లేక మూడని గాని చెప్పుట ప్రాస్తావికమే, కాని ప్రధానము కాదు. జగము మిథ్యయని, బ్రహ్మమే సత్యమని చెప్పుటయే తాత్పర్యము కావున విరుద్ధము కాదు. మనుష్యుడు భుజించిన త్రివృత్కృత (అన్నాది) పార్థివద్రవ్యముచే శరీరమున మాంసాదులేర్పడును. వీనిలో పురీషము స్థూలము. మాంసాదికము మధ్యమము. సూక్ష్మము మనస్సు. ఇట్లే జలము స్థూల మాత్రముగ మధ్యమ రక్తముగ, సూక్ష్మము ప్రాణముగ మారును, ఇట్లే తేజస్సు స్థూలాస్థి మధ్యమ మజ్జ సూక్ష్మ వాగ్రూపములుగ మారును. త్రివృత్కరణానుబంధముగా తేజోఽ బన్నముల వలన శరీరమునందు కలుగు మార్పులు చెప్పఁబడినవి. ఈ పంచీకృతమైన లేక త్రివృత్కృతమైన భూతముల సృష్టి వాని నామ రూపముల ఏర్పాటు ఈశ్వరుని కర్మయని ఈ శ్లోకమున చెప్పఁబడినది. జగమును సత్య మనుకొనువారికి జగము నెవడు సృజించెను? వాని నామ రూపముల నెవడేర్పరచెను? అను ప్రశ్నములు కలుగును. శ్రుతి వారి కొఱకు త్రివృత్కరణ పంచీకరణ ప్రక్రియలను నామరూప వ్యాకరణమును ఈశ్వరకర్మలుగా చెప్పినది. వాస్తవమునకు జగము మిథ్య యని యెఱిగిన వారికీ ప్రశ్నలే యుండవు. అవి కేవలము కాకి దంతము లెన్నియను ప్రశ్నము వంటిది. మిథ్యా జగము బ్రహ్మమున నజ్ఞులచే కల్పించబడినట్లు బ్రహ్మమునందు జీవేశ్వర విభాగమును కల్పితమే. అందుకే ఈ శ్లోకముయొక్క మూడవపాదమున జీవుడీశ్వరానన్యుడని చెప్పఁబడినది. ఈ జీవేశ్వరాభేదము తత్త్వమసి యని శ్రుతి శబ్దము

(వాక్యము) వలన గురుముఖమున తెలియును. జీవేశ్వరానన్య భావమనుభవింపఁబడును. అంతవఱకు వేదతాత్పర్యము జీవుడీశ్వరానన్యుడని యంగీకరించుట వేద ప్రామాణ్యము నంగీకరించుట మాత్రమగును.

అవ॥ పై శ్లోకమున ప్రపంచసృష్ట్యారంభమున నీశ్వర కర్తృకమైన నామ రూప వ్యాకరణము వివరింపఁబడినది. ఈ శ్లోకమున జీవకర్తృకమున రంహణము (దేహము నుండి మరొక దేహమునకు ప్రయాణము) వర్ణింపఁబడుచున్నది.

శ్లో॥ భూతైర్జీవోఽ నంతరదేహప్రతిపత్తౌ
రంహత్యేవం కర్మ ఫలానాముపభుక్త్యై ।
రేతస్సిగ్యోగోఽ థ భవిష్యత్యహ యస్మాత్
తం చిన్మాత్రం సాక్షిణమేకం శివమీడే ॥ 36 ॥

ప్ర॥ అహ – అహ, అనంతర దేహ ప్రతిపత్తౌ – తరువాతి దేహమును పొందుటలో, జీవః – జీవుడు, భూతైః – (సూక్ష్మ) భూతములతో కూడి, కర్మఫలానామ్ – కర్మ ఫలముల యొక్క, ఉపభుక్త్యై – ఉప భోగము కొఱకు, రంహతి – ప్రయాణించును. అథ – పిమ్మట, యస్మాత్ – శివుని వలన, రేతస్సిగ్యోగః – రేతస్సును సించించువాని (పురుషుని) తోడి సంబంధము, భవిష్యతి – కలుగగలదో, తమ్ – ఆ, చిన్మాత్రమ్ – చిన్మాత్రుడైన, సాక్షిణమ్ – సాక్షియైన, ఏకమ్ – ఒకడైన, శివమ్ – శివుని, ఈడే – స్తుతించెదను.

తా॥ జీవుడే దేహమును విడిచి సూక్ష్మభూతములతోగూడి మరొక దేహమును చేరుటకై ప్రయాణించుచుండగా ఆ పిమ్మట స్త్రీయోనియందు రేతస్సును విడుచు పురుషుని దేహమున నన్నాదులతో గూడి ఏ శివుని అనుగ్రహమున మరల జన్మించునో ఆ సాక్షి చిన్మాత్రుడైన శివుని స్తుతించెదను.

వి॥ బ్రహ్మసూత్ర తృతీయాధ్యాయ ప్రథమపాదారంభమున తదంతర ప్రతి పత్త్యధికరణమున **తదన్తర ప్రతిపత్తౌ రంహతి సంపరిష్వక్తః ప్రశ్న నిరూపణాభ్యామ్** అను సూత్రమున్నది. ఆ సూత్రమందలి **తదంతర ప్రతిపత్తౌ** అను శబ్దమునకు "తదనంతర దేహప్రతిపత్తౌ" అను ఆ సూత్రమునందలి పదములనే యుపయోగించి అవసరములైన అనంతరదేహ పదములను చేర్చి వివరించుట జరిగినది. ఉపనిషత్తులలో ప్రశ్న ప్రతి వచనములున్నవి. వానిలో ద్యు అను అగ్నిలో శ్రద్ధ, పర్జన్య అను అగ్నిలో సోమ, పృథివి అను అగ్నిలో వృష్టి, పురుష అను అగ్నిలో అన్న, యోషిత్ అను అగ్నిలో రేత యను నాహుతుల నొనర్చిన పురుషుడగును. అను ప్రతి వచనమున్నది. శ్వేతకేతువు **వేత్థయథాపంచ మ్యామాహుతావాపః పురుష వచసో భవన్తీతి నైవ భగవ ఇతి.** అయిదవ ఆహుతియందు జలములు పురుష శబ్ద వాచ్యము లెట్లగునో యెఱుగుదువా! అని ప్రణవమహరాజు నడిగినప్పుడు, పైన చెప్పిన ప్రతి వచనమీయబడినది. ప్రశ్నమున

"అపః" అను పదమున్నది. దానికి జలములను యర్థమే యున్నను ఆ జలములు తేజః పృథివీ భాగములతో గూడి యుండుటచే త్ర్యాత్మకములు. త్రివృత్కృతములగుటచే సూక్ష్మభూతములతో గూడినవే అయినను వానిలో జలభాగమధికమగుటచే "అపః" అని చెప్పఁబడినది. పై ప్రశ్న ప్రతివచనము వలన "త్రివృత్కృతములైన జలములు సూక్ష్మ భూతములతో గూడియే యుండునని తెలియుచున్నది. పై తృతీయాధ్యాయము చివఱి అన్యాధిష్ఠితాధికరణములో **రేతస్సిగ్యోగోఽ థ** అను సూత్రమున్నది. ఆ సూత్రము పూర్తిగా శ్లోకమునందలి మూడవ పాదమున యథాతథముగా నున్నది సూత్రము నందు అధ్యాహార్యమైన భవిష్యతి అను క్రియ ప్రయోగింపఁబడినది.

అవ॥ శివుడిచ్చు ఫలముల యుపభోగము కొఱకే జీవుని దేహాంతరప్రాప్తి జీవుడు రేతస్సును విడచి వానిలో చేరుటయు చెప్పఁబడినవి. ఈ శ్లోకమున ప్రాకృత దృష్టికుపనిషత్తులు సగుణ విద్యా వేద్యభేదములు ప్రస్తావింపఁబడినవని చెప్పఁబడుచున్నవి.

శ్లో॥ విద్యాభేదో వేద్యభిదాపి శ్రుతిశీర్షై-
ర్నైవోచ్యేత ప్రాకృతదృష్టేస్సగుణా స్యాత్ ।
అన్యా శైవీ నిర్గుణరూపా యదధీనా
తం చిన్మాత్రం సాక్షిణమేకం శివమీడే ॥ 37 ॥

ప్ర॥ శ్రుతి శీర్షైః – ఉపనిషత్తుల చేత, విద్యాభేదః – విద్యాభేదము, వేద్యభిదాపి – వేద్య భేదమును, న ఏవ ఉచ్యేత – చెప్పఁబడకయే యుండినచో, (విద్యా – విద్య) సగుణా – సగుణగానే, స్యాత్ – అయియుండెడిది. నిర్గుణరూపా – నిర్గుణ రూప యగు, శైవీ – శివ సంబంధమైన, అన్యా – మరొక విద్య, యదధీనా – ఏ శివునకధీనమో, తమ్ – ఆ, చిన్మాత్రమ్ – చిన్మాత్రుడైన, సాక్షిణమ్ – సాక్షియైన, ఏకమ్ – ఒకడైన, శివమ్ – శివుని, ఈడే – స్తుతించెదను.

తా॥ ఉపనిషత్తులు వేద్యభేదముతో విద్యాభేదము ప్రాకృత దృష్టుల కొఱకు చెప్పి యుండనిచో విద్యయంతయు సగుణమే అయి యుండెడిది. ఉపనిషత్తులు విద్యాభేదముతో వేద్య భేదము ప్రాకృతుల కొఱకు చెప్పినను నిర్గుణ రూపవిద్య మాత్రము శివుని యధీనముననే యున్నందున మొత్తము విద్య సగుణము కాలేదు. ఏ శివుని యధీన మందా విద్య యున్నదో ఆ సాక్షి చిన్మాత్రైక స్వరూపుడైన శివుని స్తుతించెదను.

వి॥ విద్యా శబ్దమున కుపాసన జ్ఞానము అను రెండర్థములు కలవు. వేద్య శబ్దము ఉపాసనా లభ్య సగుణ బ్రహ్మము, జీవేశ్వరైక్య జ్ఞాన లభ్య నిర్గుణ బ్రహ్మము అను ద్వివిధ బ్రహ్మలను బోధించును. ఉపాసనా రూపములైన దహరవిద్యా మధువిద్యాది భేదములును విద్యా భేదములుగా వ్యవహరింపఁబడుచున్నవి. ఒకే బ్రహ్మము ప్రాకృత దృష్టితో సగుణము, నిర్గుణమని విభజింపఁబడినది. విద్యయు సగుణ, నిర్గుణ భేదము కలదని యా శ్లోకమున చెప్పఁబడినది. సగుణ బ్రహ్మ స్వరూపులైన విష్ణ్వాదుల నుపాసించువాడు తత్తల్లోకముల

చేరి ఉపాసనా తారతమ్య వశమున సారూప్య సామీప్య సాయుజ్యముల నందుకొనును. నిర్గుణ జీవ బ్రహ్మైక్యమును కలిగించుటచే **తత్త్వమసి** యను మహావాక్య జన్య జ్ఞానము నిర్గుణము. **ఈశ్వరానుగ్రహాదేవ పుంసామద్వైత వాసనా, తమేవైష వృణు తే తేన లభ్యః** ఇత్యాది స్మృతి శ్రుతులచే నిర్గుణ విద్య సగుణోపాసనా లభ్యవేద్యబ్రహ్మానుగ్రహము వలననే లభించును. సాధకులలో మంద మధ్యమోత్తమాది భేదముల ననుసరించి కొందఱి సగుణోపాసనాలభ్య వేద్య బ్రహ్మమగు ఈశ్వరుని యనుగ్రహముచే ఈ లోకముననే కొందఱు జీవేశ్వరాద్వైత జ్ఞానమును పొంది విదేహముక్తులై దేహాంతరమున కైవల్యము నొందుదురు. మరికొందఱు సగుణ బ్రహ్మలోకమును చేరి యచ్చటి యా సగుణ బ్రహ్మయగు నీశ్వరుని యనుగ్రహమున **తత్త్వమసి** యను నుపదేశము బొంది జీవేశ్వరైక్య జ్ఞానమును పొంది కైవల్యమునొందుదురు. మొత్తము మీద శివుడొక్కడే ప్రాకృతుల దృష్టిలో సగుణుడుగా జ్ఞానుల దృష్టిలో నిర్గుణుడుగా నున్నందున నిర్గుణ విద్యా రూపమైన జీవేశ్వరైక్య జ్ఞానము శివానుగ్రహముననే కలుగును. కావున నిర్గుణ రూపవిద్య శివాధీనమైయున్నదని ఈ శ్లోకమున చెప్పఁబడినది. **అథ పరాయమాతా దాక్షర మధిగమ్యతే** ఋగ్వేదాది రూపమైన **విద్యా** అపరయని నిర్గుణ బ్రహ్మ ప్రాప్తి హేతువైన పరవిద్య తత్త్వమసీత్యాది వాక్యార్థ జ్ఞానరూపమని చెప్పఁబడినది.

అవ॥ పై శ్లోకమున ఉపాసనా రూప విద్య ప్రస్తావించఁబడినది. ఈ శ్లోకమున ఉపాసనా భేదమైన ప్రతీకోపాసనము ప్రస్తావింపఁబడుచున్నది.

శ్లో॥ కార్యోత్కర్షాత్సర్వపదార్థే శివదృష్టిః
స్తంబాంతే స్మింశ్శాస్తి చ శాస్త్రం సదయం యమ్ ।
విన్నోవేదోత్కర్షమనన్యోప్యపకర్షం
తం చిన్మాత్రం సాక్షిణమేకం శివమీడే ॥ 38 ॥

ప్ర॥ స్తంబాంతే – స్తంబము అంతమందుగల, అస్మిన్ – ఈ (దృశ్యమానమైన), సర్వపదార్థే – పదార్థములందన్నిట, ఉత్కర్షాత్ – ఉత్కర్ష నిమిత్తముగ, శివదృష్టిః – శివదృష్టి, కార్యా – చేయదగినది అని, సదయమ్ – దయగల, శాస్త్రమ్ చ – (శ్రుతి స్మృతి రూప) శాస్త్రముకూడ, శాస్తి – శాసించుచున్నదో, యమ్ – ఏ శివుని, విత్ – ఎఱిగినవాడు, అనన్యః – అనన్యుడై, ఉత్కర్షమ్ – ఆధిక్యమును, అపకర్షమ్ అపి – అల్పత్వమును గూడ, నో వేద – ఎఱుగడో, తమ్ – ఆ, చిన్మాత్రమ్ – చిన్మాత్రుడైన, సాక్షిణమ్ – సాక్షియైన, ఏకమ్ – ఒకడైన, శివమ్ – శివుని, ఈడే – స్తుతించెదను.

తా॥ కార్యమైన హిరణ్యగర్భాది స్తంబపర్యంతమైన పదార్థరూపమైన ప్రపంచమును కారణమైన శివుడనియే చూడవలెను. అని దయతో శాస్త్రము శాసించుచున్నది. దానికి కారణమైన శివుని యొక్క ఉత్కర్షయే నిమిత్తము. ఏ శివునెరిగిన వాడుత్కర్షాపకర్షముల రెండింటిని ఎఱుగడో ఆ చిన్మాత్రసాక్ష్యైక శివుని స్తుతించెదను.

వి॥ కుండ, మూకుడు, కాగు మొదలగునవి కార్యములు. వాని కుపాదాన కారణము మట్టి. మట్టిచే చేయబడిన కుండ మొదలగు వానిని మట్టిని గానే చూచుట లౌకికులైన విజ్ఞులు చేయుదురు. అతిపామరులు మట్టివేరు, కుండవేఱు అని భావించెదరేమోకాని ఏ కొద్ది జ్ఞానము కలవారైనను కుండను మట్టి అని యందురు. ఇది యట్లుండ మహాభినివేశముతో ఆరంభవాదులు (తార్కికులు అనగా నైయాయికులు వైశేషికులు) మట్టి కన్న కుండవేరందురు. కారణమున కన్న కార్యము సర్వథా భిన్నమందురు. పరిణామవాదులు (సాంఖ్యులు యోగులు) కారణము (మట్టి) యొక్క పరిణామ కార్యము (కుండ) అందురు. వ్యాపకమైన కారణ ముత్కృష్టమని వ్యాప్యమైన కార్య మపకృష్టమని పెక్కురంగీకరించెదరు. అతిపామరులు జలాహరణాది క్రియలకుపయోగపడు హేతువున కార్యము (కుండ) నే యుత్కృష్టమని భావించెదరు. ఇట్లుత్కర్షాకకర్షవిషయమున నున్న వైమత్యమును దృష్టియందుంచుకొని శ్రుతి స్మృతి రూప శాస్త్రము కార్యమైన ప్రపంచమున కంటె కారణమైన శివుడుత్కృష్టుడు కావున పదార్థములందన్నింటి యందు శివదృష్టి చేయ దగినదని శాసించుచున్నది. కార్యకారణములందు భేదదృష్టి కలవారును, రాజుకనఁ బడని సందర్భములందు రాజసేవకుని యందు రాజదృష్టి నొనర్చెదరు. అనగా రాజ రాజసేవకులందభేదదృష్టి నొనర్చెదరు. బ్రహ్మ ప్రపంచములు రాజ రాజసేవక సదృశములు. రాజసేవకుని యందుత్కర్షము కారణముగా రాజదృష్టి చేయఁబడుట యుచితమైనట్లు అపకర్షము కారణముగా రాజునందు రాజసేవక దృష్టి యుచితము కాదని పెక్కులెరింగిన విషయమే. బ్రహ్మసూత్ర చతుర్థాధ్యాయ ప్రథమ పాదమున **బ్రహ్మ దృష్టిరుత్కర్షాత్** అను సూత్రము నందీ యుత్కర్షము కారణముననే బ్రహ్మదృష్టి చేయదగినదని చెప్పఁబడినది. ఇది కూడ శాస్త్రముచే వ్యావహారికమైన బ్రహ్మ. ప్రపంచముల భేదమును దృష్టి యందుంచుకొని చెప్పఁబడినదే. వివర్తవాదమందు కూడ త్రాడును చూచి పామనుకొన్న వానికి, విజ్ఞుడు నీవు చూచు పాము త్రాడే అని యుపదేశించును. అతిపామరునకు ఇంకను విశ్వాసము కలుగకున్నను విజ్ఞుడు చెప్పినమాట సత్యమోకాదో పరీక్షించుటకు ప్రయత్నించును. ఆ ప్రయత్నమున నాతనికి విజ్ఞోపదేశము సత్యమను ననుభవము కలుగును. తాకినను కదలనందున నిది త్రాడే పాము కాదని నిశ్చయించుకొనును. ఈ విధముగా ప్రపంచమునందు శివాభేదదృష్టి లేకున్నను విజ్ఞోపదేశమున లింగమందు శివదృష్టిని మధ్యములు చేయుదురు. వ్యావహారికముగా నది యారోపమైనను వాస్తవమున లింగము శివ వివర్తము. కావున లింగమున శివబుద్ధి ఫలప్రదమే యగును. ఇదియే ప్రతీకోపాసనము. ఈ ప్రతీకోపాసనము వలన జనించిన పుణ్యముచే పాపమూలకమైన చిత్తచాంచల్యము తొలగి చిత్తమున కేకాగ్రత కలుగును. ఆ పిదప గురూపదేశమున ప్రపంచమంతయు మిథ్యయే యయి, గురూపదిష్టవాక్యార్థ శివైక్యమే యనుభవమునకు

వచ్చును. ఇట్లు తానే శివుడనని యెఱిగిన పిదప దీనియం దుత్కర్షయున్నది. దీనియం దపకర్ష మున్నదని ఎఱుగడు. ఉత్కర్షాపకర్షముల నెరుగక శివైక్యమున మాత్రమే లీనుడయిపోవును. అట్టివాడు శివానన్యుడని యీ శ్లోకమున చెప్పఁబడినది. ఇట్లు వ్యష్టులైన లింగాదులందు శివదృష్టిని చేయగ గురూపదేశమున తత్సమాన జాతీయమైన సర్వప్రపంచము నందు శివాభేదదృష్టి కలుగును. అప్పుడు **సర్వం ఖల్విదమ్ బ్రహ్మ** అను వాక్యము అనుభవమునకు వచ్చును.

అవ॥ సర్వప్రపంచమునందు శివదృష్టి పై శ్లోకమున చెప్పఁబడినది. ఈ శ్లోకమున శివదృష్టిచే గలుగు భూమానందము ప్రస్తావింపఁబడుచున్నది.

శ్లో॥ **భూమానందస్సైంధవతుల్యోஉస్త్యవినాశః**
కూటస్థాత్మా హ్యక్షరరూపః క్షరగమ్యః ।
యస్య బ్రహ్మక్షత్రమపి స్యాదశనార్థం
తం చిన్మాత్రం సాక్షిణమేకం శివమీడే ॥ 39 ॥

ప్ర॥ సైంధవ తుల్యః – సముద్రముతో సమానమైన, భూమానందః – భూమానంద రూపము, అవినాశః – నాశములేనిది, అక్షరరూపః – అక్షరరూపమైనది, క్షరగమ్యః – జీవులచే చేరదగినదియునైన, కూటస్థాత్మా – కూటస్థ చైతన్యము, అస్తి హి – కలదు కదా, యస్య – (కూటస్థాత్మ రూపుడైన) ఏ శివునకు, బ్రహ్మ – బ్రాహ్మణజాతి, క్షత్రమపి – క్షత్రియ జాతియు, అశనార్థమ్ – ఆహారము కొఱకు, స్యాత్ – అగునో, తమ్ – ఆ, చిన్మాత్రమ్ – చిన్మాత్రుడైన, సాక్షిణమ్ – సాక్షియైన, ఏకమ్ – ఒకడైన, శివమ్ – శివుని, ఈడే – స్తుతించెదను.

తా॥ సముద్రమువలె నుండు భూమానందము అక్షరరూపము. అవినాశమైన ఆ కూటస్థాత్మ జీవులందఱకు గమ్యమైయున్నది. దానికి బ్రహ్మక్షత్రము లాహారముగా నున్నవి. ఆ కూటస్థాత్మ సాక్షి చైతన్య భూత శివస్వరూపము. దానినే స్తుతించెదను.

వి॥ సముద్రములోనికి నదులు చేరి నామరూపరహితములై భూమత్వమొందును. జీవులందఱు శివైక్యమునంది భూమానంద రూపులగుదురు. శివుడు, కూటస్థ చైతన్యరూపుడు, సముద్రము వంటివాడు. జీవులే నదుల వంటివారు. నదులు సముద్రము చేరు వఱకు విశ్రమించనట్లు జీవులు శివుని చేరువరకు విశ్రమించరు. శివుని జేరి తృప్తినందుదురు. ఈ శ్లోకమునకు మూలమనఁదగిన కఠోపనిషత్తు నందు **యస్య బ్రహ్మచ క్షత్రం చోభే భవత ఓదనః** ఎవనికి బ్రాహ్మణ క్షత్రియులు భోజన రూపులగుదురో అతడే బ్రహ్మయని సర్వప్రపంచసంహారకత్వము చెప్పఁబడినది.

అవ॥ ఆ యక్షర బ్రహ్మ రూప శివునందు దేహేంద్రియాదులను లీనమొనరించి స్వాత్మను లీనము చేయు క్రమమీ శ్లోకమున చెప్పఁబడుచున్నది.

శ్లో॥ పురుషస్యాస్మిన్వాగపి చిత్తే చిత్తం చ
ప్రాణే ప్రాణస్తేజసి తేజోవిదుషోఽస్మిన్ ।
యద్రూపం తద్దేహవియోగే పరిలీనం
తం చిన్మాత్రం సాక్షిణమేకం శివమీడే ॥ 40 ॥

ప్ర॥ పురుషస్య – జీవుని యొక్క, వాగపి – వాక్కుకూడ, అస్మిన్ – ఈ, చిత్తే – చిత్తమునందు, చిత్తం చ – చిత్తమును, ప్రాణే – ప్రాణమందు, ప్రాణః – ప్రాణము, తేజసి – తేజస్సునందు, తేజః – తేజము, విదుషః – విద్వాంసుని యొక్క, అస్మిన్ – ఈ స్వరూపమునందు, యద్రూపమ్ – ఏ శివునియొక్క రూపము, తద్దేహవియోగే – ఆ శివుని దేహము యొక్క వియోగము నందు, పరిలీనమ్ – లీనమైపోవునో, తమ్ – ఆ, చిన్మాత్రమ్ – చిన్మాత్రుడైన, సాక్షిణమ్ – సాక్షియైన, ఏకమ్ – ఒకడైన, శివమ్ – శివుని, ఈడే – స్తుతించెదను.

తా॥ విద్వత్పురుషుని వాక్కు హృదయము నందు, హృదయము ప్రాణమునందు, ప్రాణము తేజస్సునందు, తేజస్సు అతని స్వరూపము నందు లీనమగును. ఈ లీనమగునదంతయు శివుని రూపమే. జీవుడు దేహమును విడుచునప్పుడంతయు శివునందే లీనమగును. అట్టి చిన్మాత్ర సాక్ష్యేక శివుని స్తుతించెదను.

వి॥ ఛాందోగ్యోపనిషత్తునందు **వాఙ్మనసి సంపద్యతే మనః ప్రాణేప్రాణస్తేజసి తేజః పరస్యాం దేవతాయామ్** అను మంత్రము కలదు. ఆ మంత్రము యొక్క అర్థమే ఇందు చెప్పబడినది. బ్రహ్మసూత్రచతుర్థాధ్యాయద్వితీయపాదముయొక్క ఆరంభము నందలి వాగధికరణమున **వాఙ్మనసి దర్శనాచ్ఛబ్దాచ్చ** 'మన' ఆదులందు వాగాదుల సంపత్తి యనగా వాగాదుల వృత్తులకే లయమని నిర్ణయించబడినది.

అవ॥ పై శ్లోకమున దేహేంద్రియాదుల ప్రవిలాపరూపజీవన్ముక్తి ప్రస్తావింపఁబడినది. ఈ శ్లోకమున మరణానంతర ప్రయాణ భేదములు (దక్షిణోత్తరాయణములు) దానిలో నొకటైన క్రమముక్తి ప్రస్తావింపఁబడుచున్నది.

శ్లో॥ న్యూనాధిక్యం నోత్తరదక్షిణసంజ్ఞాభ్యా-
ముత్క్రాంతస్యాప్యత్ర విదోఽ స్మాదయనాభ్యామ్ ।
భిత్వాదిత్యం గచ్ఛతి సిద్ధం బ్రహ్మస్థం
తం చిన్మాత్రం సాక్షిణమేకం శివమీడే ॥ 41 ॥

ప్ర॥ అత్ర – ఈ లోకమున, ఉత్క్రాంతస్య విదః – ఉపాసకుడైన వానికి, ఉత్తర దక్షిణ సంజ్ఞాభ్యామ్ – ఉత్తర దక్షిణ నామకములైన, అస్మాత్ – ఈ లోకము నుండి, అయనాభ్యామ్ – ప్రయాణము వలన, న్యూనాధిక్యమ్ – న్యూనత గాని అధికతగాని, న – లేదు, ఆదిత్యమ్ – సూర్యుని, భిత్వా – భేదించి, సిద్ధమ్ – సిద్ధమైన, బ్రహ్మస్థమ్ –

బ్రహ్మలోకమును, గచ్ఛతి – చేరును, తమ్ – ఆ, చిన్మాత్రమ్ – చిన్మాత్రుడైన, సాక్షిణమ్ – సాక్షియైన, ఏకమ్ – ఒకడైన, శివమ్ – శివుని, ఈడే – స్తుతించెదను.

తా॥ ఉత్తరదక్షిణాయనములలో నే అయనములందు మృతి చెందినను బ్రహ్మోపాసనమునకు న్యూనత గాని అధికతగాని సంభవింపదు. ఆదిత్య మండలమును భేదించి సిద్ధమైన బ్రహ్మలోకమును చేరును.

వి॥ కర్కాటక సంక్రమణము మొదలు మకర సంక్రమణము వఱకు సూర్యుడు దక్షిణమున సంచరించు కాలము కావున దానికి దక్షిణాయనమని, మకర సంక్రమణము మొదలు కర్కాటక సంక్రమణము వఱకు సూర్యుడు ఉత్తరమున సంచరించు కాలము ఉత్తరాయణమనఁబడును. దక్షిణాయనమునందు మరణించు వారికన్న ఉత్తరాయణము నందు మరణించు వారధికులనియు కొందఱు భావించెదరు. మరణించిన వాడు బ్రహ్మోపాసకుడు కావలెను. ఉపాసకుడగుటయే అతని ఆధిక్యము నకు హేతువు. కావున ఆయన మరణించు కాల ముత్తరాయణ మగుటకాదు. బ్రహ్మోపాసకున కే కాలమునందు మరణించినను మరణకాలము ననుసరించి న్యూనత్వాధిక్యములు కలుగవు. శ్రీమద్భగవద్గీతలో **ధూమోరాత్రిస్తథా కృష్ణః షణ్మాసా దక్షిణాయనమ్ । తత్ర చాంద్రమసం జ్యోతిర్యోగీ ప్రాప్య నివర్తతే ॥** (పొగ రాత్రి, కృష్ణపక్షము ఆఱునెలల దక్షిణాయనము వీనిలో మరణించిన యోగి చంద్రజ్యోతిని చేరి తిరిగి వచ్చును.) **అగ్ని ర్జ్యోతిరహశ్శుక్లః షణ్మాసా ఉత్తరాయణమ్ । తత్ర ప్రయాతాగచ్ఛన్తి బ్రహ్మ బ్రహ్మవిదో జనాః ॥** (అగ్ని, జ్యోతి పగలు శుక్ల పక్షము ఆఱునెలల ఉత్తరాయణము. వీనిలో మరణించిన బ్రహ్మవిదులు బ్రహ్మను పొందెదరు.) ఈ రెండు గతులలో ధూమాది మార్గము పునరావృత్తి హేతువు అని అగ్న్యా (అర్చిరా)ది మార్గము బ్రహ్మప్రాప్తి హేతువు కావున పునరావృత్తి రహితమని చెప్పఁబడినది. ఇచట ధూమాదులు అర్చిరాదులు ఆయా మార్గములలో మార్గనేతలు కావున దక్షిణాయనోత్తరాయణములలో బ్రహ్మవేత్త మరణించినచో బ్రహ్మమునే పొందుదురని ఆ శ్లోకముల శ్రీ శంకరభగవత్పాద వ్యాఖ్యానము చెప్పుచున్నది. ఉత్తరాయణ మరణ ప్రశంస అవిద్వద్విషయము. స్మార్తము. శ్రౌతము కాదు అని గమనింపవలెను. ఛాందోగ్య బృహదారణ్యకోపనిషత్తులలో **తేఽర్చిషమేవాభి సంభవన్త్యర్చి షోఽహః అహ్న ఆపూర్యమాణపక్షమాపూర్యమాణపక్షాత్‌యాన్ షడుదఙ్ఞేతి మాసాంస్తాన్ మాసేభ్యః సంవత్సరమ్ సంవత్సరాదాదిత్య మాదిత్యాచ్చంద్రమసం చంద్రమసో విద్యుతం తత్పురుషోఽమానవస్స ఏతాన్ బ్రహ్మగమయతి** శరీరమును వీడిన జీవులు అర్చిస్సును, అర్చిస్సునుండి అహస్సును, అహస్సునుండి శుక్ల పక్షము, శుక్లపక్షము నుండి సూర్యుడు త్తరాయణమున సంచరించునాఱు మాసములను, ఆ మాసములనుండి సంవత్సరము, సంవత్సరమునుండి సూర్యుని, సూర్యుని నుండి చంద్రుని, చంద్రుని నుండి విద్యుత్తును

చేరగా, అచట నుండి ఆ అమానవ పురుషుడు వీరిని (బ్రహ్మను పొందించును) అను మంత్రమున్నది. అది గీతలో చెప్పని సంవత్సర, ఆదిత్య, చంద్ర విద్యుత్ అను నాలుగురినధికముగా చేర్చినది. "అర్చస్" అనుపదమే గీతలో అగ్ని జ్యోతి యని వివరింపఁ బడినది. ఈ ఉత్తరాయణ మార్గమున అర్చిస్సు అనునది మొదట నున్నందున నీ మార్గ మర్చిరాది మార్గమని చెప్పఁబడినది. ఈ అర్చిరాది మార్గమే కౌషీతక్యుపనిషత్తునందు దేవయానమని చెప్పఁబడినది. అట్లే మూర్ధన్యనాడి ద్వారా రశ్ములను చేరుట మరొక చోట చెప్పఁబడినది. బ్రహ్మసూత్ర చతుర్థాధ్యాయ తృతీయ పాదారంభమందలి అర్చిరాద్యధికరణమున ఉపనిషత్తులలో కొద్దిపాటి భేదమున చెప్పఁబడిన యట్టి మార్గములన్నీ అర్చిరాది మార్గమునందంతర్భవించినవేయని నిశ్చయింపఁబడినది. బ్రహ్మసూత్రచతుర్థాధ్యాయ ద్వితీయపాదము నందలి దక్షిణాయనాధికరణమున దక్షిణాయనమున మరణించిన వారికిని బ్రహ్మోపాసకుడైనచో బ్రహ్మ ప్రాప్తి నర్చిరాది మార్గముననే పొందునని నిశ్చయింపబడినది. అర్చిరాది మార్గమున బ్రహ్మోపాసకుడు ఆదిత్యమండలమును దాటి పోవుట చెప్పఁబడినది. ఈ గతి పోవుటయే ఈ శ్లోకములోని మూడవ పాదమున **భిత్త్వాదిత్యమ్** అని చెప్పఁబడినది.

అవ॥ పై శ్లోకమున బ్రహ్మోపాసకుని బ్రహ్మలోక ప్రాప్తి చెప్పఁబడినది. ఈ శ్లోకమున బ్రహ్మలోకమును పొందిన ముక్తుని కణిమాది సిద్ధులీశ్వరునికి వలెనున్నను జగద్వ్యాపార ముండదని చెప్పఁబడుచున్నది.

శ్లో॥ **ఉత్పత్త్యాదివ్యాహృతివర్జం త్వణిమాది**
స్యాదైశ్వర్యమ్ముక్తభవానాం విదుషాం చ ।
నావర్తంతే లోకమియం తే ఖలు శబ్దాత్
తం చిన్మాత్రం సాక్షిణమేకం శివమీడే ॥ 42 ॥

ప్ర॥ విదుషామ్ – బ్రహ్మోపాసకులైన, ముక్తభవానామ్ తు – సంసారము వీడిన వారికి మాత్రము, ఉత్పత్త్యాదివ్యాహృతివర్జం – ఉత్పత్త్యాదిరహితమైన, అణిమాది – అణిమాదిసిద్ధి సమూహ రూపమైన, ఐశ్వర్యమ్ – ఐశ్వర్యము, స్యాత్ – కలుగును, తే – వారు, శబ్దాత్ – వేదములో చెప్పఁబడిన రీతి, ఇయమ్ – ఈ, లోకమ్ – లోకమును, నావర్తంతే – మరల చేరరు, ఖలు – కదా, తమ్ – ఆ, చిన్మాత్రమ్ – చిన్మాత్రుడైన, సాక్షిణమ్ – సాక్షియైన, ఏకమ్ – ఒకడైన, శివమ్ – శివుని, ఈడే – స్తుతించెదను.

తా॥ బ్రహ్మ విద్యనుపాసించి క్రమ ముక్తి మార్గమున సంసారము వీడి బ్రహ్మ లోకమున చేరిన వారికి ఈశ్వరునకున్నట్టు అణిమాద్యైశ్వర్యము కలుగును. కాని జగత్సృష్ట్యాది రూపైశ్వర్యము మాత్రము వారికి కలుగదు. అయినను వేదములో చెప్పఁ బడినట్లు వారు మరల నీలోకమునకు తిరిగి వచ్చుట మాత్రము సంభవించదు.

వి॥ బ్రహ్మసూత్రచతుర్థాధ్యాయచతుర్థపాదము చివఱనున్న జగద్వ్యాపార వర్జాధికరణము నందు బ్రహ్మలోకమునకు సంసారమును వీడి యేగు ముక్తులీశ్వరుని తోడ సమానమైన ఐశ్వర్యము పొందెదరు. కాని ఆయనకున్న జగద్వ్యాపార జగత్సృష్ట్యాది వ్యాపారము మాత్రముండదు. అని సిద్ధాంతము చేయఁబడినది. అదే ఈ శ్లోకమున చెప్పఁబడినది. అందలి చివఱ సూత్రము **అనావృత్తిః శబ్దాత్; న చ పునరావర్తతే** అను శ్రుతి వాక్యము యొక్క యర్థమా సూత్రము చెప్పిన విధముగా నీ శ్లోకమునందలి మూడవపాదముకూడ చెప్పుచున్నది. సూత్రము చివఱ "శబ్దాత్" అను పదమున్నట్లే మూడవపాదము చివఱ కూడ నున్నది.

శ్రీః